
సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

సంపుటము 45
సంచిక 27
4-3-53

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

నందన ఫాల్గుణ బహుళ తదియ; బుధవారం



తిరుపతి వేంకటేశ్వరుని సన్నిధిని రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్.

విషయానుక్రమణిక

ముఖచిత్రం : నర్గీస్.

రచయితలకు మనవి

మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపేవారు వానిని త్రిప్పి పంపగోరినట్లయితే, రచనలూ చిత్రాలతోపాటు అవసరమైన స్టాంపులను గాని, స్టాంపులు అంటించి చిరునామా వ్రాసిన పెద్దకవర్లనుగాని చేర్చి పంపవలసిందని మనవి. అలా పంపేవారికి మాత్రమే వారి రచనలను గాని, చిత్రాలనుగాని ప్రచురించే ముందు ప్రచురణ విషయమై తెలియపరచగలము. మొదట స్టాంపులను చేర్చి పంపక, తరువాత ఉత్తరాలు వ్రాసి స్టాంపులు పంపినట్లయితే, వెతికి పంపడం కష్టమని రచయితలూ, చిత్రకారులూ గుర్తించ ప్రార్థన. ఈ సందర్భములో రచయితలు, చిత్రకారులు మాకు సహకార మివ్వగలరని ఆశిస్తున్నాము.

లోకం

రచన : మా లోకం

భూసార క్షయం—

భూసారంతగ్గి పోతోందిట. మనదేశంలో కరువుకి కారణాల్లో ఇదొకటి. కనీసం—ఆహారోత్పత్తి వృద్ధిఉద్యమానికి భూసార క్షయమనేది ప్రబల శత్రువుగా పరిణమించింది.

భూసారం క్షయం కావడానికి ప్రవీణులు ఏవేవో కారణాలు చెప్తారు కాని మన ఊళ్లూ, పొలాలూ, కాలవలూ, చెరువులూ, గట్లూ, కంపలూ చూస్తే ముఖ్యమైన కారణాలు వేరే కనపడతాయి. ఒక కారణం, నిలువుగా మధ్యకి మడతపెట్టిన టావు కాయితాల్లో కనపడుతుంది. ఆ కాయితాల నిండా ముత్యాల కోవవంటి (స్వ) దస్తూరీలూ, గొలుసు కట్టురాతలూ, అడపా దడపా అచ్చు అక్షరాలు, నల్లటి ముద్రలూ, కన్ను పొడుచుకున్నా కనిపెట్టలేని సంతకాలూ ఉంటాయి. ఊర్ధ్వాక స్టాంపు ముద్రలుంటాయి. మామూలు "......గారి కుమార్డు......", "......మైనర్ల తరఫు గార్డియన్......", "లేట్.........గారి భార్య......మ్మ గారు", "దివ్య సముఖమున్కు తేవడాన్కి.........వ్రాయించుకున్న విన్నవము" అనీ వాచకాలుంటాయి.

లెక్కలు తీసిచూస్తే కోర్టు వ్యాజ్యాలు ఈ అర్థ శతాబ్దిలో చక్రవడ్డీని పెరిగిపోయుంటాయి.

బ్యాంకులు, షావుకార్లు, కరణాలు, మొదలైన వారు రైతాంగానికి సహాయపడాలనే సదుద్దేశంతో తీసుకున్న "తన్హాలు" "స్వాధీన తన్హాలు" వగైరా—శ్రీనాథ కవిసార్వభౌముని భుజస్తంభ మెక్కిన 'నగరి వాకిట నుండు నల్లగుండు' మాదిరిగా—రైతు రాజుల భుజాలపై నల్లగుండులై వెన్ను విరగొడుతున్నాయి. తెల్లకాయితం మీద నూటికి అరుంబావలా వడ్డీల వెనకాల గొలుసుకట్టు అక్షరాల్లాగ దోబూచులాడే చక్రవడ్డీలు రైతు రాజుల్ని రైతు కాపరుల్ని చేస్తున్నాయి. ఇది మరో కారణం.

సాగుకి నీటిని సక్రమంగా సప్లయి చెయ్యడం కోసమే ఉండుకున్న పబ్లిక్ వర్క్సు డిపార్టుమెంట్ వారి ఆఫీసర్లు చేస్తున్న సహాయం కూడా 'కృషి సార క్షయా'నికి కొంతవరకూ కారణమే.

ఈ మధ్య కొత్తగా అబ్బిన మరో లక్షణం కూడా మరిచిపోలేం. ప్రజాస్వామ్యం ప్రజలలో అన్ని వర్గాలలోకీ ఇంకిపోడంకోసం, రాజకీయ చైతన్యం తీసుకురావాలని రకరకాల పార్టీలవారు చేస్తున్న కృషివల్ల ఈ లక్షణం అబ్బింది. ఎన్ని పార్టీలున్నాయో ఆ సంఖ్యతో ఉన్న కక్షుల్ని గుణిం చేశారు.

* * *

మళ్ళీ బైరాగి టిక్కట్లిస్తారట, ఏప్రిల్ నెలలో. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఎందుకివ్వడం లేదు? సాగుచేసుకునే రైతులూ సాగుచేసుకోని పట్టాదార్లూ ధాన్యం ధరలు పలుకుతున్నప్పుడే సొమ్ముచేసుకుని నిండు జేబుల్తో బయలుదేరతారు. అయితే ఇచ్చిన ధాన్యానికి పూర్తిగా సొమ్ము చేతికి రావడానికి ఏప్రిల్ వరకైనా గడుస్తే లాభదాయకమని రైల్వేవారు అంచనా వేసి వుండవచ్చు. (1951—52లో అమ్మిన ధాన్యానికి మిల్లులవారు 1952 ఆఖరులో చెల్లింపు పూర్తిచేశారు. దాని తాలూకు బోనస్ కూడా ఈ మధ్యనే ప్రభుత్వం సెటిల్ చేసింది.)

స్కూళ్ళ టీచర్లు విద్యార్థులు మే నెల ఆఖరున కాని, జూన్ నెలారంభంలో కాని ఈ టిక్కట్లు ఇవ్వాలంటున్నారు. అప్పుడు వేసవి సెలవులుంటాయి. పరీక్షల పేపర్లు దిద్దినందుకు అధికారు లిచ్చిన డబ్బు బైరాగి టిక్కట్ల రూపంలో మళ్ళీ ప్రభుత్వానికే అందవచ్చు.

—అయితే మే, జూన్ మాసాలవరకూ ఆగితే రైతులదగ్గర డబ్బు మిగలదేమో? టీచర్లవల్ల ఎక్కువొస్తుందా? రైతులూ పట్టాదార్లవల్ల ఎక్కువొస్తుందా? ప్రభుత్వానికి తెలుసు. అందువల్ల ముప్పైరూపాయిల టిక్కట్ల తీర్థయాత్రల సీజన్ మారక పోవచ్చు.

* * *

ఇటీవల రేడియోలో పూర్వ జానపద గీతాల్ని ఇంగ్లీషు వాఖ్యలతో ప్రసారం చేశారు. ఇవి విన్న వెంటనే సినిమాలు జ్ఞాపకం వచ్చాయి. సినిమాల్లో చూసి వినవలసిన పాటలు రేడియోలోనూ, కళ్ళు మూసుకుని రేడియోలో వినవలసిన పాటలు అభినయ సహితంగా సినిమాల్లోనూ తారసిల్లుతున్నాయి. ఈ జానపద గీతాలు కొన్నింటిని కొన్ని సన్నివేశాల్లో దృశ్య

వివరణతో సహా సినిమాల్లో కెక్కిస్తే ఎంత బాగుండు ననిపించింది. పాటకి పాటా, నృత్యానికి నృత్యం, కోరిన దుస్తుల వ్యవకలనంతో సినిమా నిర్మాతలు కోరుకునే వరాలన్నీ తీరవచ్చు.

*   *   *

నిన్న మొన్నట చీనాబజార్లో—

"ఏమండోయ్! ఏమిటీ! ఎప్పుడొచ్చారు?"

"ఇవాళేనండీ పొద్దున్న మెయిల్లో"

"ఏంరద్దీ? విదేశా వ్యాపారవిషయమా?"

"కాదండీ ఏదో చిన్న పనుండి..."

"మీ అమ్మగారూ, నాన్నగారూ కులాసాయేనా?"

"ఆ! ఆ!"

"ఏమన్నా ఆస్పత్రిలో పనా?"

"అహఁహ! కాదండి"

"ఓహో! హైకోర్టు కొంబోలు. ఏ హోటల్లో మకాం?"

"అదేం లేదులెండి...వస్తా."

"ఉంటారా, రెండు రోజులు?"

"లేదండీ రేపురాత్రి మెయిల్లో..."

"కిందటేడాది ఈ రోజుల్లోనే వొచ్చి నట్టున్నారు..."

"అవునవును...వస్తా."


అంతే. ఆ రెండో పెద్దమనిషి జనంలో కలిసిపోయాడు. సైకిల్ పంచికట్టు, పొడుగు చేతుల షర్టు, పైన కోటు, జరీఅంచు కండువా, ఆమీసాలు, మనిషి బాగా గుర్తే.

చట్టున గుర్తుకొచ్చింది: ఇది రెండో సీజనని. మొత్తం నాలుగు సీజన్లున్నాయి: ఒకటి డిసెంబరు నెలలో, రెండోది ఫిబ్రవరి, మూడోది మార్చి, నాలుగోది ఏప్రిల్. విషయం చెప్తాను—

మా సహవిద్యార్థి మేనమామ ఒక డున్నాడు. మేం చదువుకునే రోజుల్లో ఎప్పుడూ మమ్మల్నే అంటిపెట్టుకుని ఉండే వాడు. ఇప్పుడు మా వూళ్ళో కాలేజీ వొచ్చిన తరవాత పల్లెటూళ్ళో కాపరం ఎత్తేసి బస్తీకి వొచ్చేశాడు. మా సహవిద్యార్థి చదువు మానేసి వుద్యోగంలో చేరాడు. ఇప్పుడు అతని తమ్ముళ్ళు చదువులో వున్నారు. 'మేనమామ' అక్కడ స్కూల్లోనూ, కాలేజీలోనూ అందరికీ 'మేనమామ' అయినాడు. కాలేజీ వచ్చిన తరవాత ఇప్పుడాయన పని బాగానే వుంది.

'మేనమామ' అచ్చం ఈ రెండో పెద్దమనిషిలాగే వుంటాడు. విద్యార్థులందరికీ 'మేనమామ' పరమమిత్రుడు. మొదటిసీజన్ (డిసెంబర్) రాగానే 'డిటెన్షన్ విధానం' పైన దాడి చేస్తాడు. ఫిబ్రవరి రాగానే 'అచ్చు పేపర్లు' (పరీక్షా పత్రాలు) పట్టుకోడానికి 'మెడ్రాస్' వస్తాడు. కొద్దిరోజులిక్కడ పనిచూసుకుని వెళ్ళిపోతాడు. వెళ్ళగానే మా వూళ్ళో సంచలనం బయలుదేరుతుంది: గుసగుసలు, రాత్రివేళ వీధి దీపాల కింద నలిగిన కాగితాలు కళ్ళు పొడుచుకు చూడ్డం-వగైరా.

(56-వ పేజీ చూడండి)



గోడ మీద బొమ్మ

శ్రీ బలివాడ కాంత రావు (చిన్ననవల)

11

రవణమ్మ, రామం చెప్పమన్న మాటలు పార్వతితో చెప్పి అప్పుడే పదిహేను రోజులు దాటింది. పార్వతి భర్తతో మాటలు కలపడానికి ప్రయత్నిస్తోంది. అంతకుముందులా గ్లాసుతో పాలు రాత్రి భద్రం గదిలో పెట్టేటప్పుడు మౌనంగా వుండక, "ఇక్కడ పాలుంచానండీ!" భోజనందగ్గర మాటా మాటా కలుపుతూ, "కూర వెయ్యమంటారా? చారు కొంచెం వెయ్యొద్దూ?" అని వుండి వుండి మాటలాడటం ప్రారంభించింది. సమాధానాలు మాత్రం రావటంలేదు.

తను లేచిన వెంటనే తను విడిచిన అన్నం యెదురుగా కూర్చోవడం, తను లేచేసరికి కావలసినవన్నీ సిద్ధపరచటం; తనకు యిష్టమైన కూరలు వండటం భద్రం గమనించకపోలేదు. కానీ తను భార్యనుంచి కాంక్షించిన ప్రవర్తనలో యిది లేశ మాత్రము కాదు. ఇక తండ్రీ కొడుకుల మధ్య మాపులే లేవు. ఇద్దరిని చూచి బాధపడేది నరసమ్మ వొక్కతే.

సెప్టెంబరు నెల ప్రవేశించింది. అప్పుడప్పుడూ వర్షాలు కురుస్తున్నాయి. 15, 16 తేదీలలో బాగా ముసురు ప్రారంభించింది. కానీ వర్షం భోరున కురవలేదు. 17 వ తేదీ వుదయానికల్లా మేఘాలింకా చెదరకపోవడంవల్లను వుండి వుండి తుంపరలు పడుతున్నాయి. భద్రం మామూలుగా ఎనిమిది గంటలకు కొట్టుకు వెళ్లాడు. ఆవేళ అందరికన్నా ముందుగా వచ్చే రాములు రాలేదు. కొట్టు తలుపు తీసిన అరగంటకల్లా మిగతా పనివాళ్ళు యిద్దరూ వచ్చారు. భద్రం ఎదురుగా వుండటంవల్లను పనివాళ్ళు లేని పని కల్పించుకున్నారు. భద్రం యిదివరకులా కేకలు వెయ్యకపోవడం చూచి తమయొక్క కోర్కెలను, ప్రశ్నలను వెళ్ళగక్కుకునే సమయమని ఒకడు మెల్లగా దగ్గరకు వెళ్లాడు.

ఆనాడు రాములు రానందుకు భద్రం మాటిమాటికీ రోడ్డువైపు చూస్తున్నాడు. ఈ పనివాడు మాట్లాడేవరకు యీ ధ్యాసలో లేడు.

"ఏమన్నావ్?" అన్నాడు. "ఏమీ లేదు బాబూ. మీరు కొంచం చనువిచ్చారని అందరితోనూ తలోకరితో తలోలా చెప్తున్నాడు."

"ఏం చెప్తున్నాడు?"

రెండవవాడు ముందుకు జరిగి అందుకున్నాడు. "వాడి అరచేతిలో మీరు వున్నారట! మీ కొట్టు పనిపాట్లంతా వాడుండబట్టే నడుస్తోందట!"

మొదటివాడు మధ్యలో కలుగజేసికుని, "గర్వం యింతా అంతా కాదు బాబూ! మొన్న పెద్దబాబుగారికిఅర్జంటుగా చుట్టలు కావలసివచ్చి యింటికెళ్లరా అంటే, ఎంత చెప్పినా యెల్లాడు కాదు బాబూ!"

ఈ మాటలతో, తన ఆజ్ఞను నూరుపాళ్లూ శిరసావహించిన రాములుపైనున్న అభిమానం ద్విగుణీకృతమైంది. అయినా అనుకున్న ప్రశ్న వేసేసరికి ఇద్దరు జవాబు దొరక్క గిజగిజ లాడుకున్నారు. ముఖాలు తెల్లబోయి చూసుకుంటున్న వారిని, "వద్దంటే ఇంటికెందుకెళ్లావు?" అని మళ్లీ గద్దించాడు. మొదటివాడు మరో తుణానికి సర్దుకుని," "మీరు వాడిచేతికి తాళం యిచ్చి అక్కడికి యిక్కడికి వెళ్తే-వాడు దొంగవెధవ బాబూ!"

రెండవవాడు నెమ్మదిగా, "మొన్న వాడు సిగరెట్టు కాల్చడం చూశాను బాబూ!" అన్నాడు.

"అడుక్కునే కుర్రాడిని బాబుగారు దయతలిస్తే నిలబెట్టుకోవలనా? ఆ గుణాలెక్కడికి పోతాయి?" భద్రం నవ్వు సాధారణంగా చూడని యీ యిద్దరి పనివాళ్ళూ యజమాని ముఖంచూచి తృప్తిచెందారు. రాములు ఒకనాడు చాటుగా తనతో చెప్పినమాటలు జ్ఞప్తికి రావటంవల్లను వాడి తండ్రివయస్సులోఉన్న వీళ్లిద్దరికి, పదేళ్ళు నిండని ఆ కుర్రవానికి శీలంలోవున్న భేదాన్ని ఆలోచించుకుంటున్నాడు. పదిరోజుల క్రితమే ఆ సంఘటన జరిగింది:

"మరేమీ వాళ్ళని ఏయ్యనంటే, యీ సారికి అడగనంటే వొక సంగతి చెప్తాను బాబు" అన్నాడు.

"ఏవిటా సంగతి చెప్పు?" అని భద్రం అన్నాడు.

"ఈ వేళ వాళ్లవాళ్లెవరో వస్తే మూడు గజాలని ఐదు గజాలు కొలిసేసినాడు బాబూ! నానుమళ్లీకొలమంటె ఆ వచ్చినాడు నామీదలేచినాడు!"

అంతూపంతూలేని యీ వాడీలు అంత మన్నెవికావు కాని యింతలో ఏడేళ్లపిల్ల గుమ్మం దగ్గరగా వచ్చింది. పనివాళ్లిద్దరు, తెల్లారిందేం అంటూ గసిరేస్తున్నారు. ఆ కారునలుపు పిల్లకు ఎముకలు కనిపిస్తున్నాయి. మాసిన చిరిగిన లాగు వేసికుని వుంది. జుత్తు అంతా ముద్దలుముద్దలుగా అంటుకొనివుంది. కాళ్ళంతా బురదతో నిండివున్నాయి. ముక్కులో చీమిడి యెగ బీలుస్తోంది. వీళ్లిద్దరూ విరుచుకపడ్డా, ఆ పిల్ల తొణుక్కుండా గుమ్మం దగ్గర నిల్చుని "మా అన్న కొట్టు—మా యన్న కొట్టు - మరి - యిదా!" ఒకడుగు ముందుకు వచ్చి తగిలేబోతుంటే భద్రం కలుగజేసుకొని "మీ యన్న పేరు?"

"రాములు"

"ఇదే - లోపలికి రా!"

పనివాళ్లిద్దరూ ముఖాలు చూసుకున్నారు. ఇప్పటికి కనుక్కోగలిగానన్న సంతోషంతో ఆ పిల్ల లోపలికివచ్చి నిటారుగా నిల్చుని, "మరి - బాబో! మాయన్నకి జొరం! మాయమ్మ దండ పెట్టింది. మరి జొరం రేపు పోతాది. వత్తాడు - మాయమ్మ నాకూ యిలాగ దండ పెట్టమంది." అంటూ ఆపిల్ల చేతుల జోడించింది. భద్రం దరహాసవదనుడై ఆ పిల్లమాటలకు ముచ్చటగా చూస్తూంటే ఆ పిల్ల కానీకోసం చెయ్యిచాపింది. భద్రం అర్ధణా తీసి పిల్లచేతిలో పెట్టి నిల్చున్నాడు. ఆ పిల్ల దౌడు తియ్యబోతుంటే వెనక్కి

పిల్చాడు. అప్పుడే వచ్చిన సైలరు అరుగు మీద మిషను పెట్టుకుంటున్నాడు.

"ఏంవోయ్! యీ పిల్ల కొలతలు తీసుకో!" అన్నాడు. పిల్లకొలతలు తీసుకుంటూంటే కిష్టయ్య వచ్చాడు.

"బాబా! బేరం చూస్తూండు. ఇప్పుడే వస్తానంటూ భద్రం పిల్లవెనకాల వెళ్లాడు.

చిన్న చిన్న నీటి తుంపరులు పడుతున్నాయి. బొడారా రోడ్డువెంబడి వెడుతున్నారు. ఆ పిల్లత్రోవలో చాలా కబుర్లు చెప్పింది. కాగితంపడవలు చెయ్యడం వాళ్ళన్నయ్య నేర్పాడట. నిన్న వర్షంలో ఎన్నో పడవలు చేసి కాలవలో వదిలిందిట. ఆపిల్లమాటలకు వూకొట్టకుండానే నడుస్తున్నాడు. "మరి మరి-మాతాత సచ్చిపోతావే వర్షంలో తడవకే అని తిట్టినాడు. ఓ వానలో తడిస్తే సచ్చిపోతామా యేటి? ఆకలేస్తే సచ్చిపోతామే అని తాతే సెప్పినాడు. తాతవన్నీ అబద్ధాలే. ఎక్కడ మడితే అక్కడ దేముడుంటాడట. దేముడు గుడిలో వుంటాడుకాని మా గుడిసిలో వుంటాడా బాబూ! మాతాత ఎప్పుడూ దేముడో దేముడో అంటాడు. అంత మంచోడు మా గుడిసెలో కూకోగలడా?"

ఆ పిల్ల అభినయంతో చెప్తూ ముందుకు పోతూ, తనది నిజమని తను ఒప్పుకున్నాడో లేదో అని అప్పుడప్పుడు వెనుకకు తిరిగి తన ముఖంవేపు చూస్తూవెళ్తోంది. ఆరోడ్డు మలుపు తిరిగేసరికి రైల్వేలైను, ఆ లైనుకు అంటిపెట్టుకుని వున్న పెద్దవుప్పుప్ర వేపు చూశాడు.

మనుష్యుల మనుగడని సంశయపరచేవి యుద్ధాలు కావు. కొందరు యెత్తున వున్న మనుష్యులు దిగువన వున్న తోటి జనుల మానవత్వాన్ని గుర్తించనప్పుడే మనుష్యుల మనుగడయందు సంశయం కలుగుతుంది. ఆ స్థలమంతా పేదజనావళికి భహిర్భూమి - అన్ని కాలాల్లోను, సర్వవేళలందు లింగభేదం లేకండా బలవంతాన మానవత్వాన్ని చంపుకుని ఆ కొద్ది నిముషాలు సిగ్గన్నది మరచిపోతారు. అందులో వర్షాకాలంలో అర మైలువరకు ఆ దుర్వాసన బ్రహ్మాండంగా వ్యాపిస్తుంది. ఆ త్రోవనే పోయే రైలులోని మనుష్యులు ముక్కు మూసుకోకపోతే ముక్కులో వెంట్రుకలు మాడిపోవలసిందే. ఈ స్థలమే పోలీసువాళ్ళకి తమ వుద్యోగం నిలబెట్టుకోవడానికి పనికివస్తుంది. 'న్యూసెన్సు' కేసులు చూపించాలంటే ఏ సమయంలో అక్కడకు వచ్చినా కొంతమందిని పట్టుకోవచ్చును. ఈ పరిస్థితిని తప్పించడానికి నగరపాలకు లెంత శ్రద్ధ తీసుకున్నారో ఆలోచించేవా రెవ్వరూ లేరు. ప్లాటుఫారం ఎక్కి బీదజనావళి గురించి ఏకదమ్మున మాట్లాడే మహామహులు ఇల్లాంటి చోటును పొరపాటున అయినా చూసి వుండరేమో! మ్యునిసిపల్ ఆదిపీఠముపై కూర్చున్న వ్యక్తి యిది గ్రహించి వుంటే, సిమ్మెంటురోడ్లు వెయ్యటం మాని ఇక్కడ కొన్ని మరుగుదొడ్లను కట్టించేవాడు.

భద్రం తల వంచుకుని ముందుకు నాలుగడుగులు వేశాడు. చిన్నచిన్న చినుకులు పడుతున్నాయి. ఆ పిల్ల, రోడ్డు ఒడ్డున వున్న చిన్న దుకాణందగ్గర ఆగింది. పళ్లూడిన అవ్వతో పిల్ల బేరాలకు దిగింది. ఒక చిన్న దేవదారు డొక్కు మీద రెండు సీసాలు వున్నాయి. మూతవిరిగిన సీసాలో కొబ్బరివుండలున్నాయి. రెండవసీసాలో మాసిన పిప్పరమెంట్లు వున్నాయి. రెండో ప్రక్క ఈగలు, దోమలు ముసురుతున్న వంటసామానుంది. జంతికలు, చేగోడీలు, ముందురోజు చేసిన బూరెలు వున్నాయి. వర్షానికి ఆదుకోడానికి కర్రపాతి తాటాకు గొడుగు వేసుంది. ఆ పిల్ల రెండు బూర్లు తీసికుని అర్ధణా యిచ్చింది. దుర్వాసన విపరీతంగా వస్తుండటంవల్లను భద్రం ముక్కు మూసికుని యెదురుగా కన్పడుతున్న కొబ్బరితోటవైపు చూస్తున్నాడు. ఆ రోడ్డుకు పడమటవైపు కొన్ని ఇళ్లున్నాయి. ఆ వెనకనే రైల్వే లైనుకు అంటుకుని వుప్పుపర వుంది. రోడ్డుకు తూర్పువేపు ఒక చిన్న బావి, అందులో నీరు పాకుకొని పోయి ఆకుపచ్చగా వుంది. అక్కడే కొందరు స్నానం చేస్తున్నారు. కొంతమంది బట్టలుతుక్కుంటున్నారు. ఆ బావికి దక్షిణంగా కొంత వూబితో నిండివున్న స్థలముంది. అచ్చటచ్చట చేరివున్న నీటిపై దోమలు గుంపులు గుంపులుగా వున్నాయి. ఈ ప్రదేశానికి తూర్పుగా కొబ్బరితోట వుంది. ఆ తోటలోనే తాటిపాకలు ఒకదాన్ని అంటిపెట్టుకొని ఒకటి వున్నాయి. అక్కడకు పోవాలంటే కాలవగట్టే ఆధారం. కాలవగట్టు అక్కడక్కడ తెగి మళ్ళీ నీరు పైకి జారుతోంది. భద్రం ఆ పిల్ల వెనుకనే ముక్కు మూసుకుని వెళ్తున్నాడు. ఆ పిల్ల ఒకబూరె తింటూ రెండవది చేతిలో పట్టుకున్నది, "ఇది మా శీతగాడికి, అప్పికి" అంటూ వెనక్కి తిరిగి చూచింది. భద్రం మౌనంగానే విధిలేక నడుస్తున్నట్లు

మా పల్లెలో రైతు దంపతులు ఒకరు వుండేవారు. వారిద్దరూ పొద్దస్తమానం కుక్కల్లా కాట్లాడు కొంటూ వుండడం మావూరి వారందరికీ తెలిసిన విషయమే.

కొంత కాలానికి ఆరైతు తాను వుంటున్న యింటికి ప్రక్కనే మరొక క్రొత్తయిల్లు కట్టి, తనకాపరం అందులోకి మార్చాడు. పాతయింట్లో ఆయన పెళ్లాం వుంటూ వుండేది.

ఒకసారి ఎప్పుడో నేనూ, ఆయనా కలిసి ప్రొద్దునే పొలానికి వెళ్లి మిట్ట మధ్యాహ్నానికి ఆయన యింటికి తిరిగి వచ్చాం-తీరా వచ్చి చూసేసరికి మంచి మంచి వంటకాలు పెట్టిన గిన్నెలు మూతలు పెట్టివున్నాయి. అసలే ఆకలి మీద వున్నామేమో, ఆవాసనలకే నానోరు వూరిపోయింది.

"ఇంత కమ్మని వంట నీకెవరు వండి పెట్టుతున్నార"ని అడిగాను, నాకు అతనివద్ద వున్న చనువును బట్టి.

"అదే.మా యావిడ."

"మీరు యిప్పుడు వేరు వేరు కాపరాలు పెట్టుకొన్నారుగా?"

"అవును. అదే మా యావిడలో వుండే మజా. అది యింటిదిగా వుండేకంటె పొరుగింటిదిగా వుందంటే దానంత మంచిది మరొకర్తె లేదనుకోవోయ్" అని నాబుజం తట్టాడు.

శ్రీ కొవ్వూరి వేణుగోపాలరావు.

"ఈ జగమంతా ఒక నాటకరంగం
మనమంతా అందు పాత్రధారులం"
అన్నాడు మహాకవి షేక్స్పియర్
అన్నారు మహాజనం హియర్ హియర్.

"నటించటం అందరికీ చేతకాదు
నటన అందరి సొత్తూకాదు
కాబట్టి షేక్స్పియర్ చెప్పింది తప్పు
నే నిప్పుడు చెప్పబోయేదే ఒప్పు.
జగం ఒక బజారు నిశ్చయం
మనం అందు నడిచే బాటసారులం
నటన రాకపోయినా నడకమాత్రం
అందరికీ వచ్చుని ఒక నవకవి సూత్రం.

"అదీకాదు, యిదీకాదు యీ రెండూ
తప్పులనీ చెప్తున్నా వినుండూ
మున్నిదేంతో నో పోల్చట మేమిటి ఛ ఛ
నిజం నేను చెప్తున్నాను తు. చ.

మనం ఎవరూ కాదు మనం మనమే
జగం ఏదీకాదు జగం జగమే
జగంలో బ్రతుకుతున్న నరులం మనం
చేసుకోండి నా మాటల్ని మననం."
అంటాడో నైతికవాది తాజాగా
కానతన్ని మాటల్లోని మజాకా
తెలియలేదు నాకు నిజంగా
నా సందేహం నాకుంది ఘనంగా.

మనం మనంగాన బ్రతుకుతూ వుంటే
జగం జగంగా నడుస్తూ వుంటే
మనం చేస్తున్న అత్యాచారాలేమిటి?
జగంలో జరుగుతున్న ఘోరాలేమిటి.?

మానవత్వం లేకుండా మనం
ధర్మం, సత్యం లేకుండా జగం
ఉంటే మనం మనంగా జగం జగంగా
చెప్పుకుంటాం ఎలాగ, నగుబాటుగా?

గోడమీద బొమ్మ

వున్నాడు. ఆ గట్టు బురదగా వుండడం వల్లను రోడు బురదమయ మయింది.

ఆకుల్లు కాలువ నానుకునే యిళ్ళవరుస లున్నాయి. రెండువరసలకు మధ్య గజం వెడల్పు స్థలంకూడ బురదగావుంది. ఇంచుమించు ఆయిల్లు పందులదొడ్డిలావుంది గాని ఏమాత్రం మనుష్యుల నివాసానికి పనికి వచ్చేటట్టుగా లేవు. నలుగురు కూర్చోడానికి స్థలం చాలని ఆ యిళ్ళలో పదిమందికూడా కొన్ని యిళ్లలో వుంటున్నారు. ఇక వర్ష సమయంలో నా నీరంతా ఆ యిళ్ళలోనే వుంటుంది.

మనుష్యుడు అనాగరికుడుగా వున్న రే యుగంలోను యింతటి అసహ్యమయిన స్థలాల్లో నివసించివుండడు. చెట్టు తొర్రలలోను, కొండ గుహలలోను నివసించిన మనుష్యజాతి యీ పట్నంలో నివసించే వీళ్ళకన్న వెయ్యిరెట్లు అదృష్టవంతులని చెప్పాలి. పందులు దండుకూడ అక్కడ విహరించి తమ పనిచేసుకపోవటం భద్రం గమనించాడు.

భద్రం ఒక చిన్న పాకను ఆనుకుని ప్రక్కనే చిన్న నాలుగు తాటియాకులు వేసున్న పందిరను చూశాడు. ఆ పందిరకు నల్లటి వుట్టి కట్టివుంది. ఉట్టిలో మూతి విరిగిన మట్టికుండ, దాని మీద నల్లటిమట్టి చట్టి వున్నాయి. ఆ పిల్ల గబగబ ముందుకు పరుగెత్తి పందిరిమీద అరుస్తున్న కాకిని, "మాతెతగంజి తాగుతావే ముండా!" అంటూ అదిరించి చప్పున ఆ పాకలోనికి వెళ్ళిపోయింది. చిన్న వాకిల్లో కాళ్లుముడుచుకుని రాములు చింకిగుండ కప్పుకుని పడుకునివున్నాడు. ఆ పిల్ల చిరిగిన తాటియాకులచాప తెచ్చి వేసింది. లోనుంచి సన్నని స్వరం "దండం బాబూ! కూర్చోండి బాబూ!" ప్రతిరోజూ దండమని, యీమె కొడుకుద్వారానే విన్నాడు. కాని యీ రోజు ఆ అభిమానమైన గొంతుక వినగానే కొంతసేపు తనా అసహ్యమైన ప్రదేశంలో వున్నట్లు మరచిపోయాడు. రాములు నెమ్మదిగా లేచి, చేతులు జోడించాడు. అక్కడ భద్రం కూర్చోడానికి స్థలం లేదని తల్లి రాములును లోనికి రమ్మన్నది. పిల్ల చాపను సర్దటంతోనే భద్రం వంగి లోన కూర్చున్నాడు. తన కెదురుగా ఒక మనిషి వాకిట కూర్చుని తన వేపే కళ్ళప్పచెప్పి చూస్తోందని గమనించాడు. అటువైపు చూడకుండా వుందామన్నా వుండలేక పోయాడు.

"ఇక్కడికెందుకొచ్చారు బాబూ అంత మీకు యీడ్ని సూడాలనివుంటే నాను తీసికొద్దునే!" రాములు తల్లి దాలమ్మ లోనుంచే అంది.

"ఫరవాలేదమ్మా!" అన్నాడు భద్రం.

ఎదురుగా వాకిట్లో వున్న మనిషి సూరమ్మ పకపక నవ్వుతోంది ఆమెవైపు చూశాడు. ఎర్రటిచీర పల్చని తెల్ల జాకెట్టువేసుకుని యిరవైఏళ్ళ వయస్సులో అట్టే నలుపు కాని ఛాయతో యౌవనంతో బలిసి నిగనిగ లాడుతోంది. నోటిలో ఖారాకిల్లీ వుంటుందేమో నవ్వుతుంటే పళ్లంతా అసహ్యంగా కారెక్కివున్నాయి. ఇక ఆ ముఖానికి పౌడరుకొట్టి, బర్మాముడివేసి, చెవులకున్న గిల్టు జూకాలు వూగిస్తూంటే ఆ మనిషి ఎక్కడ చూచినా కళ్ళకు కడుతుంది. భద్రంవైపు చూసీ చూడనట్లె నటిస్తూ మధ్యమధ్యను కూనిరాగాలు తీస్తూంది. వుండివుండి కోరి జారవిడుస్తున్న పైటను సర్దుకుంటోంది.

చినుకులు మళ్లీ హెచ్చయినాయి. దాలమ్మ తన కబుర్లు తాను చెప్పుక పోతూంది. భద్రం మౌనంగానే వున్నాడు. ఈసారి సూరమ్మ, "ఎంత ఘాటు ప్రేమయో" అని కూనిరాగం తీస్తూంటే భద్రం ఆవంక మళ్ళి తలెత్తి చూశాడు. ఆ కళ్లు ఈసారి తనవైపే కోరికతోకూడి చూస్తున్నాయి. కిష్టయ్య హఠాత్తుగా జ్ఞాపకం వచ్చినా ఆ అవయవముల పొందికవైపు వుండివుండి చూడటం మాత్రం మానలేదు.

ఈసారి ఒక ముసలమ్మ వచ్చి సూరమ్మ ప్రక్కనే కూర్చుని చుట్ట ముట్టిస్తోంది. సూరి ఆ ముసలమ్మతో మాటలు ప్రారంభించి గట్టిగా తన పల్లెటూరి మొగుడు సంగతి చెప్తూంది. "ఆ మొగుడు ఒక క్షణమైనా నన్నిడిపెట్టి ఎల్లేవోడు కాడు." అంటోంది. ఒక క్షణం యిది కనబడక పోతే చచ్చిపోతాననేవాడట! అంచేత ఆ మొగుడుదగ్గరే ఎప్పుడూ కూర్చుని వుండేదిట! పట్నం పిల్లయినా యీ పల్లె పనులన్నీ ఎలా నేర్చిందని ఆ వూర్లో వాళ్లంతా ముక్కుమీద వేలేసుకునేవారట!

"అల్లాంటి మొగుడు నాను కన్నారింటికి బ్రతిమాలి వచ్చినాక నాలుగు నెలలు వుండి యెళ్లేసరికి యింకోముండని యింట్లో ఎట్టుకున్నాడు. ఏటి ఎవహారం అంటే నపుంశకుడనటే రంబ దొరికితే వొదిలీడానికి అన్నాడు. ఇలాంటి వాళ్ళంతా సీవ

రికి పెళ్ళిందగ్గరకి ఏమని వస్తారంటే, పెళ్ళమా పెనుబూతము - నీకు దండమే - నాకు దప్పికే!"

భద్రం యీ ఆఖరు మాటలు తనవైపు ఒక కన్ను పారేసి అంటున్నట్లు గమనించాడు. ఆమె మళ్ళీ వ్యాఖ్యానించింది. "మొకం తిప్పేస్తే ఆ మొగోడు మునీశ్వరుడా! ఆడదానిదగ్గర అంతా కుక్కలే నమ్మా! ఈనాడు కాకపోతే రేపైనా కాళ్లు పడితేనేగాని మొగాడికి గతి నేదు." అంటూ అంతవరకూ ఆమె నిర్లక్ష్యంగా విడిచిపెట్టిన పమిట ఒక్కసారి సర్దుకుంది. భద్రం దృష్టి ప్రక్కకు మరల్చి యీ మాటలతో చప్పున, "వస్తానమ్మా" అంటూ గుడిసె బయటకు వచ్చాడు. చినుకులు కొంచెం హెచ్చుగానే వున్నాయి. దాలమ్మ లోనుంచి "తడిసిపోతారు బాబూ!" అని అంటున్నా లక్ష్యం చెయ్యకుండా ముందుకు అడుగువేసి ముఖం వెనుకకు త్రిప్పాడు. ఆ కళ్ళు...!

ఉట్టిమీద కుండలోని గంజిని త్రాగడానికి ప్రయత్నిస్తున్న కాకి భద్రాన్ని చూచి ఎగిరిపోయింది.

ఆ వేళ రాత్రి నిద్రపట్టేవరకూ యీ కళ్లు మనసులో తిరగకపోతే తన గదిలో చాపవేసి పడుకోబోతున్న భార్యను పొమ్మని యిదివరలా అరచేవాడే!!

12


"బావా! ఎందుకులే!" అని వెంకట్రావు నవ్వేశాడు. అప్పుడే ఆఫీసు మెట్లు దిగివస్తున్నారు. రామం పరధ్యానంగా వుండినందున మరేమీ మాట్లాడలేకపోయినాడు.

"మంచి మనిషికో మాట, దున్నపోతుకో దెబ్బ! ఆ కిష్టయ్యని ఏమంటే ఏం లాభం? రోజూ సాయంత్రం ఆ రంగయ్యగారి దగ్గర ఏమైనా గుంజుదామని గరుడసేవ చేస్తున్నాడు."

"పోనీబావా! కిష్టయ్యమీద పగబట్టావెందుకు?"

"నాకెందుకు పగ? గొడ్డుమాంసం తింటూ దేవతార్చన చేసేరకం మనుష్యుల్ని చూస్తే నా ఒళ్లు మండిపోతుంది. నాకున్న స్వల్పజ్ఞానం వెధవది అన్యాయాన్ని యిట్టే పోల్చేస్తుంది." రామం మెల్లగా నవ్వాడు. ఇంతలో ఒక పోలీసు సబ్ యినస్పెక్టరు సైకిలుపై పోతూ వెంకట్రావుని చూచి విష్ చేశాడు.

వెంకట్రావ్ యీ వేళ కాకీనిక్కరులో గజంపదణాల పరక మేటీ సగం చేతుల కమీజుదోపి మొలకు మూడంగులాల తోలు బెలు చుట్టాడు. నిక్కరు బెండుకూడా



ప్రేమకలాపం

చిత్రకారుడు:—శ్రీ ఆర్. వెంకటరావు.

మూడంగులాలే వుంది. నల్లని పురాతనమైన జోళ్ళలో ఒకదానికి మాసిక వుంది.

"ఓయి బావా! ఇప్పుడు యీ సైకిలు మీద వెళ్ళే వ్యక్తిని చూశావు కదూ?" రామం మౌనంగానే చూశానని ఒప్పుకున్నాడు. వెంకట్రావు మొలకు చుట్టిన బెల్ట్ వైపు చూపిస్తూ, "ఆ సబ్ ఇనస్పెక్టరే యీ బెల్ట్ యిచ్చాడు! వాడు నాతో కొన్నాళ్లుపాటు సిగ్నలర్ గా పనిచేశాడులే. చీము నెత్తురువున్న మనిషి కాబట్టి యీపని వదలిపెట్టి పోయాడు. పదేళ్ళయింది యీ బెల్ట్ యిచ్చి, ఇస్తున్నప్పుడే మన్నాడంటే, మేజువాణి పనిచేత కానివాడిని, ముక్కు నూటిగా పోయే వాడిని, నిన్నొక్కడినే నా లైఫ్ లో చూశాను. నా జ్ఞాపకార్థం యిది వుంచి తీరాలన్నాడు."

వారంరోజులబట్టి మనస్సంతా వికా రంగావున్నా వెంకట్రావాడే మాటలతీరుకి రామం నవ్వాపుకోలేక పోయాడు. మాట వరస మార్చి యింతవరకూ చెప్పామని మరచిపోయిన విషయం చప్పున చెప్పాడు.

"అసలు సంగతి చెప్పలేదోయి! కుటుంబంలో నీకుండిన స్థానం!"

"ఏం?"

"అబ్బే ఏమీ లేదులే! నిన్ను వాళ్లు మరచిపోడానికి రెండు నెలలుకూడ అవసరం లేకపోయింది. జబ్బు హెచ్చుగా వున్న రోగికి డాక్టరు దేవునిలాగే కనిపిస్తాడులే - తరువాత ఆదేవుడే యమునిలా కనిపిస్తాడు! నివ్వాయింటికి యిప్పుడు వెడితే నివ్వలానే వుంటావ్?"

"పోనీ-మంచిదే" పాడినవ్వు నవ్వాడు.

"నవ్వుతాలు కాదు. ఈ కాలంలో ఎవ్వరినీ నమ్మలేం బావా! యీనాటిమాట

లేపుండదు. ఆ ముసలాయన యెదురుగా నీ సంగతి చెప్తే—"

"ఏం చెప్పావు?"

"ఎందుకు రాలేదో యేంటో వెళ్లి ఒక్కసారి కనుక్కోండని అంటే అందుకాయన అన్నారు - ఆలోచించకుండా మా రామం ఏపనీ చెయ్యడని - అసలు, బావా! ఆయనకు కొడుకంటే భయం తక్కువంటావా?"

రామంముఖం తృప్తితో తాండవించింది అది గ్రహించి శంకర్రావు ముఖం ముడు... పని అన్నాడు. "ఆ పార్వతి ఏదో అ...

★ గోడమీద బొమ్మ ★

కున్నాను. ఎప్పటిలా మొగుడి శాసనాలకు శిరసావహిస్తోంది. మీ అక్కయ్యతో మాట్లాడవద్దని భద్రం చెప్పాడట మానివేసింది! చూశావా వాడి గుణాలు? అదీ మా మంచికేలే .."

"నేనన్నమ్మను బావా!"

"మా ఆయన మాటలు మానేయమన్నారని పార్వతి చెప్తుందా? పనిమనిషి చెప్పింది, ఇవన్నీ మాటకేంకాని, నువ్వు వెలుగుండగానే యిల్లు చక్క బెట్టుకోవటం మంచిది !!

"నాకో యిల్లంటూ వుంటేగా!"

"ఇల్లరికం వెళ్ళిం తర్వాత అదేనోయ్ నీయిల్లు"

"నే ఇల్లరికం వెళ్లానని ఎక్కడ వ్రాసుంది?"

"కథ అడ్డం తిరిగిందే ఓయి పిచ్చివాడా! ఏమైనా నీబాగు నువ్వు చూసుకోకపోతే నీ పిల్లలు నీమీద ఏడుస్తారు నాకున్నది స్వల్పజ్ఞానమని నేను ఒప్పుకుంటాను కాని, నువ్వే ఆలోచించు అడిగితేగాని అమ్మయినా పెట్టదు తెలుసా?"

"అయితే నన్నేవరిని ఏమడగమంటావ్?"

"ఒక్కసారిగా నీకు నాలుగు మేడలు, పది ఎకరాల నిక్షేపంలాంటి గడ్డ వస్తే వదిలేస్తావటోయ్?"

రామం జవాబు చెప్పకుండా ఒక క్షణం వెంకట్రావు ముఖంవైపు చూచాడు. వెంకట్రావు చులకనగా మళ్ళీ అందుకున్నాడు

"నీకు డబ్బు చేదయితే అత్తారింటికి ఎందుకు వెళ్ళావు?" నవ్వుతూ, "రెండు వైపులా గుంజుదామనేగా?"

రామం ఏమైనా జవాబిస్తాడని వూహించి వూరుకుని, మళ్లీ నన్ను చాలామంది ముందుచూపున్న మనిషని అంటారు! అభిమానాలు ఎప్పుడూ అంటిపెట్టుకుని వుండవు, రంగయ్యగారు నీకు ద్రోహం చేస్తారని కాదు వాళ్లంతా ఏకమై ఆయనచేత ద్రోహం చేయించవచ్చు! కీడెంచి మేలెంచమన్నారు, బాగా ఆలోచించు"

రామం మాట్లాడకుండా వూరుకున్నాడు మనస్సులో సముద్రమథనం ప్రారంభమయ్యింది! ఇంతలో వెంక వెంకట్రావు తేలిగ్గా అన్నాడు.

"నీకు ఆస్తిపాస్తులతో పనిలేదేమో? ఇప్పుడాయన ఒక వేళ యిస్తానన్నా వద్దంటావేమో?"

రామం ముఖం ఎత్తి వెంకట్రావు బూరిబుగ్గలువైపు తివాసీ కత్తిరవేసిన తలవేపు చూశాడు. వెంకట్రావు మాటల్లో కొద్దిగా కోరి తెచ్చుకున్న కోపం మేళవించాడు - "చాలా మెత్తని మనిషివోయి నువ్వు! అమ్మాయీ మణుల్లా మిణుకు మిణుకుమని చూస్తావు కాని పిడికిలి పట్టి నిసలైన మొగాడ్ని అని నిరూపించుకోవు నాయుళ్ళ పౌరుషం నీలో కొంచమైనా లేదు ఏదైనా టకాటక్ తేల్చేయ్యాలి అయితే యింతకీ నీకు అసలా ఆస్తితో సంబంధం లేదంటావా?"

రామం క్లుప్తంగా మెల్లగా, "అలా అన్నానా?" అన్నాడు.

ఈ ఎదురుప్రశ్నతో, సంబంధం వుందన్నట్లు రామం ఒప్పుకున్నాడని వెంకట్రావు ఆనందించి, నవ్వుతూ మాటలు ప్రారంభించాడు. సుందరమ్మ యీ గడిచిన పదిహేనురోజుల్లోనూ కూతురు ద్వారా ఆస్థివిషయమై అడిగించినప్పుడల్లా రామం మౌనాన్నే ప్రదర్శించాడు ఇది ఆమెకు సహించటం దుర్భరమైంది. అల్లుడి పరిస్థితి చూసుంటే తనకా ఆస్థితో సంబంధం లేనట్టే వుందని వెంకట్రావును విషయం తేల్చడానికి పురికొల్పింది

తన పనిలో కృతకృత్యుడైన వెంకట్రావు ఆనందానికి మేర లేదు. "నా లైఫ్‌లో ఒకే ఒక ఏం బిషన్ వుందోయి!"

(53-వ పేజీ చూడండి)

మొదటి ఉత్తరం

(సమయం : సాయంత్రం 5 గంటలు.
సందర్భం : నులకమంచంపై కూర్చొని కమల చీర అంచుకు పూలు కట్టుకుంటూంది - పోస్టుమేన్ చేతిలోంచి నీలి రంగు కవరొకటి ఎగిరొచ్చి ఆమె ప్రక్కనే మంచంపై వ్రాలుతుంది...)

కమల : (కవరుపై చిరునామా చూచి) అమ్మోయ్. అన్నయ్యుత్తరం రాసేడే...

తల్లి : (గది ఊడుస్తున్న చీపురు చేతితో వదలకుండానే - ఆత్రంగా ఒచ్చి) ఏదీ - ఏదీ - ఏం రాసేడో చదువు.

కమ : చాలుచాలులే - పాపం! నీకూ నాకూ అనుకున్నావు గావాలి. ఆ రాజాగారు తన రాణీగారికి రాసుకున్నాడు... (గదివైపు తిరిగి) ...ఏమండోయ్! - వదినమ్మగారూ!...మీ ఆయనగారుత్తరం రాసేడు...వినిపించిందా?

(లోపల్నుంచే...ఒక గొంతు)...నాకు తెలుసులే నీ టక్కులు. ఒస్తే దాచుకో.

కమ : కోరి పిల్ల నిస్తానంటే కులం తక్కువన్నారట, నీలాంటి వాళ్లే ఎవరో. నాకేం? నన్ను విప్పి చదువుకోమన్నావా?

(లోపల్నుంచే...శారద గొంతు) చదువుకో - ఒద్దన్నానా ఏమిటి?

కమ : చూడమ్మా. నువ్వే సాక్ష్యం. నన్ను చదువుకోమ్మంది కదూ?-ఒకటి - రెండూ - మూ...

తల్లి : ఇదేంటే? - బాగానే ఉంది. దానుత్తరం నువ్వు చదువుతానంటావ్ - ఇలా తే.

కమ : ఆ పప్పులు నా దగ్గరుడకవమ్మా. ఆ అమ్మాయిగారి కక్కర్లేదంటే మధ్య నీకెందుకూ?

తల్లి : ఉత్తరాలు రానిదే రెండు మూడు సార్లుత్తినే పిలచి ఉడికించి చంపేవ్ దాన్ని ఇంతకుముందు. ఇప్పుడూ అంతే అనుకుంటుంది.

కమ : పోనిలే - నీకూ నాకూ ఏం? - ఉత్తరం కావలసొస్తే ఆవిడే ఒచ్చి తీసుకుంటుంది.

తల్లి : నీతో గట్టి చిక్కే - అమ్మాయ్. శారదా! ఒచ్చి ఉత్తరం తీసుకో...

కమ : (ప్రక్కకి చూచి)... చూసేవే అమ్మా! నీ కోడలేమీ ఎరగని నంగనాచంటావ్. ఎప్పుడొచ్చిందో ఏమో చూడు నక్కినక్కి వింటోంది మన మాటలు. అబ్బా! మొగుడు రాసిన ఉత్తరం చూడగానే మొహం చూడు ఎలా ఉబ్బిందో బూరెలాగ.

తల్లి : ఊరుకోవే నువ్వు మరీన్ని - అయినా నీ చేతిలో పడింది చూడు ఉత్తరం. బాగాన్నా—

కమ : ఏమమ్మా - ఏం? ఇంతోటి బంగార పుత్తరాన్ని కొరుక్కుతింటానా ఏమిటి?

తల్లి : దానుత్తరం దానికిచ్చెయ్ మరి. ఒచ్చింది కదూ?

కమ : నువ్వడగడమేమమ్మా?

తల్లి : ఎవరడిగితేనేం?

కమ : ఆ అమ్మాయిగారికి నోరు లేదా ఏం? అడుగుకోమను.

తల్లి : (శారదవైపు తిరిగి) నువ్వే అడగాలిటమ్మా శారదా! - అడిగి తీసుకో.

శార : నాకివ్వదత్తమ్మా. నువ్వే తీసుకుందూ. (జాలిగా అంటుంది)

కమ : చూడమ్మా ఆ గడుసుదనం. నన్నడగనన్నా అడిగిందా - నే నివ్వననడానికి.

శార : అయితే, యిలా తే...

కమ : అక్కడనుండడిగితే యిస్తానా ఏం? ఇక్కడకు రావాలి.

శార : అక్కర్లేదు. ఇలా విసిరీ—

కమ : అక్కర్లేకపోతే పోనీ – నాకేనా కావలసింది? - ఇక్కడకొస్తేనేగాని నే నివ్వనే యివ్వను.

శార : ఎవడికోసమిస్తావ్? - నువ్వు నీ తల్లో పేనూకూడా యిస్తుంది.

కమ : చూచేవా అమ్మా? - ఎంతమాటందో?-నీ కోడలికి నోట్లో వేలుపెడితే కరవడమే చేతకాదంటావ్?

తల్లి : అది అందంటే తప్పేముంది కమలా? దానుత్తరం దానికివ్వకుండా ఒక్కలాగే అల్లరి పెడుతున్నావ్.


కమ : అవున్నే - కోడలిపక్షం మాటాడకపోతే రేపు నీకు గంజిపొయ్యదు కదూ.

తల్లి : అవును. నువ్వు – అదీ - గంజి పొయ్యకపోతే నాకు పొట్టగడవదు...ఏం?

కమ : మరి నీకా పక్షపాత మెందుకమ్మా? - నే నల్లరిపెడుతున్నానంటావ్.

తల్లి : ఉత్తరం దానికిచ్చి-మరి.

కమ : ఒచ్చి తీసుకోమన్నానా...





"చూస్తేవే అమ్మా! నీ కోడలేమీ ఎరగని నంగనాచంటావ్.
ఎప్పుడొచ్చిందో ఏమో చూడు నక్కి వింటోంది మనమాటలు"

తల్లి : నీ దగ్గర కొస్తేమాత్రం నువ్వేక చిన్నగా యిస్తావా ఏమిటి? దాన్నింకా ఏం అల్లరిపెట్టి చంపుతావో అని అది భయపడుతుంది.

కమ : అవును. పాపం! అమాయక పిల్ల కదూ? - అందుకు భయపడుతుంది.

(ఈ కలాటా విని వంటింట్లోంచి ఎందుకో గదిలో కొచ్చిన ముసలమ్మ కరిటతో సహా సాక్షాత్కరిస్తుంది, రంగంలో)

ముస : ఏం శారదా! అలా నిలబడ్డావ్? ఏమిట్రా యీ గొడవ?

కమ : వచ్చేవా మామ్మా! రా! నీ కోసమే చూస్తున్నాం మేమంతా.

ముస : ఏం? ఏమిటి సంగతి?

కమ: చూచేవా మామ్మ ఈ విడ్డూరం? ఇలాంటివి మీ కాలంలో ఎప్పుడైనా జరిగేయా! నువ్వే చెప్పు? మొన్న మొన్న పెళ్ళయిందో లేదో అప్పుడే మొగుడూ పెళ్లాలమధ్య ఉత్తరాలు నడుస్తున్నాయ్..

ము: ఎవరు వ్రాసేరే? - ఎవరికి?

కమ: ఇంకెవరికి? - అదిగో నీ ప్రక్కనున్న రాణీగారికి వారి రాజుగారు రాసేరు.

ముస: ఏమిటి? - నిజంగానా?

'శారదానాథ్'

కమ: నేనేం చెప్పినా అబద్ధంలాగే ఉంటుంది మీకు. ఇదిగో నీలిరంగు కవర్లో పెట్టి మరీ పంపేడు. చూడుగా.

ము: ఏమోనమ్మా. మా కాలంలో యిలాంటి విప్పుడైనా ఎరిగామా? - పెళ్లై యిద్దరు పిల్లల తల్లులమయేదాకా మొగుడితో మాట్లాడ్డానికే సిగుపడేవాళ్ళం

కమ: ఆఁ అలా బుద్ధిచెప్పు మామ్మా - చూడు నంగనాచిలా ఎలా కూచుందో.

ముస: దాని తప్పేముంది? - ఈ కాలం అలాంటిది. నువ్వుమాత్రం? - అది పెళ్లయిం తర్వాతనన్నా ఉత్తరాలు తెప్పించుకుంది. నీకు మొగుడెవడో తెలుస్తే యిప్పటించే ఉత్తరాలు నడుపుదువు. అయినా ఈపాడు సినిమాలొచ్చి అందర్నీ మరీ పాడుచేసేయి.

కమ: అది కావాలనుకుంటున్నావ్? - నేను పెళ్లిచేసుకుంటేగా?

శార: ఏం మిస్సమ్మ వౌతావా?

కమ: ఇంకేమి టనుకున్నావ్?

శార: ఇలాంటికబుర్లు చెప్పేవాళ్ళని చాలామందిని చూసేంలే. వాళ్ళే పెళ్ళి కావాలర్రోయ్ అని గోలపెడతారు ఒకరికి.

కమ: మరేం? నీలాగే.

(58-వ పేజీ చూడండి)

వేరు పురుగు

ఆరామం, చిన్న పెద్ద కాకుండా వొక మోస్తరు పెద్ద పల్లెటూరు. ఆ వూరిలోని అన్ని యిళ్లకూ విశాలమైన పెరళ్లు, వాటిలో ఫలవృక్షములు, కూర పాదులు, పూలమొక్కలు, మంచినీళ్ళ బావులు వున్నాయి. అంచేతనే కాబోలు ఆపేరు వొచ్చింది. ఆ వూరికి చిన్న పంచాయతీ బోర్డు, బ్రాంచి పోస్టాఫీసు కూడా వున్నాయి. వూరి తూర్పు సరిహద్దుగా వొక యేటికాలువ ఎల్లప్పుడూ ప్రవహిస్తూ వుంటుంది. వూరికి పడమరగా సుమారు మైలున్నర దూరంలో రాజపురం అనే వొక పట్నం వుంది. ఆ పట్నంలో, పట్నానికి వుండవలసిన కోర్టులు, కచ్చేరీలు, స్కూళ్ళు, హాస్పిటలు, సినీమా హాల్సు, మొదలైన హంగులన్నీ వున్నాయి. సాధారణంగా ఆరామంలోని చాలామంది ఏదో పనిమీదయీ పట్నంలోనే దినములో చాలాభాగం గడుపుతూవుంటారు.

సరవన్న, వురఫు సర్వేశ్వరరావు, ఆరామంలో వొక గృహస్తు. అతనికి చిన్నతనంలోనే తల్లిదండ్రులు పెళ్లిచేసి వొక యింటివాణ్ణి చేసేరు. పెళ్లయిన కొద్ది రోజులలోనే తల్లిదండ్రు లిద్దరూ గతించేరు. ఆస్తి చేతికిరాగానే కిందూ మీదూ కానకుండా కర్చులుచేసి, దేశదిమ్మరై, కొన్నాళ్ళకి చెల్లని దమ్మిడీలాగ తిరిగీ స్వగ్రామానికి వొచ్చేడు. అప్పటికి మిగిలినది సగం పడిపోతున్నయిల్లు, యెదిగి పుట్టింటిలోనే వుండిపోయిన భార్య. ఆమెను తీసుకుని వెళ్ళమని అత్తవారు పదేపదే బలవంతం చెయ్యడంవల్ల జీవనాధారం యెలాగా అని ఆలోచించేడు. ఆ స్వంతా సున్న చుట్టి దేశాలు తిరగడంవల్ల అతనికి లోకజ్ఞానం బాగాకుదిరింది. పేచీలకు పెదబాబు నారదాంశ బాగా పట్టింది. అతనివద్ద మెచ్చుకోదగినది వక ప్రజ్ఞవుంది. చిన్ననాడు తండ్రి స్వయంగా యింటివద్ద వరవళ్ళు పెట్టి కాపీలు (యింగ్లీషు, తెలుగు) వ్రాయించడంవల్ల, దస్తూరీ ముత్యాలకోవలాగుండేది. రెండుచేతులతోను సాఫుగా వ్రాయగలడు. స్కూలు ఫైనలు వరకు చదివేడు. దేశసంచారంవల్ల ఇంగ్లీషు భాషలో మాట్లాడగలడు. యివన్నీ ఆధారం చేసుకుని రాజపురంలో కోర్టులకు, యితర ఆఫీసులకు, మార్కెట్టుకు, దగ్గరగా వొక కొట్టు తీసుకుని డాక్యుమెంటు రైటరుగా పనారంభించేడు. ఎవనిమీదైనా కన్ను వేశాడంటే వాణ్ని యేదో మాయోపాయం చేసి గోతిలో దింపేడన్నమాటే. పొద్దుట లేచిందిమొదలు యెవడిమీద అస్త్రం ప్రయోగించి డబ్బు లాగడమా అని ఆలోచిస్తూనే వుంటాడు. కొద్ది నెలలకే అతడి రాసి బాగుండడంవల్ల సబురిజిస్ట్రారు, పోలీసువారు, మేజిస్ట్రేటుకచ్చేరీ వారు పరిచయస్తులయ్యేరు. కొంత ధనార్జనకూడా చేసి యిల్లు మరామత్తు చేయించి భార్యను తెచ్చుకున్నాడు. అతనిపని బాగుండేది. గ్రామంలో అందరు భయంకొద్దీ అతనిమాట కెదురుచెప్పేవారు కారు. సరవన్న నా వూళ్ళో లక్ష్యపెట్టనివాడు వొకడే. అతనిపేరు పెద్దయ్య. అతనికి కాలవకింద సుమారు అరవై యకరాల పల్లం తాతలనాటినుండీ వుండేది. అదంతా స్వంతసేరీకింద వుంచుకొనేవాడు. పెద్దయ్య ఇంగ్లీషుచదవకపోయినా, అమరం, ఆంధ్రం బాగా చదువుకుని రెండు భాషల్లోను మంచి జ్ఞానం సంపాదించి తీరిక కలిగినప్పుడల్లా ఏదో గ్రంధమో, పురాణమో చదువుకునేవాడు. తగువులంటే అతని కిష్టంలేదు. ఎవరేనా తనవద్దకు సలహాకి వస్తే సరియైనసలహా యిచ్చేవాడు.

2

అది పుష్యమాసం. సంక్రాంతి పండుగముందు. చలిబాగా వేస్తూంది. సరవన్న తెల్లవారకమునుపే లేచి, దుప్పటీ కప్పుకుని చెవులు మూసేటట్టు పాగా చుట్టుకుని, వొక చుట్టముట్టించి, మరొకచుట్ట అగ్గిపెట్టె బనియను జేబులో పెట్టుకుని వూరి బయటకు, కాలవగట్టుకి బయలుదేరుడు. కర్షకులు వరిచేలు కోసి కుప్పలు కళ్ళాలలో వేసి వుత్సాహంగా పాటలు పాడుకుంటున్నారు. సరవన్న కాలకృత్యాలు తీర్చుకుని పండుగ కర్చులకి ఎవరినుండి డబ్బు పిండుదామా అని ఆలోచిస్తూ వక పొలం గట్టుమీదనుంచి నడిచి వస్తూండగా, ఆ గట్టుకి పడమరగా వున్న పొలంగట్టు కొత్తగా వేసినట్టు కనబడింది. తక్షుక్కున అతని బుర్రలో వొక స్కీము మెరిసింది. తాను నిలుచున్న మడి సన్యాసనే రైతుదని తెలుసును. ఆ సమయానికే కొంతదూరంలో సన్యాసి కనపించేడు. అతడు తన వైపే వొస్తూండడం చూసి సరవన్న గట్టుదిగి అడుగులు లెక్కపెట్టుతున్నట్టు కనపడేలాగ యీ గట్టు దగ్గరనుంచి ఆగట్టుకీ, అటునుంచి యిటూ రెండు మార్లు నడిచి తిరిగీ గట్టు యెక్కి నిలుచునేసరికి, సన్యాసి కూడా అక్కడికి చేరి, "ఏటి బాబూ! సరవన్న గోరూ! అదేటి పొలం కొలుస్తున్నారాయేటి." అనడిగేడు.

"ఆ!! అలాగే. చూడు సన్యాసీ. యీ పొలం నీదేకదూ. దీనికి పడమర వున్న పొలం యెవరిది?"

"అదా!" అని వేలుచూపుతూ "అది యెంకన్నగోరి సూరన్నది."

"అలాగచెప్పు! ఏమైనా సూరన్న గట్టివాడే. అయినా నా కెందుకీ పిసరుకోసం అక్కర్లేనిగోల" అంటూ చుట్ట నోట్లో పెట్టుకుని అగ్గిపుల్ల వెలిగించాడు.

"ఏటిబాబూ పిసరేటి. నాకేటీ తెలకుండా వుంది. కూంతసెప్పండి బాబూ."

"అబ్బే! ఏమీ లేదు. నిరుడుకోతలైంతరవాతయీలాగే వకనాడునీపొలాని కడ్డంగా నడిచేను. యిప్పుడు దూరంనించి చూస్తే వెడల్పు తగ్గిందేమోననిపించి అడుగులు లెక్కపెట్టుకుంటూ, ఎందుకేనా మంచిదని అటూ యిటూ నడిచేను"

"ఏటి తమరు సెప్పేది?"

"ఏం లేదు. చూడూ ఆగట్టు సూరన్న కొత్తగావేశాడా! కొంచెం, మూడడుగులిటొచ్చిందేమో నని అనుమానం"

"అయితే బాబూ! యీ మూడడుగులూ సూరన్న ఆడిపొలంలో కలిపేసుకున్నట్టే?"

"అబ్బే గట్టు వెయ్యడంలో పొరపాటయ్యుంటుంది. దానికోసం పెద్ద చర్చ చెయ్యడం నాకిష్టంలేదు సుమీ."

"మూడడుగులు కలిపేసుకుంటే చెర్చొద్దంటారా బాబూ! మనం వొల్లకుంటే

మళ్లీయేటికి మరి మూడడుగులు కలుపుతాడు. తవిరెలాగేనా కటాచ్చించి నాబూమి నాకొచ్చేట్టుసెయ్యాలి బాబూ"

"నాకు తగువులంటే యిష్టం లేదు. అయినా నువ్వు పట్టుదలగా వున్నావు. ఆలోచిస్తాను. పది గంటలకి యింటికిరా చెప్తాను."

వేసిన బీజం నాటిందికదా అని సంతోషిస్తూ, మధ్యదారిలో సూరన్న కళ్లం దగ్గిర కొచ్చి అతణ్ని వెంటనే తనవద్దకి రమ్మని చెప్పి యిల్లు చేరుకున్నాడు. సరవన్న కాఫీ తాగి వీధరుగుమీద కూర్చుని కాయితాలు వ్రాసుకుని, వంటైందని తన అక్కగారు చెబితే స్నానంచేసి భోజనంచేసి, తాంబూలం, చుట్ట సేవించి రాజపురం వెళ్ళడానికి దస్త్రాలు కట్టుకుని సిద్ధంగా వున్నప్పుడు సూరన్న వొచ్చాడు. "దండాలు బాబూ! సరవన్నగోరు. ఏటిసేసం, రమ్మన్నారు?" అన్నాడు.

"ఏమీ లేదు. వొక చిన్న భోగట్టా నిన్నడుగుదామని. చూడూ, నీ పొలం సన్యాసిపొలానికి పడమరగా వున్నదే కదూ?"

"అవును బాబూ."

"దానికీ సన్యాసి పొలానికీ మధ్యనున్న గట్టు నీదేగదూ?"

"నాదే."

"అది కొత్తగా కనబడుతూందే. రిపేరీ చేసేవా ఏంటి."

"పీతలు, ఎలికలు పెద్దకన్నాలెట్టేస్తే గట్టు కూలిపోయి నీరు నిలవలా. అంచేత గట్టంతా మళ్ళా పోసేను బాబూ."

"అంతేనా! మరేమీ లేదుకదా?"

"మరేటుంతది బాబూ! యింతకీ తమరెందు కిదంతా అడుగుతున్నారు. ఏమైనా వుందా యేటి?"

"వుంటేనేం, లేకపోతేనేం. నాకెందుకా ఘోష. నేను పోవాలి. అర్జంటుగా సబు రిజిస్ట్రారుగార్ని కలుసుకుని దూపాడు రైతుల దస్తావేజులు రిజిస్టరీ చేయించాలి"

"బాబూ! ఏదో అనే సెల్లిపోతానంటే యెలాగ? అదేటో సెప్పెసెల్లండి."

"అయితే చెప్తాను విను. నువ్వు సన్యాసి పొలంలో నిలువునా వుత్తర దక్షిణాలకు మూడడుగులమేర కలిపేసుకుని కొత్త గట్టు వేశావని అతగాడి అనుమానం. ఏదో పోలీసు రిపోర్టు అంటూవుంటే నేను తారసమై యేమిటని అడిగితే యిదీ కథ. తెలిసిందా. నేను పోవాలి. నువ్వెళ్లు. రాత్రి తొమ్మిది గంటల తరవాత నువ్వు కళ్లానికెళ్ళేటప్పుడు రా. ఏమైనా విశేషాలుంటే చెప్తాను. నేను తొందరగా పోవాలి."

సూరన్న వీధిమలుపుతిరుగుతూవుండగా సన్యాసి వొచ్చి "ఏటి బాబూ! సూరన్న తవురికాడికొచ్చేడా యేటి? మలుపు తిరుగుతుంటే సూసినాను."

"ఆ! నేనే నీపొలం ఆక్రమణ గురించి భోగట్టా చేదామని రమ్మన్నాను."

"ఏటంతాడు బాబూ?"

"కొత్తగట్టు వేసినట్టు వొప్పుకున్నాడు గాని వొక జానెడైనా నేల కలుపుకోలే దంటాడు."

"తంరేటంతారు?"

"నేననడం యేమిటోయ్! నీ భూమి సూరన్న దురాక్రమణ చేసేడని నీకు నమ్మకం వుంటే, అది మళ్ళీ నువ్వు సంపాదించాలంటే వెంటనే సివిలు, క్రిమినలు చర్యలు జరిపించాలి. నేను పట్నం పోవాలి. నీ కిష్టమైతే యిప్పటికి యాభై రూపాయిలు పట్టుకుని వొక గంటలో పట్నంలో నా ఆఫీసుకురా. నా పనులన్నీ వెనకబెట్టి ముందు నీవిషయమై వకీలునీ, పోలీసు సబిన్స్పెక్టరుని కట్టుదిట్టం చేస్తాను. మరి నేను వెళ్తా."

"బాబూ! యీ సంగతి పెద్దయ్య సెవిని నేత్తే ఏటయినా సేత్తాడేమో."

"అది నీయిష్టం. కాని సూరన్న అలాగ చెప్పతూవుంటే పెద్దయ్య ఏంజేస్తాడోయ్. వొస్తే వో గంటలోపున రా. లేకపోతే నీ

★ వేరు పురుగు ★

కర్మం. నేను మళ్లా సాయంకాలందాకా దొరకను. వొస్తే యీవాళ్లా నీపనిమీదే తిరగాలి."

"అయితే డబ్బెట్టుకొని వొస్తాను బాబూ."

సరవన్న రాజపురం వెళ్ళి తన కొట్టు తెరిచి కౌయితాలేవో రాసుకుంటూ సన్యాసికోసం యెదురుమాస్తూ వుండగా సుమారు గంటన్నర తరవాత అతడు వొచ్చేడు.

"ఏమోయ్! యింతాలిస్యం చేసేవు? డబ్బు తెచ్చేవా?"

"మాయమ్మ మెళ్లో తీగ కోమటి సుబ్బన్న దగ్గిర తాకట్టెట్టి యీబై తెచ్చేను. ఆ కోమటి గంట తిప్పలుబెట్టి మరీ డబ్బిచ్చేడు బాబూ, అంచేతాలిస్యమైంది."

"ఆడబ్బిలాతే. యిప్పుడు వకీలుగారు కోర్టుకి వెళ్లిపోయుంటారు. మనం ముందు సబిన్స్పెక్టరుగారిదగ్గిర కెళ్దాం."

3

పోలీసుస్టేషను బయటి వరండాలో బెంచీమీద సన్యాసిని కూర్చోబెట్టి సరవన్న లోపలికెళ్లి సబిన్స్పెక్టరు సుందర్రావుగారికి నమస్కారం చేసి నిలబడ్డాడు. ఆయన "హల్లో నారదా! ఏం విశేషం? యీలాగొచ్చేవు?" అని పలకరించాడు.

"చిత్తం! వొక చిన్నభూమి తగాయిదాగురించి మీసలహాకోసం వొచ్చేను."

"ఏమిటీ! అది వెట్టా (*wet*), డ్రైయా (*dry*)."

"అట్టే వెట్టూ కాదు. అట్టే డ్రైయీ కాదు. ఓపాళంగా వుంటుంది."

"అంటే?"

"వో పదిలైన్ను కంప్లెయింటు. అడుగో ఆ బెంచీమీద కూచున్నాడు కంప్లెయింటు. చిన్న సంసారి. తమరు కటాక్షించాలి."

"యీపిసరుకి నా టైం వేస్టు చెయ్యలేను. పెద్ద మర్డరుకేసు యిన్వెస్టిగేషనుకి నేను బొంబాయి, కలకత్తా, యింకా అవసరమైతే నార్తిండియా అంతా గాలించి కూపీలు తియ్యాలి. అయినా నువ్వు చెప్పేవు కాబట్టి జీ. డీ.లో నోటుచేస్తాను. ఏం జరిగింది?"

"ఫిర్యాది మామిళ్ల సన్యాసి, సాకీను ఆరామం. వృత్తి వ్యవసాయం. అతని పొలానికి పశ్చిమంగా గరువుసూరన్న అనే రైతు తాలూకు పొలం వుంది. అతను తన పొలానికీ సన్యాసి పొలానికీ మందడిగా వున్న గట్టు రిపేరిచేయించేమిషపై కొత్త గట్టు వేస్తూ ఫిర్యాదీతాలూకు పొలంలో నిలువునా వుత్తరదక్షిణాలకు మూడడుగుల మేర దురాక్రమణ చేసేడు. అదీ కంప్లెయింటు."

"వోయ్! తొంభైయారూ! ఆ సన్యాసినిలా పిలువు"

వొక కనిస్టేబు "సన్యాసీ! సన్యాసి!" అని పిలిచేసరికి సన్యాసివొచ్చి అందరికీ నమస్కారంచేసి నిలుచున్నాడు.

"ఏమోయ్! సూరన్న అనే ఆసామీ మీ యిద్దరిపొలాలమందడి గట్టు రిపేరు చేయించడం నీకు తెలుసునా?"

"సిత్తం బాబూ తెల్సును"

"అయితే నువ్వప్పుడడ్డేవా?"

"నేదు బాబూ."

"ఎంచేత?"

"ఆడి గట్టాడు బాగు చేసుకుంటే నాకేటని వొల్లకున్నాను."

"మరి యిప్పుడీ తగు వెందుకు?"

"నా పొలంలో కొంత కలుపుకున్నాడని అనుమానం బాబూ."

సరవన్న అప్పుడందుకున్నాడు. "అనుమాన మేమిటి నీ మొహం! నిశ్చయంగా కలుపుకున్నాడు. అడ్డడానికి వెళ్లితే వొక్కణ్ణీ చేసి యీఆసామీని సూరన్నా, కూలి వాళ్ళూ నానాదుర్భాషలూ ఆడి మెడపట్టి గెంటివేసేరు. అంచేతే తమవద్ద ఫిర్యాదు. అంతేకదూ సన్యాసీ."

సన్యాసి తల గోక్కుంటూ "సిత్తం బాబూ." అన్నాడు.

"సరే సాక్షు లెవర"ని సుందర్రావుగారడిగేసరికి సరవన్న ఎవరివో మూడు పేర్లు చెప్పేడు. సన్యాసి తెల్లబోయి చూస్తున్నాడు. సరవన్న అదివరకే తాను వ్రాసి వుంచిన వో తెల్లకౌయితం రావు పరిచేసి సుందర్రావుగారి కిస్తూ "నేను మనవిచేసిన పదిలైనుల గ్రంథం ఆ రావులో వున్నది. తమరు చిత్తగించి తగు శ్రద్ధచేసి దర్యాప్తు జరిగించాలి. శలవా?"

"సరే! నేనైనా, హెడ్డు వెంకటేశం అయినా వస్తాం."

కోర్టు లంచి టైముకి సరవన్న, సన్యాసి బారు రూం ద్వారందగ్గిర కాసేరు. లాయర్లు వొకరొకరు వొస్తూ వాళ్ళిద్దరినీ చూసి కొంచెంసేపు నిలబడి లోపలికి వెళ్లిపోతున్నారు. ఎడ్వొకేటు సారంగపాణి గారు వొచ్చేసరికి సరవన్న నమస్కారం చేసేడు. సారంగపాణి ఆరు నెల్ల కిందట ఎడ్వొకేటుగా ఎన్రోలై రాజపురంలో మునసబుకోర్టు, సబుకోర్టూ వున్నాయని అక్కడ బోర్డు కట్టేడు. వయసు సుమారు యిరవైమూడు సంవత్సరాలుంటాయి. యిటువంటి కొత్త వకీళ్ళకే దావాలు వొప్పజెబితే వుభయత్రా లాభిస్తుందని సరవన్న వుద్దేశం. సరవన్నను చూసి సారంగపాణి నమస్కారం అందుకుని, "ఏమండీ సరవన్నగారూ! ఏం విశేషం? అతడెవరు?"

"చిత్తం. అతనిగురించే తమ దరిసెనానికి వొచ్చేను. తమకు తీరుబాటుగావుంటే యీలంచి యింటర్వలులో తమతో చిన్న సలహా చెయ్యాలని వొచ్చాం."

పేరు మోసిన డాక్టరుగారు ఆవేళ పెళ్లాన్నీ బిడ్డల్నీ వెంట బెట్టుకొని బీచికి షికారు వెళ్లారు. అక్కడ ఎవరో వన్నెల విసనకర్ర ఎదురై డాక్టరుగారి కేసి చూసి ముసి ముసి నవ్వులు నవ్వి, ఒక దణ్ణం పారేసి వెళ్లిపోయింది.

డాక్టరుగారి భార్య డాక్టరుగారిని అడిగింది– "ఈవిడ ఎవరూ" అని.

"ఆఁ! ఎవరో! వృత్తి ధర్మాన్ని బట్టి తారసిల్లాం. అంతే!" అన్నాడు.

"ఎవరి వృత్తి ధర్మం?" అని ఆవిడ అడిగింది.

"తీరుబాటా! ఆ మాట మన భాషలో వుందా? చచ్చిపోవాలంటే తీరుబాటు లేదు. సబుకోర్టులో వొక విడో తరఫున వారసత్వం అప్పీలు పడేశాను. హీరింగు అవుతున్నాది. ముఖ్యమైన సాక్షిని విచారణ చేస్తున్నాను. జడ్జీగారు లంచికైనా దిగకుండా పది నిమిషాలు టైమిచ్చేరు. మీరొచ్చిన పనేదో వేగం తేల్చెయ్యండి."

"తమరు టిఫిను చేస్తూవుంటే మనవి చేస్తాను. తమకు వున్న పని నాకు తెలియదూ? ఓయ్! సన్యాసీ, వకీలుగారికి ఆ ఇడ్డెన్లు, నాలుగు దోసెలు, రెండు మైసూరుపాకులు, రెండు ప్లేట్లు బాదం హల్వా, రెండు కప్పుల కాఫీ, పాలఘాటు కాఫీక్లబ్బుకెళ్ళి పట్రా. రెండు మంచి మిరాకిల్లీలు కూడాను. నీకివన్నీ జ్ఞాపకం వుంటాయో లేదో" అని వొక చీటి వ్రాసి, రెండు రూపాయిలు చేతిలో పెట్టి పంపించేడు. తరవాత సరవన్నా, వకీలుగారూ బారు రూంలో వొక బెంచీమీద కూర్చున్నతరవాత వకీలుగారు "ఏమిటండీ దావా?" అన్నారు.

"యీ రైతుతాలూకు పొలంలో సుమారు పది సెంట్లు పొరుగునున్న రైతు దురాక్రమణ చేసేడు. అందుకు దావా."

"ఎలాగ చేసేడూ?"

"తనపొలంగట్టు పాడైపోయిందని, అది తీసి వేసి కొత్తగట్టు వేయించే మిషమీద యీ పదిసెంట్లూ ఆక్రమించేడు."

"యిందులో విశ్వామిత్ర సృష్టి యేమీ లేదుకద. ఏమాత్రమైనా అబద్ధం వుంటే యీ కొత్తమునసబుగారు వుగ్రుడైపోయి కేసుకొట్టీయడమే కాకుండా పార్టీని పెర్జరీ నేరం కింద ప్రాసిక్యూషనుకి కూడా ఆర్డరు వేస్తారు."

"అలాటిదేమీ లేదు. అయినా దావా బలంకోసం చిల్లర, చిల్లర సాక్ష్యాలు పంపన్నాలు బనాయించాలి. యెంత నిజమైన దావా అయినా కొంచం అబద్ధంకలియందీ బలపడదు కదండీ. ఎంత మంచి బంగారమైనా కొంచం రాగి కలిస్తేనే గాని గట్టిపడదు."

"అయితే మనఫీజెంత నిర్ణయించారు?"


"చిత్తం. దావా ఆస్తి విలువ తక్కువ. రైతు బీదవాడు. తమరు చూస్తూనే వున్నారు, తమ టిఫినుకోసం డబ్బు నేనే యిచ్చేను. అంచేత సెంటుకి రూపాయి చొప్పున పదిరూపాయిలకు కుదిర్చేసరికి నాతాతలు దిగొచ్చేరు."

"యింతేనా! యీ భాగ్యానికి నన్నెందుకు చంపుతారయ్యా!"

"తమరలా అనకూడదు. చిన్నా, పెద్దా అనకుండా యేది వస్తే అది వకాల్తా పట్టితే గాని ప్రాక్టీసు అంటుకోదు. తమది పిన్న వయస్సు. నేను చెప్పినది తోసెయ్యకండి. మధ్యదారిలో గున్నయ్యగారడ్డితే తప్పించుకుని తమవద్దకే వొచ్చేను. కేసు గెలిస్తే మరింత ముట్టజెప్పిస్తాను."

సన్యాసి టిఫిను తెచ్చింతరవాత వకీలుగారూ సరవన్నా యిద్దరూ టిఫిను తిని, వకాల్తా ఫారంమీద సన్యాసి వేలుముద్ర వేయించినతరవాత లాయరుగారు కోర్టుహాలుకీ, సరవన్నా, సన్యాసీ సరవన్నకొట్టుకీ వెళ్ళేరు. అక్కడ సన్యాసి, "బాబూ! ఆ వొకీలెక్కడ దొరికేడు తవురికి. పుల్లిపిచికనాగున్నాడు. గొంతుకనేదు. మాట తడుముకుంటున్నాడు. నారాయణరావు, అప్పారావు గోరిలాంటి వొకీళ్ళకిస్తే బావుండునేమో."

"ఆ! వాళ్ళదరిసెనం దొరకదు. దొరికిందా నూరురూపాయీల నోటు కనపడితే గాని మనవేపు చూడరు. మన దావా బలమైనదీ, నిజమైనదీని. ఏవకీలు పట్టినా



వేరుపురుగు

కుళువుగా కర్చులతో సహా డిక్రీవొస్తుంది. అదిగాక, సారంగపాణిగారంటే లాకొయిలాకొయివకీలనుకున్నానా రేమి. ఆయన మద్రాసులో వొక సంవత్సరం ప్రాక్టీసు చేసేరు. (ఎప్రెంటిసు!). అప్పుడు జెడ్జీలకే తప్పులు దిద్దితే, ఎలాగైనా వొదిలించుకుందామని వెంటనే డిస్ట్రిక్టు జడ్జీ పనియిప్పిస్తాం వెళతారా అంటే, అది తన స్వేచ్ఛకి ఆటంకం కలిగిస్తుందని, వొద్దని, అక్కడుంటే వాళ్ళతో రోజూ తగువే అని యిక్కడికి వొచ్చేసేరు. మనిషి చిన్నయితేనేం, గొంతుక చిన్నదైతేనేం; వొక్కొక్క లాపాయింటు తీసేసరికి అంత జడ్జీగారూ ఆగవలసిందే. చీమ్మిరపకాయ చిన్నదికాదూ. ఆయన్ని దావా వకాల్తాకి వొప్పించేసరికి నాతల ప్రాణం తోక్కొచ్చింది. నువ్విచ్చిన యాభైరూపాయిలూ ఫీజుకింద బతిమాలుకుని యిస్తే నేకానిపుచ్చుకోలేదు. టిఫినుకిచ్చిన రెండురూపాయీలు నాచేతివే. రేపు వుదయమే మనం ఆయన యింటికెళ్లి కాయితాలన్నీ రాయించాలి. వాలంటరీకి పదిరూపాయిలు పట్టుకొనిరా, నామాటకేం. దావా గెల్చి మళ్లా నీభూమినీకొస్తే నాకంతే చాలు."

చీకటిపడే వేళకి వాళ్లిద్దరూ కలిసి ఆరామం వెళ్లిపోయేరు. ఆ రాత్రి. సరవన్న భోజనంచేసి పీధరుగుమీద కూర్చునివుండగా సూరన్న, చలికి వొక పచ్చడం కప్పుకుని, వొక దుప్పటీ తలకిచుట్టి, వొకచేతిలో పెద్ద బాపాటికర్ర, వొకచేతిలో హరికేను లాంతరుతో వచ్చి సరవన్నకు దండంబెట్టి కొంచెం దూరంగా కూచున్నాడు.

"బాబూ! సన్యాసి మాటేటి? తమకేమైన తెల్చిండా?" అనడిగేడు.

"మనం అనుమానించినట్టే చేసినట్టుంది. సబినస్పెక్టరుగారూ, సారంగపాణిగారు కనుపించి చెప్పేరు. సివిలూ, క్రిమినలూ కూడా జరిపిస్తున్నట్టున్నాది."

"మరెలాగ. తంరే దకలు పుచ్చుకుని రచ్చించాలి" అని కొంచెం ఆలోచించి, "మా పెద్దయ్యతో సెబితే యేటైనా సేస్తాడేమో?"

"నీయిష్టం. అలాగే చెయ్యి. నన్నడిగిన భోగట్టా నేను చెప్పేను. అయినా సూరన్నా! వొక సంగతి చెప్తాను. కోప్పడకుండా విను. పెద్దయ్యంటే నాకూ గొప్ప గురే. దేవుళ్లాంటివాడు. కాని అతనికి పురాణాల్లోను, వేదాంత గ్రంథాల్లోను ఏముందో తెలిసినట్టు కోర్టులూ, కేసులూ, పేచీలు ఏం తెలుస్తాయి? అతణ్ణి సలహా అడిగేవనుకో. రాములవారంతటివారికే కష్టాలొచ్చేయి. కృష్ణభగవాన్లకీ నీలాపనింద లొచ్చేయి. మనమనగా యెంత; వొచ్చిందేదో దైవంమీద భారంవేసి అనుభవించాలి, అని వేదాంత చెప్తాడు. కాని పేచీకి పైపేచీ వెయ్యలేడు. నిజమేనా?"

"నిజమే బాబూ. అయితే నన్నేటి సెయ్యమంతారు?"

"రేపు వుదయం చల్లంది తిని తిన్నగా రాజపురం వెళ్ళి నా ఆఫీసుదగ్గిరుండు. చేతిలో వో యాభైరూపాయిలు పట్టుకురా. నేను వొచ్చి తక్కిన పనంతా చేస్తాను."

"ఎటిసేస్తారు బాబూ! రూపాయిలెందుకూ?"

"ఓయ్ వెర్రివాడా! డబ్బులేకపోతే నిన్నూ, నన్నూ చూసేవాళ్ళెవరు? అది వుంటే కొండని పిండిచెయ్యగలం. మొట్టమొదట మనం వెళ్ళి హెడ్డుగారిని కలుసుకుని మాట్లాడాలి. తరవాత గట్టి వకీలుని పెట్టుకోవాలి."

"సబినసపెకిటోరిని మానేసి హెడ్డుగో రెందుకు బాబూ?"

"నీకేం తెలుసు. పనంతా నడిపించేవాడు హెడ్డు. సబినస్పెక్టర్లు, ఇనస్పెక్టర్లు గుళ్లో దేవుళ్లలాగ కూచుని పనంతా వీళ్ళచేత చేయిస్తారు. యీసవాళ్లన్నీ యెందుకూ? వొక్కమాట చెబుతాను విను. నీకీ గ్రంథం నడిపించడం యిష్టమై, నామీద నమ్మకం వుంటే నేను చెప్పినట్లా చెయ్యి. లేకపోతే వొక దండం పెట్టేసి, నీ యిష్టం వొచ్చిన వాళ్ళ సలహా తీసుకుంటావో, చేతులు ముడుచుకుని కూచుంటావో, నీకు తోచినట్టూ చెయ్యి. నాకు నిద్దరొస్తున్నాది. వుదయం వేగంగాలేచి చాలా కాయితాలు రాసుకోవాలి."

"తమరు సెప్పినట్టూ సేస్తా బాబూ. ఎలాగైనా రచ్చించాలి."

"నీకు భయమేమిటీ! నువ్వేమైనా ద్రోహం చేస్తేకదా."

"తంరికి తెల్దా? అంతటికీ తంరే వున్నారు." సూరన్న కళ్లాని కెళ్లిపోయేడు.

మర్నాడు సరవన్న కొంచెం ముందుగానే రాజపురంవెళ్ళి సూరన్న రాగానే అతను తెచ్చిన యాభైరూపాయిలూ పుచ్చుకుని పోలీసుస్టేషనుకు బయల్దేరి వెళుతూ వుండగా దారిలో హెడ్డు కనబడగానే ఇద్దరూ నమస్కారంచేసి నిలబడ్డారు.

"ఏమండీ సరవన్నగారూ! యీ పక్షి యెవరు? ఏమిటి సంగతి?"

హెడ్డుకి కంటితో సంజ్ఞచేసి, "చిత్రం! తమ దరిశనానికే వెళ్తూవుంటే వెతకబోయిన తీగ కాళ్లకి తగిలిందన్నట్టు తమరే యెదురుపడ్డారు. తమరు నిలుచునే వున్నారు. అలా రీడింగు రూములోకి దయచేయండి. వో ముఖ్యవిషయం తమతో మాటాడాలి. ఏమోయ్ సూరన్నా. హెడ్డుగారికి వో మంచి ఆరెంజిబుడ్డీ కొట్టించి గ్లాసులో పోయించి, వొక కత్తెరమార్కు సిగరెట్టు పెట్టే, వొక అణామిఠాకిళ్లీపట్టా. పక్కవీధిలో బంగారయ్యదుకాణంకి వెళ్లు. మంచివన్నీ అక్కడుంటాయి. యీ రూపాయి తీసుకెళ్లు."

రూపాయిచ్చి సూరన్నని పంపించిన తరవాత యిద్దరూ రీడింగురూంలో కుర్చీలపైని కూచుని మాటలారంభించేరు. "ఏం బాబూ ఏమిటిసంగతీ?" అన్నాడు హెడ్డు.

"ఏమీ లేదు. యీ సూరన్న తన పొరుగురైతు సన్యాసితాలూకు పొలం ఆక్రమించేడనీ, ఆ సందర్భంలో అతణ్ణి నానా తిట్లూ తిట్టి మెడబట్టి గెంటించేడని ఫిర్యాదు. అది దర్యాప్తుచెయ్యడానికి మిమ్మల్ని పంపుతానని సబినస్పెక్టరుగారు శెలవిచ్చేరు. అదేదో మీరు తేల్చేయాలి."

"నిన్న నా సన్యాసితాలూకు ఫిర్యాదు కూడా మీరే దాకల్చేయించినట్టుందే? కుడీ యెడమా కూడా వాయిస్తున్నారే."

"ఏవాయింపూ లేకపోతే బతకడం యెలాగ? మీ వంటి ఆఫీసర్లస్నేహం సంపాదించడం యెలాగ?"

"పెద్ద హోదాయిచ్చేరే. మీ నోటివాక్యాన్ని అలాగే అయితే యింకా క్యారటు సంపాదిస్తాను."

"తప్పకుండా తమరు కాకపోతే మరెవరున్నారు వడానికి? మరి యీతగవు మాటేం జేస్తారు?"

"అయితే యెంతపాలం ఆక్రమించేడని తగువు? పెట్టుకోవలసిన అర్జీ తయారైందా?"

"ఏమాత్రమండీ. అయిదుమైళ్లు."

"యింతేనా ? దీనికోసమేనా ఎండలో దేవుడా అని మైలున్నర నడిచి తిప్పట పడ్డం ?"

"చిన్నదని వొదిలేస్తారా? చిన్నదొస్తే చిన్నదీ, పెద్దదొస్తే పెద్దదీ పరిష్కరించాలి. రైతు మోతుబరి కాడు. కటాక్షించండి. అర్జీ యిదిగో కవరులో వుంది."

పుచ్చుకుని "సరే. రేపుసాయంకాలం వొస్తాను. మూడుగంటలకి. అయితే అవతల పార్టీ మాటేంజేస్తారు ?"

"అతడప్పుడే సివిలు నడిపిస్తున్నాడు. రేపు మీ రొచ్చేవేళకి నేను బాజోమై పోతాను. వుభయపార్టీలూ మీ చేతిలో వుంటారు. మీరే యెలాగో వోలాగ చూసుకుని పరిష్కరించండి."

నూరన్న ఆరెంజి వగైరాలు తెస్తే అవి ఆరగించి పేష్కు, "నూరన్నా ! నీకూ సన్యాసికీ రేపు సాయంకాలం మూడుగంటలకి మీ వూరుసంతబయులులో హాజరుగా వుండమని తాఖీదులు యీవేళ పంపుతాను. మీరు వెళ్లండి. రాంరాం."

సరవన్నా, నూరన్నా కలిసి వకీలు గున్నయ్యగారింటికి వెళ్తూవుంటేదారిలో నూరన్న "బాబూ ! ఏ వొకీలుగారికాడ కెల్తున్నారు? పెద్దవొకీళ్లయిళ్లన్నీ దాటేసినామే ?"

"ఎడ్వొకేటుగున్నయ్యగారింటికోయ్."

"గున్నయ్యగారంటే ఆ కుర్రోడు గాదా ? అరికేటితెల్చును బాబు యీ చిక్కులు ?"

"చాల్చాలు! ఆయన ప్రజ్ఞ నీకేం తెలుసు. నెల్లాళ్ళకిందనే వొక దావా హైకోర్టు వరకూ వెళ్లి మళ్లా యీ కోర్టుకు రిఫరైంది. పార్టీ అదృష్టంకొద్దీ నాదగ్గిరకి సలహా కొచ్చేడు. వెంటనే నేను గున్నయ్యగారికా దావా వొప్పజెప్పేను. అందులో ఆయువుపట్లు మూడే పాయింట్లు తీసి వాయిదా నాటికి రడీఅయి వాటిమీద అర గంటసేపు ఆర్గ్యుమెంటు చెపితే బారు బారంతా నిశ్చేష్టులైపోయేరు. జడ్జీగారు కూడా హైకోర్టులో తెగని చిక్కు యిట్టే విడదీసేరని మెచ్చుకుని వెంటనే పార్టీ పక్షంగా డిక్రీయిచ్చేసేరు. అసలు గవర్నమెంటువారీయనకి డబ్బిచ్చి పైచదువుకి యింగ్లాండు, అంటే సీమదేశం పంపుతామంటే ముసలి తల్లిదండ్రులమీద భక్తికొద్దీ వారికోసం యిక్కడే ప్రాక్టీసుపెట్టేరు. నూరన్నా ! వొక్కమాటచెబుతాను విను. నేను యెంచిన వకీళ్లు లాకాయ లూకాయ గాళ్లు కారు."

నూరన్నకు గట్టినమ్మకం కుదిరింది. వుత్సాహంగా వకీలింటికి వెళ్లేరు. అక్కడ వకీలుగారి ప్రైవేటురూంలోకి సరవన్న వెళ్లి, సంగతిచెప్పి ప్లెయింటు దాకలైంతరువాత కాపీతీసుకుని స్టేటుమెంటు తయారు చెయ్యిచ్చునని ఆయనకు పదిరూపాయిలు ఫీజిచ్చి, పైకి వొచ్చి, నూరన్న చేత వేలుముద్రలు వేయించాడు. బయటకొచ్చేక

★ వేరుపురుగు ★

సూరన్న "బాబూ రెండురూపాయిలిస్తారా? పండక్కి అల్లుడొస్తాడు మా యమ్మికి సిలుకుజాకిట్టు కొంటాను." అన్నాడు.

"రెండురూపాయిలా! నువ్వు మాస్తానే వున్నావు నీయాభై యెలాగ ఖర్చయేయో. వకీలుని అరగంట కుండకొడితే నే గాని యాభైకి వొప్పుకోలేదు. యింకా ఆయనకి పదిరూపాయిలు బాకీపెట్టేను. హేడ్డుగారి సోడా వగైరాలకి నాచేతిరూపాయిచ్చేను. నువ్వువెళ్లు. నాపనులు చూసుకుని సాయంకాలానికి యిలు చేరుకుంటాను. యీవేళ యిక్కడే వొటేలులో భోంచేస్తానని మా యింటిదగ్గిర చెప్పు."

సూరన్న తనకు తెలిసినవాడుంటే అతనివద్ద అప్పుచేసి మంచి పట్టుజాకెట్టు కొని యింటికి పంపించి తాను కళ్లాని కెళ్లేడు.

4

ఆరోజున సూరన్న కళ్లాని కెళ్లి వొక చిన్నకుప్ప నూర్పించి, గాలికి పోయించి, ధాన్యం బండి కెత్తించి, యింటికి సుమారు రాత్రి పది గంటలకి వొచ్చేడు. దారిలో, తనపైన అన్యాయంగా వొచ్చిన తగాయిదా గురించే విచారిస్తూ వొచ్చేడు. అతని భార్య వెంకటలక్ష్మి మేలుకుని వుంది. ధాన్యం కొట్లో పోయించి భార్య యిచ్చిన వేడినీళ్ళతో స్నానం చేసి భోజనం చేస్తూవుండగా వెంకటలక్ష్మి భయపడుతూ సాయంకాలం పోలీసు కనిస్టేబు లొచ్చి, మర్నాడు సాయంత్రం మూడు గంటలకి సంత బయలులో తప్పకుండా హాజరవాలనీ, హేడ్డుగారొస్తున్నారనీ చెప్పి వెళ్ళేడని చెప్పి, యిదంతా యేమిటని అడిగింది. జరిగినసంగతంతా భార్యతో చెప్పాడు సూరన్న.

"మామా! యీ తగువు పెద్దయ్యతో చెప్పితే ఆ సన్నాసిగాడి నోట్లో గడ్డెట్టి బుద్ధి సెప్తాడు. ఆ పాపిష్టోడు సరవన్న కాడి కెందు కెల్లినావు" అంది వెంకటలక్ష్మి.

"సన్నాసి, సివ్వలు, కిరిమినేలు, సీసేడు. పెద్దయ్య గుమ్మం దాటి బైటి కెల్లనో ఏటి సేస్తాడు? సరవన్నకి కోరట్ల యెవ్వారాలు బాగా తెల్సు. అయినా రేపు హేడ్డొచ్చిల్లింతరవాత యీ గోరం పెద్దయ్య సెలినేస్తాను." సూరన్న కళ్ళానికి వెళ్లిపోయేడు.

మర్నాడు సాయంకాలం సైకిలు మీద హేడ్డుగారు వొచ్చేసరికి సూరన్న సంత బయలులో హాజరుగావున్నాడు. సన్నాసిని తిన్నగా తగాయిదా పొలానికి రమ్మని వొక పసువుల కాపు కుర్రాడిచేత కబురంపి, వీరిద్దరూ అక్కడికి రెండు ఫర్లాంగుల దూరంలో వున్న పొలానికి వెళ్ళేరు. హేడ్డు పొలంగట్టు మీద యీ చివర నుంచా చివరకి నడిచి వొచ్చి—అన్నాడు.

"సూరన్నా! కొత్త గట్టు వేసేవే. వేసినప్పుడు సన్యాసితో చెప్పేవా, అతడిష్టపడ్డాడా?"

"నాగట్టు నేను బాగుసేసుకోడానికతగాడిష్టమేటి బాబూ. అయినా సన్నాసితో సెప్పేయేసినాను."

"అయితే అత డడ్డుపడలేదూ?"

"నేదు బాబూ."

"అయితేఅప్పుడు తనుఅడ్డినట్టు,అప్పుడు నువ్వూ, కూలివాళ్ళూ అతణ్ని మెడపట్టి గెంటివేసి నానాతిట్లూ తిట్టేనట్టూ ఫిర్యాదు చేసేడే. అడుగో సన్యాసి వొస్తున్నాడు. అతణ్ణికూడా దర్యాప్తుచేస్తాం". యింతలో సన్యాసి వొచ్చాడు. హేడ్డు "ఏమోయ్! సరవన్న యెక్కడ?" అని అడిగాడు.

"నాకు తెల్దుబాబూ."

"అయితే నీ ఫిర్యాదులో సంగతులన్నీ నిజమేనా?"

"నిజమే బాబూ"

"సాక్షులెవరు?"

"నా వొక్కణ్నే వుంటే యీ మాయదారి పనిసేసినాడు."

అప్పుడు సూరన్న "సన్నాసీ మాలచ్చింమీద నిలబడున్నావు. అబద్దాలాడితే తలపగులుద్ది." అనగానే హేడ్డు, "చప్! మేం దర్యాప్తు చేస్తూవుంటే మధ్యనీ గొడవేమిటి? నువ్విలాగారా" అని కొంతదూరం తీసుకొనివెళ్ళిన—

"సూరన్నా! నువ్వు అతడి పొలం ఆక్రమించినట్టు నిదర్శనాలు చాలా వున్నాయి. ఏమంటావు?"

"అంతా అబద్దం బాబూ. అమ్మోరి గుళ్ళో పెమాణంసేస్తాను. దేముడితోడు."

"అమ్మోరు, దేవుళ్లూ యీ రోజుల్లో పలుకుతారటోయ్. కీలకం అంతా మన దర్యాప్తు రిపోర్టులో వుంది. అటుపైగ్రంథం అంతా దానిపైని ఆధారపడుతుంది"

"తమ సెలవైతే అలాగ సేస్తాను బాబూ. రచ్చించాలి."

హేడ్డు అతనితో ఏదో చెప్పి గట్టిగా, "సరే నువ్వు, ఇంటికివెళ్లి ఏమి చెప్పదలుచుకుంటావో అంతా రాయించి వొక కవరులో పెట్టి తీసుకునిరా. యీలోపున సన్యాసిని కూడా దర్యాప్తుచేసి రిపోర్టు రాస్తాను."

సన్యాసి దగ్గర కొచ్చి, "ఏమోయ్! సాక్ష్యంలేని ఫిర్యాదు చేస్తావా? మరో తగుమనిషిని రచ్చకీడుస్తావా! జాగ్రత! ఫాల్సురిపోర్టు కింద నిన్నిప్పుడే యెరస్టు చేసి కొట్లో వేస్తా"ననేసరికి సన్యాసి గడగడలాడిపోయాడు "సిత్తం! రచ్చించినా, సంపినా తమరే పెబువులు. ఏటి సెయ్యమంటే అది సేస్తాను. రచ్చించాలి." అనేసరికి సరేనని అతనితో కూడా కొంతసేపు మాట్లాడి అతన్ని కూడా యింటికి పంపి వాళ్లు తిరిగి వొచ్చేసరికి తన రిపోర్టు వ్రాసుకుని వాళ్లిచ్చిన కాయితాలు జేబులో వేసుకుని, ఖుషీగా రాజపురం వేపు సైకిలు తిప్పేడు హేడ్డు.

సన్యాసి యింటికిగాని, పొలానికిగాని వెళ్ళాలంటే పెద్దయ్య యింటిముందునుంచే వెళ్ళాలి. సూరన్నభార్య పెద్దయ్యతో ఆనాటిసాయంకాలమే జరిగినదంతా చెప్పియేడ్చింది. మర్నాడు సన్యాసి పొలాని కెళ్తుంటే దారిలో పెద్దయ్య పిలిచి యీ విషయం అడిగేసరికి సన్యాసి కొంచెం చిరాకుగా "బూమి సూరన్నాక్రమిస్తే వొల్లకుంటానా?" అన్నాడు.

"అయితే దావా తెచ్చేవా? సరవన్న సలహాయేనా?" అన్నాడు పెద్దయ్య.

"ఆ! ఎవురికి కోరటు పోగట్టాలు తెలిస్తే ఆరి సలహా. పనుంది. యెల్లొత్తా."

అతనితో అప్పట్లో మాట్లాడితే కార్యం లేదని తరవాత సూరన్నతో చెప్పేడు పెద్దయ్య.

5

పండక్కి సూరన్న అల్లుడు రామమోహన్ వొచ్చేడు. అతడు ఆనర్సు చదువుతున్నాడు. సూరన్న కూతురు పద్మ కూడా ఎనిమిదోక్లాసువరకూ చదువుకుంది. పెద్దయ్యదగ్గిర అమరం కూడా చదివింది. పురాణాలు చదివి

అర్థం చెప్పగలదు. పండుగరోజుల్లో అత డెక్కడికీ వెళ్ళకుండా అత్తవారింట్లోనే కాలం గడిపేడు. తగువు సంగతి తన మామ చెబితే మక్కనుమనాడు రాజపురం వెళ్ళి పోలీసుస్టేషనులో అడిగాడు. సివిలు నేచరని కంప్లెయింటు రిఫరు చేసినట్టు తెలిసింది. యింటికొచ్చి పోలీసు భయంలేదని చెప్పేసరికి అందరూ సంతోషించేరు. కాని ఆరోజునే బేటామీను వొచ్చి సివిలుకోర్టు సమను లందజేసేడు.

పండగ వెళ్ళింది. వాయిదా ముందు రోజున సన్యాసి సరవన్న యింటికెళ్ళి పోలీసువాళ్లు నీళ్ళు కార్చేసినందుకు నిష్ఠూరంగా మాట్లాడేడు. అందుకు ముఖ్య కారణం సాక్ష్యంలేదని సన్యాసి చెప్పడమేనంటూ, సబిన్స్పెక్టరు రాకుండా హేడ్డు దర్యాప్తుకి రావడం, ఆ సమయానికి తాను వూళ్ళో లేకపోవడం అన్నీ కలిసేయని చెబుతూ, సూరన్న దావా పొలం దున్నకుండా, ఎట్టి పైరూ ఆ పొలంలో పండించకుండా యింజంక్షను ఆర్డర్లు వేయిస్తానని చెప్పి సరవన్న అతణ్ని సముదాయించేడు. అట్టి ఆర్డర్లే సూరన్న తరఫునకూడా యిప్పిస్తానని అతన్నికూడా సంతోషపెట్టేడు. వుభయులనీ కోర్టురొంపిలో మెలబంటివరకూ దింపేడు. కేసు హియరింగుకి రాకుండా వొక సంవత్సరం వాయిదాలుపడ్డాయి. చివరికి మున్సబుగారు కర్చులతో సహా, గత రెండు సంవత్సరాల ఫలసాయంతో కూడా సూరన్నపక్షంగా డిక్రీ యిచ్చేరు. సూరన్నకి, సన్యాసికీ చెరి రెండేసివేలు, వాయిదాలు, స్టాంపు ఖర్చులు, కోరుఫీజులు, బేటాలు, లోకలిన్స్పెక్షనులు, వగైరా పబ్లిసు ప్రైవేటు కర్చులకింద ఖర్చయేయి. సన్యాసి తరఫున ముగ్గురు సాక్షులను సరవన్న కుదిర్చినా కోర్టువారు నమ్మకుండా పైప్రకారం డిక్రీ యిచ్చేరు. కేసు మొదట్లో సన్యాసికి, సూరన్న తన పొలం ఆక్రమించేడా, లేదా అని అనుమానం వుండేదికాని రానురాను సూరన్న తన పొలం ఆక్రమించేడనే నమ్మకం కలిగి, ఎవరెంత చెప్పినా, నిదర్శనాలు చూపించినా వినలేదు.

డిక్రీమాట విని గోలపెడుతూ సరవన్న దగ్గిరకి వెళ్ళి సన్యాసి నానామాటలూ అనడానికి మొదలుపెట్టేసరికి సరవన్న,

"కోర్టులంటే యేమిటోయ్! దీనిమీద కోర్టులేదూ. మన మెక్కడికీ వెళ్లక్కరలేదు. రాజపురంలోనే వుంది. రేపే అప్పీలు దాఖలుచేయించి కర్చులతోసహా రాబట్టుదాం. నువ్వు జంకితే చెప్పలేనుగాని మనకేసు బలమైనది. అప్పీలులో తప్పకుండా గెలుస్తాం."

అప్పీలనేసరికి సన్యాసి "యిప్పటికే రెండువేలయింది. యింట్లో వుస్తే పూసా అమ్మేను. మిగిలిన భూమిలో సంగోరు తాకట్టెట్టే మళ్ళాకోరటూ బాబూ."

"అయితే నీ కర్మం. సూరన్న డిక్రీ అమలుచేసి గత రెండేళ్ల ఫలసాయంకీ దావా పడేసి నీకొంపాగోడ్డీ వేలాం వేయించేస్తాడు. ఆలోచించుకో నీ యిష్టం."

ఇంక సన్యాసి లొంగిపోయి అప్పీలుకు కావలసినడబ్బు జాగ్రత్తచేసి సరవన్నకిచ్చేడు. యీ అప్పీలు మరి రెండేళ్లు నడిచి, ప్రొసీజరులో ఏవో లోపాలొచ్చేయని మళ్ళా కిందకోర్టుకి పునర్విచారణకొచ్చింది. అంతటితో సన్యాసి సాఫైపోయేడు. సూరన్న అప్పులపాలైపోయేడు.

ఇదంతా చూసి సహించలేక పెద్దయ్య వొకనాడు సరవన్న యింటికి వెళ్లేడు. అతణ్ని దూరంనించి చూసి, సరవన్న వొకచాపవేసి దయచెయ్యాలని ఆహ్వానించేడు. కూర్చున్నతరవాత సరవన్న —

"ఏమిలాగ దయచేసేరు పెద్దయ్యగారూ?"

"సరవన్నగారూ! ఆ సన్యాసికీ, సూరన్నకీ తగువు యెంతకాలం పెంచుతారు? సన్యాసిఆస్తి పండులాంటిది భస్మమైపోయింది. సూరన్న అప్పులపాలైపోతున్నాడు."

"నేనేంజేసేదీ? ముసద్దీవృత్తి చేసుకుంటూ యీలాటివి వొస్తే సలహాయివ్వడం తప్పేనా?"

"సరే నేనొక విషయం అడుగుతాను చెప్పండి. నిజంగా సూరన్న, సన్యాసి పొలం ఆక్రమించేడా?"

"నాకేం తెలుసు? వొకనాడు తనకట్టి అనుమానంవుందని నాతో చెబితే, పోనీ పోయ్ చూడడుగులే కదా వూరుకో అన్నాను. ఇంకా నన్నుపట్టుకుంటే వృత్తిధర్మం ప్రకారం సలహాయిచ్చేను."

"సూరన్నకి మీ రేకరూ సలహా యిచ్చేరు? అదీ వృత్తిధర్మమేనా?"

"ఆ! ఎవరడిగితేవాళ్ళకి తగిన సలహా యివ్వాలి ముసద్దీ అన్నవాడు."

"మహా గొప్పవృత్తయ్యా! సరే నేను చెప్పేది అడ్డురాకుండా సాంతంగా విని ఆపైని మీకు అంతరాత్మ ఎలా చెబితే అలాగ చెయ్యండి. మొదట సన్యాసి బుర్రలో మీరే యీ అనుమానం పెట్టేరు. అమాయికుల్ని యిద్దర్ని పట్టుకుని వేరుపురుగులాగ వాళ్ల సంసారాలు పిప్పిచేసేరు. యింకా చెయ్యబోతున్నారు. మీకు కోపం రాకపోతే చెబుతాను. వాళ్ళవుసురు మీకు బాగా తగిలింది. యిప్పటికైనా మీరు సర్దుకోకపోతే యింకా బెడిసికొడుతుంది. మీకా పిల్లలులేక, పెంచుకున్న కొడుకు స్కూలుఫైనలు చదువుతూ నిరుడు పండుగరోజున హటాత్తుగా పోయేడు. మీ యిల్లాలు చూస్తే ఆరునెల్లయింది పక్షవాతంతో మంచమెక్కేరు. మీ అక్కగారు వొచ్చి యిల్లుచూడకపోతే మీ గతేంగాను? ఆమె మీకుచేస్తున్న సహాయానికి నన్నడిగితే. ఆమె కుమారుణ్ని మీరు బాగుచేసి చదువుచెప్పించండి. యేదో తగుమాత్రం ఆస్తిసంపాదించేరు. కొంతడబ్బు నిలవచేసేరు. యింకా యెవరికోసం యీ మాయవృత్తిచేసి నెత్తురుకూడు తింటారు? యిప్పటికైనా నామాట విని ఆ అమాయకులిద్దరికీ రాజీ చెయ్యండి. నేను వాళ్ళని పిలిచి చెప్పతాను. బాగా ఆలోచించుకోండి." పెద్దయ్య యిలా చెప్పి యింటికెళ్లేడు.

యిదంతా సరవన్న అక్కగారు విని పెద్దయ్య వెళ్లింతరవాత,

"తమ్ముడూ! పెద్దయ్యచెప్పినట్టు నీకేమిటి లోపం? అడ్డమైనవాళ్ల వెనకాలా కాయితాల కట్టలుపట్టుకుని దినము స్తమానం తిరగడమెందుకు? యింటిపట్టున కూచుని వ్యవసాయం చేయించుకుంటూ హాయిగా కాలం వెళ్లబుచ్చరాదూ? నీ పెళ్లానికి మంచి మందిప్పించడానికి కూడా నీకు తీరుబాటులేదే, అదెలా నేడుస్తున్నాదో నీకేం తెలుసు? దానిఘోషకూడా నీకు చేటుతెస్తుంది." అని బోధించింది.

ఆరాత్రి సరవన్నకి నిద్రలేదు. మరి మూడు రోజులు రాజపురం వెళ్లకుండా యింట్లోనే వుండి, దీర్ఘాలోచనలో పడిపోయాడు. నాలుగోనాడు పెద్దయ్యదగ్గిరకెళ్లి, సన్యాసినీ, సూరన్ననీ పిలిపించి, పెద్దయ్య సహాయంతో వాళ్లిద్దరినీ వొప్పించి రాజీచేయించి ఆనాడే కోర్టులో రాజీనామా దాఖలు చేయించి దావా విత్డ్రా చేయించేడు. సూరన్నకి దావాకర్చులలో సగం యిచ్చుకోడానికి సన్యాసి వొప్పుకున్నాడు. పెద్దయ్య తనతాలూకు భూమిలో పదెకరాలు సన్యాసికి తక్కువ శిస్తుకిచ్చి, పంటలో కొంత యేటేటా సూరన్నకి బాకీ కింద జమకట్టడానికి వొప్పించేరు. ఆరోజు నుంచీ రాజపురంలో ఆఫీసు మూసివేసేడు సరవన్న. ★

అద్దెవాటా

"నమస్కారమండీ! ఈ యింటి యజమాని తమరేనాండీ?"

"అవును. నేనే నావల్ల మీ కేం కావాలి?"

"నేను ఈవూళ్ళో బ్యాంకీలో పని చేస్తున్నాను. ఈ వూరు ట్రాన్స్ఫరయి అప్పుడే నాల్గుమాసాలు కావస్తోంది. ఇంత వరకు ఎక్కడా యిల్లు దొరకలేదు. నానా బాధలు పడుతున్నాను. భార్యాబిడ్డల్ని పుట్టింట వదిలేసి వచ్చాను. ఈ విధంగా ఎన్నాళ్లు అవస్థపడాలో అర్థం కావడం లేదు ప్రస్తుతం ఆఫీసులోనే ఒక గదిలో వుంటున్నాను. హోటల్లో భోజనం. ఈ రోజుల్లో హోటల్ భోజనం సంగతి మీకు తెలుసును ఆఫీసులో గుమాస్తాలకి, స్నేహితులకి అనేకమందికి చెప్పి వాకబు చేయిస్తున్నాను, ఎక్కడైనా యిల్లు దొరుకుతుందేమోనని, యింతవరకు ఎక్కడా దొరకలేదు ఈరోజు ప్రొద్దున్నే తెలిసింది మీ యింటివిషయం కొత్తగా మీరు యిల్లు కట్టుకున్నారని, ఇంత పెద్ద యిల్లు మీ కుటుంబానికి యెక్కువని, మేడమీద వాటా అద్దె కివ్వడానికి మీకు వీలవుతుందని విన్నాను. వెంటనే పరుగెత్తుకొచ్చాను. మీరు మరి ఎట్లాగైనా వీలు చేసుకొని ఆ వాటా నాకు యిప్పించాలి" అని దీనంగా వేడుకొన్నాడు, వచ్చిన పెద్దమనిషి.

ఇంటి యజమాని కొంచెం విసుగు చెందినట్లభినయించి వచ్చిన పెద్దమనిషి సూటు, బూటు, హేట్ కేసి ఒకసారి పరకాయించి చూశాడు. "అబ్బే! మా యింట్లో ఎక్కడా ఖాళీ వుండదండీ! బోలెడంత కామాటం, పిల్లాజెల్లాతో మాకే యిరుగ్గావుంటే యింకొ అద్దెకు గూడానా వీలుపడదు. క్షమించాలి మాయిల్లు అద్దె కిస్తారని మీ కెవరు చెప్పేరోగాని, అది వట్టి అబద్ధం. మీరు ఎక్కడైనా మరో యిల్లు చూసుకోండి" అన్నాడు. యింటి యజమాని

'మరి మీ రిట్లా తోసేస్తే కుదరదు ఏదో విధంగా నన్ను గట్టెక్కించాలి మీ వుపకారం మరచిపోను చాలా అవస్థ పడుతున్నాను.' అని మరీ దీనంగా ప్రార్థించాడతను.

'ఏం చెయ్యమంటారు చెప్పండి మీరు అవస్థపడుతున్న మాట నిజమే! కాని యిల్లు అద్దెకిస్తే నేను చాలా యిరకాటం పడిపోతానని ఆలోచిస్తున్నాను. మరి మీ పేరు?"

"నా పేరు పి కె రావు. అసలు మేడ మీద వాటాలో యెన్ని గదులున్నాయి?" అని అడిగాడతను.

"మూడు గదులు, ఒకసావిడి, వంట యిల్లు, బాత్ రూమ్, దానికి కావలసిన హంగులన్నీ వున్నాయ్. మొన్ననే ఒకాయనవచ్చి నెలకు వందరూపాయిలు అద్దె, అద్దెతో నిమిత్తం లేకుండా, యెగ్రిమెంటు వ్రాసేటప్పుడు లోపాయికారిగా వెయ్యి

రూపాయిలు, ముట్టచెప్పతానని, ఆ వాటా తనకియ్యమనీ బ్రతిమాలేను. అయితే నే ఇబ్బంది పడతామని నే ఒప్పుకోలేదు"

"మీరట్లా అంటే యెట్లా చెప్పండి. ప్రస్తుతంలో నేనెంత డబ్బయినా ఖర్చు పెట్టడానికి సిద్ధంగా వున్నాను, యిల్లు దొరికితే, నాకు సౌఖ్యం ప్రధానంగాని డబ్బులో నిమిత్తం లేదు."

శ్రీ ఆర్. రాధాకృష్ణ

ఈ మాటలకి లోపల సంతోషిస్తున్నా, పైకిమాత్రం బింకంగానే, "నేనూ, అలా చేస్తున్నానండీ! ఏ విధంగానైనా మీకు సహాయం చేద్దామని. కాని..." అనియింకా ఏమో చెప్పబోతున్నాడు యింటి యజమాని. మధ్యలో ఆపి "మీరింక అధ్యాంతరం చెప్పవద్దు. ఆయనెవరో వెయ్యి రూపాయిలిస్తానన్నాడని చెప్పారు. నేను పదిహేనువందలిస్తాను. పైవాటా నాకు ఖాయం చేసెయ్యండి. నెలకు వందరూపాయిలు అద్దెయిస్తాను. ఒక నెల అడ్వాన్సుగా యిప్పుడే యిచ్చేస్తాను. మరి మీరు కాదు చెప్పకండి. ఇదిగో సొమ్ము" అని జేబులోంచి నోట్లకట్ట పైకి తీసి లెఖపెట్టి పదహారువందల రూపాయలు చేతిలో పెట్టేను సి. కె. రావు.

ఇంటి యజమానికి ఆశ్చర్యం వేసింది. ఆ వాటామీద యింతసొమ్ము వస్తుందని అతను కలలో గూడా అనుకోలేదు. పదిహేను వందల రూపాయలు నోట్లు పుణ్యాన వచ్చాయి. అద్దె కూడా చాల ఎక్కువే! యింతకంటే ఎక్కువ ఎప్పటికీ రాదు. ఈ తరుణం పోగొట్టుకోగూడదనుకొన్నాడు యింటి యజమాని. పదహారు వందలూ పుచ్చుకొని యినప్పెట్టెలో పెట్టి, తిరిగి వచ్చి కాగితం కలం తీసికొని, వందరూపాయిలకు అద్దె నిర్ణయించుకొన్నట్లు, ఒక మాసం అద్దె యడ్వాన్సుగా ముట్టినట్లు రసీదు వ్రాసి, రావు చేతిలో పెట్టేడు.

"మీ మేలు ఎన్నటికీ మర్చిపోలేను. మావాళ్ళు రాగానే మంచిరోజు చూచుకొని ప్రవేశిస్తాను." అని చెప్పి రసీదు జాగ్రత్తగా మడిచి జేబులో పెట్టుకొని "నమస్కారం. వెళ్ళి వస్తానండీ!" అని వెళ్ళిపోయాడు. ఇంటి యజమాని సంతోషానికి మేర లేదు.

మధ్యాహ్నానికి, యింకొకాయన అద్దె యిల్లుకోసం వచ్చాడు. యజమాని "యిల్లు ఖాళీ లేదు. ప్రొద్దున్నే అద్దెకిచ్చేశాను. క్షమించాలి" అన్నాడు. కాని వచ్చిన మనిషి వొదిలిపెట్టలేదు. "మీరు నాకు కొంచెం వినాలి. మీ యింట్లో వాటా అద్దెకున్నదని తెలిసి మా బ్యాంకు యేజంటు గారు పంపారు నన్ను. ఇల్లు దొరక్క చాలా బాధపడుతున్నాడాయన. ఇంటి కోసం యెంత డబ్బయినా ఖర్చుపెట్టడానికి సిద్ధంగా వున్నాడు. నాకు రెండువేలిచ్చి పంపారిప్పుడు. ఈ రెండువేలు మీకిచ్చి మీ మేడమీది వాటా వారికి ఖాయం చేసుకొని రమ్మన్నారు. నెలకు నూటయాభై రూపాయిలు అద్దె యిస్తామనికూడా చెప్పమన్నారు. మీరు ఏదో విధంగా, ఆయనకి యీ సహాయం చేయాలి. మీ యిల్లు అద్దెకివ్వడంవల్ల ఆయనకే కాకుండా నాకూడా

★ అద్దె వాటా ★

చాల సహాయం చేసినవారవుతారు. ఇల్లు ఖాయం చేస్తే నాకూడా యేదో ప్రమోషను యిస్తారు" అని ప్రాధేయపడ్డాడు.

ఇంటాయనకి ముచ్చెమటలు పోశాయి. కొంచెం తేరుకొని విచారంగా "అయ్యో! యీవాళ ప్రొద్దున్నే యిచ్చేశానండీ! మీ ఆఫీసరుగారి సంగతి ఏమాత్రం తెలిసినా ఆపుచేసేవాణ్ని. ఇప్పుడింకేమీ లాభం లేదు. చెయ్యి జారిపోయింది." అన్నాడు.

'యేదైనా వీలుగావుంటే మా బ్యాంకుకి ఫోను చేయండి" అని ఫోను నెంబరు యిచ్చి వెళ్ళాడు.

ఇంటికామందు కేమీ పాలు పోలేదు.

ఒక్క రెండుగంటలతేడాలో మించిపోయింది. వ్యవహారం అట్లాగే ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు సాయంకాలం మళ్ళీ రావుగారు ఆ యన్నికలు సుకోడాని కొచ్చాడు. అంతటి నిరుత్సాహంలోనూ, యింటాయన ముఖంలో యింకా యేదో ఆశమాత్రం కనిపిస్తూనే వుంది.

రావు జాలిగా "పంతులుగారూ! మీరు నాకోసాయం చేయాలి. మీతో మాట్లాడినవెంటనే ఆఫీసుకు వెళ్లాను. ట్రాన్స్‌ఫర్ ఆర్డరు వచ్చింది. అందువల్ల నేను మీ యింట్లో వుండే అవసరం తీరిపోయింది. దయచేసి నా పదిహేనువందలు వాపసు యిప్పించాలి, ఎడ్వాన్సుగా యిచ్చిన ఒకనెల అద్దెవదిలేస్తాను సొమ్ము అడగటానికి చిన్నతనంగావుంది. అనుకోకుండా వచ్చింది ట్రాన్స్‌ఫరార్డరు"అని ప్రాధేయపడ్డాడు.

ఇంటి యజమాని ముఖంతామరపద్మంలా ఒక్కసారి వికసించింది. తన అదృష్టానికి తానే సంబరపడ్డాడు అయినా, పైకి అట్టే కనుపడనియ్యకుండా వెంటనే యినప్పెట్టె తీసి పదిహేను వందల రూపాయిలు రావు చేతిలో పెట్టి, యడ్వాన్సు వందరూపాయిలు వదిలేసినందుకు లోలోపల సంతోషించాడు. రావు సొమ్ము తీసికొని వెళ్లిపోయాడు.

ఇంటాయన వెంటనే ఫోన్ చేశాడు బ్యాంకుకి. మధ్యాహ్నం ఆయనతో మాట్లాడిన గుమాస్తా ఫోన్‌దగ్గరకొచ్చి "ఎవరండీ! మాట్లాడుతున్నది" అన్నాడు ఫోనులో "మధ్యాహ్నం మీ బ్యాంకు యేజంటుగారు యిల్లు కావాలని కబురుచేశారు."

"ఆ......అవును. నేనేనండీ మీదగ్గరకొచ్చింది. ఏం జరిగిందీ!"

"వాటా ఖాళీగానే వుంది. వెంటనే మీరు చెప్పినప్రకారం సొమ్ము పంపి ప్రవేశించమని చెప్పండి."

"మా ఏజంటుగారు నాకంటే ముందరే మీదగ్గరకొచ్చి ఒకనెల అద్దె వంద రూపాయిలు యడ్వాన్సుగా యిచ్చి యిల్లు ఖాయం చేసుకొన్నారుటనే! మీరు రసీదు కూడా వ్రాసి యిచ్చారుటగా!" ఇంటి యజమాని గాబరా పడుతూ "మీ ఏజంటు పేరు?"

"మిస్టర్. పి. కె. రావు."

వెంటనే ఫోను పెట్టేసి కుర్చీలో అక్కడే కూలబడ్డాడు, యింటి యజమాని. సొమ్ము పదిహేనువందలూ వాపసు చేస్తూ, అక్కడ యెడ్వాన్సు రసీదు అడిగి తీసికోవడం మర్చిపోయాడు. మొదటినెల అద్దె వంద రూపాయలు ముట్టినట్లుగా రసీదు వ్రాసి యిచ్చాడు. కొంపమునిగింది—

మర్నాడు రావుగారు సామానుతో వచ్చి మేడమీద వాటా ఆక్రమించుకొన్నాడు. ఇంటాయన ఏమీ మాట్లాడలేదు, నోట్లో కరక్కాయ పడ్డంత పనైంది. ★

సినిమా స్టూడియోలో వినిపించిన ఒక సంభాషణ.

ఒక తార దాని మొఖం అంత అందవికారంగా వుంటుంది కదా? దానికి అన్ని బుకింగులు ఎలా వస్తున్నాయో?

రెండో తార: వులిపిరి బట్టలు మోజు అయిన యీ రోజుల్లో మొఖం ఎలా వుంటే ఎవరికి కావాలి?

* * *

ఆర్థికమాంద్యం ప్రవేశించిన యిటీవలి కాలంలో ఒకానొక సినిమా స్టూడియోలో పబ్లిసిటీడిపార్టుమెంటు వారికి స్టూడియో యజమాని వద్దనుంచి హఠాత్తుగా క్రింది విధంగా ఒక తాఖీదు వచ్చింది.

"మీరు కైంకర్యం చేసే బాపతు వస్తువుల విషయంలో కూడా సగానికి సగం పొదుపు చేయటం అలవాటు చేసుకోండి.

మేధావి

ప్రొద్దుటపట్టిన ముసురు మధ్యమధ్య తెగబాది ఇంకా ముసురు కుంటూనే వుంది అడుగు తీసి అడుగు వేసేప్పటికి మిలటరీ జోళ్ళంత బరువు బురద గడ్డి పరకలతో కలసి పాదాల పాకం పట్టేస్తూంది. అక్కడక్కడ తుమ్మ ముళ్ళు కాళ్ళల్లో విరుగుతూనే ఉన్నాయి. ఒక్కొక్కచోట మోకాళ్ళదాక దిగబడి పోగా ఆ కూరుకపోయిన కాళ్లు, లాక్కో లేని నిస్సత్తువతో కాస్సేపలాగే నిలబడి పోయి, తిరిగి ఉస్సురంటూ కాళ్లు సడలించి ముసురు నెంతో ఈసడించి, తొడలపైదాక ఎత్తి కచ్చా పోసిన చీరలతో, భుజాలమీద బిందెలతో చెరువుదగ్గఱకు వస్తూ పోతున్నారు పల్లెపడుచులు. వాళ్ల వొళ్ళంతా తడిసే వుంది వంటికంటుక పోయిన రంగు రంగుల రవళి రవికలు, ఆ వంటి ఒంపు సొంపుల నిగ్గ తేల్చే నీరు మేసిన వన్నెచిన్నెల చీరలు — చూసి చూసి, మురిసి మురిసి, ముచ్చటైన ముసురు ముద్దులు కురిసి కురిసి మోహానంగా తొండ విస్తూంది పూరికొంపలపైనుంచి ప్రాకి పోయే పొగలు వగలు జిమ్ముతూ, వొయ్యారంగా పోయిపోయి మొగిలి మొగుడు గుండెలో లీనమై పోతున్నాయి

అచ్చన్న నులకతాడు పేనుకుంటూ అరుగుమీద మూగిన ఈగల్ని తోలుతున్నాడు. అరుగెక్కి తడిసిన కోడిపుంజు రెక్కలు టపటపా కొట్టి జుత్తునెత్తి సగర్వంగా 'కొక్కరో కో' అంది. అప్పుడే తెల్లవారుతూం దని అనుకుందో ఏమో పాపం!

పచ్చి ఇటుకతో కట్టిన ఆ పొట్టిగోడల ఇంటి పైకప్పు—కప్పుకున్న తాటియాకు —తల వొంపించి కాని ఎవ్వరినీ అసలు లోనికి కదలి పోనీదు. రెండు కిటుకీలూ అరుగుమీద ఉన్నాయిగాని అవి తెఱచి మాత్రం లేవు. గుమ్మం దాటగానే చీకటి కొట్టులా ఉన్న ఆ గదిలో గబ్బిలాల కంపు గుప్పున కొట్టకుండా ఉండదు గాలి లేని వెలుతురులేని ఆ గదిలో ఓ చెక్క కూర్పు ధాన్యం నిల్వకొట్టు వుంది. దాని అడుగున ఎలుకలు పట్టపగలే వీరవిహారం చేస్తూ వుంటాయి. ఈ పాపాత్ములను సంహరించడానికి పిల్లిభగవానులు అప్పుడప్పుడు అవతరిస్తూ ఉంటారు ఆ గదిలోనే మరో ప్రక్క రెండు పటాలున్నాయి. ఒకటి లక్ష్మీదేవిది; మరొకటి విఘ్నేశ్వరుడిది. ఈ రెండు పటాల నల్లఫ్రేములమీద మసి పట్టిన బూజు ఉంది. అడుగునుంచి ఆ పటాలను చెద తినివెయ్యడంవల్ల, లక్ష్మికి రెండు కాళ్ళూ లేకుండా పోయాయి వినాయకుని ఎలుక పూర్తిగా తినివేయబడింది. ఈవిధంగా ఆ చెద ఆ దేవుళ్ళను ఆ ఇంట్లో పాతేసింది! అయితే ఆ చెదకు పూర్తిగా ఆగ్రహంవస్తే ఆ దేవుళ్ళను మెల్లగా తినేస్తుంది అద్దం అద్దంలా ఉండగానే దేవుళ్లు మాయమైపోతారు!

శ్రీ రంధి సోమరాజు

ఈ పటాలకు ప్రక్కగా చెంబులబల్ల ఉంది. దానిమీద ఇత్తడిసామాను కిలుం పట్టి మూలుగుతూంది ఆ బల్లక్రింద ఒక కావిడపెట్టె, ఆ పెట్టెమీద ఓ వెదురు బుట్ట ఉన్నాయి ఆ బుట్ట చినిగి ఉంది. ఆ పెట్టెకు నల్లనిమట్టి దిట్టంగా అంటుక పోయి ఉంది బుట్టలో ఉదికిన బట్టలూ పెట్టెలో ఉప్పూ కారం, చింతపండూ వగైరాలు చికొగ్గాపడి ఉన్నాయి ఆపెట్టె తెరిస్తే అదో రకం అన్నిరకాల వస్తువుల కలగలపు కంపు బయటకు తరుముకొస్తుంది. వీటికి ప్రక్కగా దణ్ణెం ఉంది దానిమీద మాసినవి, ముక్కిపోయినవి, చింకిగుడ్డలు అసహ్యంగా పడి ఉన్నాయి. ఆఇంట్లోనే ఓమూల బిందెలున్నాయి ఆ బిందెలమీద నీళ్ళకు మూతల్లేవు. కాని ఇవి మెరుస్తూన్నంత చక్కగా ఆ ఇల్లు మట్టుకు లేదు.

ఆ గదితరువాత సామాను గది వుంది అదీ మొదటిగదంత పొడుగే వుంది. కాని వెడల్పు తక్కువ. అందులో పుల్లలు వంట సామగ్రి క్రిక్కిరిసి ఉన్నాయి. ఆ గది గోడలన్నీ పొగత్రాగి నల్లబడిపోయిన పెదవుల్లా ఉన్నాయి దీనికావల చిన్న పంచ ఉంది. అందులోనే వాళ్ళకు వంట తినూ రవుతూంది. అక్కడే బుచ్చమ్మకూర్చొని ప్రొయ్యి రాజేస్తూంది

ఆ చివర అచ్చన్న, ఈచివర బుచ్చమ్మ ఏవేవో మాటలు సణుగుకుంటూ వుంటారు. అచ్చన్న అప్పుడప్పు డోకూని రాగం తీస్తాడు బుచ్చమ్మ ఎప్పుడూ మట్టి బొక్కినదానిలా మాటా మంతీ లేకుండా తనప నేమిటో తనేమిటోలా ఉంటుంది. మనిషి చామనచాయగా కుంచంలా ఉంటుంది. పౌర్ణమినా డుదయించే చంద్రుడంత బొట్టు పెట్టుకుంటుంది ఎప్పుడూ జేగురు రంగు చీరలే కడుతుంది. అచ్చన్న నల్లగచ్చులా ఉంటాడు నల్లని తెల్లని వెంట్రుకల కలగలుపు జుత్తుముడి, పెద్ద మీసాలు, కొస తేలిన ముక్కు, తెలివి ప్రదర్శించలేని కళ్లూ చూడ్డాని కేమంత చికాకు పుట్టించేవిగా ఉండవు.

అచ్చన్న అష్టకష్టాలూ అనుభవించాడు. బుచ్చమ్మ అతనూ పనికిపోనిరోజు ఉండేది కాదు. రోజుకు పావలా వచ్చినా, అర్ధ వచ్చినా, అందులోనే కొంత జాగ్రత్త చేసేవారు. అన్నం వండుకొని, గంజి పోసుకొని, ఇంత ఉప్పురవ్వ కలుపుకొని, పచ్చిమిరపకాయ నంజుకుంటూ అమృతంలా జుర్రేవారు. ఎప్పుడు తినేవారో ఎప్పుడు కునికేవారో ఆ వూరివారికి విచిత్రంగా ఉండేది. ఎప్పుడూ ఏదో పని చేస్తూనే ఉండేవారు. పనే వారి జీవితం. వారికి తిండిమీద ధ్యాసే ఉండేది కాదు. వాళ్లకెరుచులూ తెలియవు. వాళ్లకా పని అంటేనే పెద్దరుచి అదంటేనే వాళ్ళకెంతో అభిరుచి. సరైన బట్టకూడ కట్టుకోవాలని వాళ్ళ కెప్పుడూ తట్టలేదు. సగంతిని; సగందాచి — తరుముకొస్తూన్న ముసలితనపు మొద్దు బండికి, గుడ్డి ఎద్దుకు దానాగా వినియోగించుకోవాలనే తహ తహ మినహాయిస్తే—అంతకు మించి మరో ఆలోచనే వారికి లేదు. ఇహ ఉన్న ఒక్క కొడుక్కి ఏమీ ఇవ్వలేని చేతిగాళ్ళయి పోవడం వాళ్ళ కెట్లా ఇష్టమౌతుంది? ఇంత కష్టపడీ ప్రతి దమ్మిడీ వమ్ముకాకుండా వాటు సొమ్ము చేసుకోగలిగితే వాళ్ళకున్నదంతా ఎంత అంటే—రెండెకరాల కొంప. ఇదీ వాళ్ళ ఆస్తి ఈ కాస్తకూడ

★ మేధావి ★

లేనివాళ్ళే, అతని ఇరుగుపొరుగు పూరిగుడిసెల యజమానులు. వాళ్ళకచ్చన్న అంటే కిట్టదు ఈ కూలి వెధవ రెండెకరాల భూమి కొనడమే అని వాళ్ళ దుగ్ధ! కాని తెల్లారితే 'అచ్చన్న మావా ఓ రూపాయుంటే ఇయ్యరా. రేపొద్దున్న ఇచ్చేత్తాను' అని అడుక్కోకుండానూ ఉండలేరు. అయితే ఈ చెదపురుగులు ఆ దేవుడుపటాలకు పట్టినట్టే, అచ్చన్న దగ్గఱ పుచ్చుకున్న డబ్బు తినేసి, బాకీ ఉన్నట్టుగా మాత్రం మసిపట్టిన ఆ అద్దం మొహాలను ప్రదర్శించడంలో అఖండులు! ఇహ అచ్చన్న వాళ్ళదగ్గఱ నుంచి ఎట్లా డబ్బు గుంజుకోవాలో సతతం తనలో తాను గింజుకుంటూనే ఉంటాడు. కాని ఫలితం చాల సందర్భాలలో శూన్యమే!

అచ్చన్న పూర్వం తన పనేమిటో తనేమిటో గానే ఉండేవాడు కాని ఇప్పుడందఱూ వచ్చి ఏవేవో కష్టసుఖాలు చెప్పుకుంటూవుంటే వినకుండా ఉండలేని అవస్థలో మునిగి పోతున్నాడు. ఇక వాళ్ళేవో గొడవలు చెపుతూ సలహాలడిగితే, పాపం ఎటూ కచ్చితంగా చెప్పలేని అసమర్థుడైన అచ్చన్న తెల్లమొహం వెయ్యడం తప్పించి ఏమీ చెయ్యలేక పోతున్నాడు లోకజ్ఞానం పూజ్యం అయిన అచ్చన్న — ఒకరిమీద ఒకరు సాకులు చెప్పుకుంటూ బాకులు నూరుకొనే ఆ కజ్జా మూకకు సమాధానాలు చెప్పేటంతవాడు కావడం మరి కష్టమే!

అచ్చన్న కిప్పుడే బాధాలేదు కొడుకు పెళ్ళి ఒక్కటీ చేసిపారేస్తే తను కృష్ణా రామా అనుకుంటూ ఓ మూల కూర్చోవచ్చని అతను అనుకుంటాడు. నాలుగైదు సంబంధాలు చూసివచ్చాడు కాని అతని కొక్కటీ నచ్చలేదు. మరో సంబంధం చూశాడు గాని వాళ్ళు వస్తామన్న రోజున కుర్రోణ్ణి చూసుకోవడానికి రాలేదు. అచ్చన్నకా పిల్ల నచ్చింది. పిల్ల ఎఱ్ఱగావుంది. కుర్రోడు కూడ ఎఱ్ఱగా ఉన్న పిల్లే కావాలని గోలెడుతున్నాడు. అంచాత అచ్చన్న ఈ సంబంధం కుదిరితే బాగుణ్ణు అనుకున్నాడు. వాళ్ళు చాల మర్యాదస్తుల్లా కూడ కనిపించారు అచ్చన్నకు, అతనితో వచ్చిన వాళ్ళకు ఆరోజున నిమిషాలమీద పిండివంటలు చేశారు. బలే బాగ మర్యాదచేశారు. కాని వాళ్ళు మాటపదార్లు కట్నం ఇవ్వడం విషయంలోనే ఆగిపోయారేమో అనుకున్నాడు. విదుతులాల బంగారం తను పెడుతూవుంటే ఆ కాస్త కట్నంకూడ వాళ్ళు రాల్చకపోతే ఎందుకూ కొల్చనా అనుకున్నాడు

మాయముండా ముసురు ఇంకా వదల్లేదు అలా తడుస్తూనే ఎవరి పనులు వాళ్లు చేసుకుంటున్నారు. బురదలో దిగబడుతూన్న కాలు నూడలాక్కుంటూ తెల్ల పంచె, తెల్లచొక్కా, నెత్తిమీద తలపాగ ఉన్న ఓ పెద్దమనిషి, ఓచేత్తో గొడుగు పుచ్చుకొని, ఓచేత్తో పంచెపుచ్చుకొని, నోట్లోని చుట్ట జారిపడకుండానే, అచ్చన్న ఇల్లు ఎక్కడో ఆ త్రోవనుపోయేవాళ్ళను అడిగి తెలుసుకున్నాడు. అతని వెనకాలే మరోముగ్గురు మగవాళ్ళూ, ఓ ఆడమనిషి ముసురును తిట్టుకుంటూ, కాళ్ళు నూడలాక్కుంటూ వస్తున్నారు 'ఓయ్ అచ్చన్న తాతోయ్! మీ ఇంటి కెవ్వరో చుట్టాలొత్తున్నారు' అని అచ్చన్న తాత ఇంటిముందు ఓ పాలికేక పెట్టి అక్కడ నిలబడకుండానే దారితీశాడు ఓ బుడ్డాడు. అచ్చన్న పేనుతూన్న నులకతాడు వలాగే విడచిపెట్టి 'ఏవూరి చుట్టాల్రా' అంటూ అరుగు దిగాడు. ఆ నల్లగొడుగులూ, తెల్లచొక్కాలూ మాడగానే వాళ్ళెవరో అత వాకట్టేశాడు. 'చచ్చిన చావొచ్చిందే! ఇప్పుడీముసల్దాన్ని చంపడాని కొత్తున్నారు కాబోలు. అన్న పెకారంగా రాక ఇప్పుడు రాడమేంటీ' అనుకుంటూ, వాళ్ళవైపే తెల్లపోయి మాస్తూ 'ఏమే! నీళ్ళెట్టుకరా' అంటూ ఓ అరుపు అరిచాడు. 'నీళ్ళు తేలేక నాను చత్తూంటే—నీళ్ళంటావేంటీ!' అని విసుక్కుంటూ బుచ్చమ్మ గుమ్మంవైపు తొంగి చూసేసరికి—నాలుగు జతల మగవాళ్ళ కాళ్ళు ఓ జత ఆడమ్మాయి కాళ్ళు ఆమెకు కనిపించి, ఆమె గుండెలు చెల్లాచెదరయ్యేట్టు చేశాయి 'ఈళ్ళందఱికీ ఇప్పుడొంటెలా దేవుడా' అనుకుంది బుచ్చమ్మ గబాలున బిందెడునీళ్లు అరుగుదగ్గఱకు తీసుకొచ్చింది ఆ వచ్చినవాళ్ళు ఆ నీళ్ళు సరిపోకపోయినా మళ్ళీనీళ్లడక్కుండానే వాటితో నేఎట్లాగో సరిపెట్టుకున్నారు అచ్చన్న అరుగుమీద నులకమంచం వాల్చి దానిమీద దుప్పటి పడేశాడు బుచ్చమ్మ ఓ ఎత్తుపీట తెచ్చి ఆ అమ్మాయిని దానిమీద కూర్చోబెట్టింది. దానిమీద ఆమె చిరాగ్గా కూర్చుంది.

'అంతా కులాసా .....' అన్నాడు అచ్చన్న; కాబోయే వియ్యంకుడు రామ్మూర్తితో రామ్మూర్తి అంతా క్షేమమే అన్నట్టుగా తలూపి, 'ఆవేళ రాడానికీలయింది కాదుబావా. పొద్దున్న కబురంపాలనుకున్నాను గాని మా కిట్టగాడు జొరంతో మూలుగుతూ మంచమెక్కాడు. ఈపూట అన్నిదాలా బాగుందంటే— మనలో మనకేటని వచ్చేశాం. ఏమైనా ఇందులో సర్దుకుపోలేనోళ్ళెవ్వరు?' అన్నాడు తన మాటకారి తనాన్ని ప్రదర్శిస్తూ. రామ్మూర్తి 'చాల తెలివైనోడని' అచ్చన్నకు తెలుసు కాని ఏమాట ఎందుకు వాడుతున్నాడో, దీనిలో ఎంతర్థముందో ఊహించుకోగల సత్తా మాత్రం అతనికి లేదు. అంచాతే మొదటవాళ్ళ రాక గుఱించి మనసులో ఆగ్రహించుకున్నా ఇప్పుడదంతా తారుమారై 'అయ్యో! పాపం! మీ కిట్టిగాడికి జొరంగా ఉందా? మరేం పెమాదం లేదుకదా' అన్నాడు; ప్రమాదం ఉంటే వీళ్ళిలా ఎందుకువస్తారనైనా ఆలోచించకుండా. వెంటనే రామ్మూర్తి, 'ఆ అ. మరేం ఫరవాలేదు .. ..' అని ఇంకా ఏమేమిటో అంటూండగా, తడిసిన గిరజాల జుత్తుపై కెగద్రోసుకుంటూ, నెత్తిమీద తడిసిపోయిన తుండు కాళ్ళమీద పిండుకుంటూ 'ఈళ్ళంతా ఎవరు చెప్మా' అనే భావం ప్రస్ఫుటమయ్యేలా చూస్తూ అప్పుడే అక్కడకొచ్చి నిలబడిన అచ్చన్న కొడుకును రామ్మూర్తి అలాగే కాస్సేపు చూస్తూ ఉండిపోయాడు. కుర్రాడు నల్లగానున్నా గా ఎంతో అందంగా ఉన్నాడు. నూనూగు మీసాలు, ఆ లేత మొగం మాంచి అందమైన ఆ కళ్ళూ, ఆ ముక్కుతీరూ, ఉక్కుకడ్డీలా ఉన్న ఆ శరీరం మాసిన రామ్మూర్తి, తప్పకుండా ఈ కుర్రోడే మా అల్లుడు అనుకున్నాడు.

'ఈడే మారామయ్యో' అన్నాడు అచ్చన్న.

'ఈగోజుల్లో ఇంకా రామయ్యేంటి బావా. ఇక్కడనుంచి మేం రామారావు అంటాం' అన్నాడు రామ్మూర్తి; అప్పుడే కాబోయే అల్లుణ్ణి బుట్టలో వేసుకోవాలనే తలంపుతో. రకీమని తలవంచేశాడు రామారావు నవ్వుతూ ఈమాట కెంతో ఉబ్బిపోయాడు ఇంక అక్కడ ఒక్కక్షణం ఉండలేక ఆ ప్రక్కనే ఉన్న గొడ్లసావిట్లోంచి తల్లిదగ్గఱకు చేరాడు అతను నడుస్తూ ఉండగా ఆ అయిదుగురూ అతనివైపే చూసి మళ్ళీ వాళ్ళంతా ఒకరిమాపు లొకరు కలుపుకొని 'ఏం ఎలాగున్నాడు' అని కనుసైగలతో ప్రశ్నించుకున్నారు. 'ఓః ఎంచక్కా ఉన్నాడు' అన్నట్టుగా అందఱికళ్ళూ ఒక్కసారి ముచ్చటగా నవ్వాయి 'ఏం బంగారమ్మా ఎలాగున్నాడు మా అల్లుడు?' అన్నాడు రామ్మూర్తి

బంగారమ్మ నిండుహృదయంతో 'బాగున్నాడన్నయ్యా' అంది. అప్పుడే కోడిపుంజు 'నేనూ ఇక్కడ ఉన్నా' నన్నట్టుగా వాళ్ళ నెత్తిలమీంచి ఎగిరి గుమ్మం బల్లమీద నిలచింది. ఆ పుంజును చూడగానే, ఆ వచ్చిన వాళ్ళల్లో ఒకడు, 'సంకురాత్రి పందేల కేటిమావా' అన్నాడు. జవాబుగా అచ్చన్న, 'దాని కివాల ఆయువు మూడేదే. చుబమా అంటూ దాని పేణం తీయడమెందుకని మానేశాను. అయినా ఇది ఆచారం కాదుగా.' అన్నాడు. ప్రతీ మాటకూ ఎంతో విలువ కట్టే రామ్మూర్తి తన కూతుర్ని కోడలుగా చేసుకోవాలని అచ్చన్న ఉబలాట పడుతున్నట్టుగా ఈ మాటలనుబట్టి గ్రహించొచ్చు అనుకున్నాడు. కాని అచ్చన్న కట్లాంటి అర్థాలేవీ తెలియవని ఆ తరువాత కొద్ది క్షణాలలోనే అతని అమాయకపు ప్రవర్తనబట్టి గ్రహించాడు.

అసలే మసాబుగా ఉందేమొ, అప్పటికే అయిదుగంటలు దాటిఉంటుందేమొ ఆ చీకటికొంప మరీ చీకటి రాసులతో తులతూగుతోంది. 'ఒరే రామిగా ఆ కిటికీ తియ్యరా' అంది బుచ్చమ్మ వంటపనులు చేసుకుంటూ కొడుకుతో. వాడు మామూలుగా ప్రయత్నిస్తే ఆ కిటికీ రెక్కలో పట్టాన ఊడొస్తాయేమిటి? బయటనుంచి కర్రతో పొడిచి, మళ్ళీ గదిలోకివచ్చి వాటిని పట్టుకలాగితే మెల్లగా కిర్రుపెడుతూ అవి వెనక్కు వచ్చాయి. అప్పుడే ఎర్రగా ఆ కిటికీకి అవల తళతళా మెరుస్తూ ఓ అమ్మాయి పకపకా నవ్వింది. ఎవరా అమ్మాయి అనుకుంటూ నిదానించి చూశాడు. అచ్చే అక్కడెవ్వరూ లేందే! కోడిపుంజు మాత్రం ఆ అరుగుమీద ఎర్రని జుత్తు నెత్తి తమాషాగా వానను విలోకిస్తూంది; మళ్ళీ గుమ్మం మీదినుంచి ఎప్పుడు క్రిందకు దిగిందో మరి! కుర్రవాడికేమీ తోచలేదు. ఇంట్లో దీపం వెలిగించాడు. ఇల్లంతా ఎర్రగా అయింది. ఆ గది నిండా మందారపూలు పూచినట్లయింది. అతని శరీరం స్వాధీనంలోనికి వచ్చేప్పటికి, తల్లి కట్టుకున్న ఎర్రచీర గుమ్మంలోంచి కదలిపోయింది.

క్రమేణా చీకటిపడింది. ఆకాశంమీంచి ఎవ్వరో చీకటికొండలను త్రవ్వి భూమ్మీద రాసులు పోస్తున్నట్టుంది. బ్యాటరీలైటును చాల పొదుపుగా వాడుకుంటూన్న వాళ్లలా, అనంత మార్గాన పోతూన్న పాంథులెవ్వరో విద్యుల్లతను చటుక్కున వెలిగించి ఆర్పేసినట్లుగా మెరుపు వియత్తలమెల్ల నిండి మరోక్షణంలో మాయమైపోయింది. అది చూడగానే కుర్రవాని గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. 'ఒరే అరుగుమీద దీపం పెట్టరా' అన్నాడు తండ్రి. ఈ మాటలు అతనికి వెనువెంటనే వినిపించలేదు. అగ్గిపుల్ల మండడం—హరికేన్ లాంతరునిండా కాంతి నిండడం—అతని తలలో ఎర్రగా బక్కపలచగా ఉన్న పిల్ల నల్లని కళ్ళతో సన్నగా నవ్వి మురిపెంగా అంతర్థానమై పోవడం జరిగింది. చల్లగా గాలివీచి అతని తలను ప్రేమతో గారాబంగా నిమురుతూ వెళ్ళింది.

బుచ్చమ్మకు వంటలు చేతకావు. ఒయ్యారపు పిల్లల్ని పిలచి నాజూకు వంటలు వండించడానికి అప్పుడింట్లో ఏమీ లేవు. ఇంట్లో పాడిఉంది. కాబట్టి గబగబా పరమాన్నం వండింది. వాళ్ళకదే హెచ్చుగా పడేసి, ఘుమఘుమలాడే నేయి వద్దు వద్దంటున్నా హెచ్చుగా పోసేసింది.

అన్నం తింటూ రామ్మూర్తి బావమరిది, 'ఏంటీ కంపు ఈ కొంపలో' అన్నాడు. దానికి కారణం నేనే నన్నట్టుగా ఓ గబ్బిలం ఓసారి ఆయింట్లో కంగారుగా పచారుచేసి, అపచారం చేసినట్లుగా హడావుడిగా అవతలకు వెళ్ళిపోయింది. 'అబ్బ! కారం ఈ కూరలో ఎంత పడేసిందో! తినలేం బాబూ ఈ తిండి. ఎలా తింటారో కాని మీళ్ళు.' అన్నాడు ఆ బావమరది మళ్ళీ; సగం బుచ్చెమ్మకు వినిపించీ వినిపించనట్టుగా నసుగుతూ. వెంటనే రామ్మూర్తి కాబోయే వియ్యపురాలు వినేట్టుగా, 'పెద్దలకాలపోళ్ళురా. ఆళ్ళ జీవితం అట్టాగే పోద్ది. మనకు కానీ డబ్బు లేదు గాని ఈసాని కిరిగిపడతాం; ఏసాలకేమో ఎగిరిపడతాం' అన్నాడు. ఈ మాటలకు బుచ్చమ్మ ఎంత సంతోషిస్తుందో అతనికి బాగా తెలుసు. నిజంగా ఈ మాటకు బుచ్చెమ్మ ఉక్కిరి బిక్కిరయింది.

ఆ మరునాడు వాళ్ళు వెళ్ళిపోతూ, అంతా ఖాయమే అన్నారు. పెళ్ళి మాఘమాసంలో అన్నారు. ఎప్పటినుంచో అడగాలని అడగలేక పోతూన్న అచ్చన్న, 'మరి.........' అని ఏదో చెప్పబోయేప్పటికి, ఆ వియ్యంకుడు రామ్మూర్తి, 'తల తాకట్టు పెట్టేనా ఇచ్చేస్తానుగాని మరోలా చేస్తానా. అలాంటి దేమీ పెట్టుకోకు బావా......' అంటూ 'వస్తానప్పా' అని వియ్యపురాలివద్ద శెలవు తీసుకొని, సాగిపోయాడు. బస్సునిలచే స్థలంవరకూ చుట్టాలను సాగనంపి అచ్చన్న ఇంటికి తిరిగి వచ్చాడు.

మాఘమాసం రావడం ఎంత? పెళ్ళి దగ్గఱ పడడం ఎంత? ఆ ముసలాళ్ళకు ఒక్క పనీ సాగడంలేదు. పెళ్ళికి ఏయే పనులు చేయాలో తోచడమూ లేదు. ఇంటి గోడలకు సున్న పులిమారు. అరుగులకు పేడ పూశారు. ఆ పేడ పూతపెట్టిన అరుగులకు మధ్యగా పొడుగునా సుద్దముక్కలు పట్టించారు. గుమ్మాలకు పసపురాసి కుంకుమబొట్లు చిత్రింపించారు. గుమ్మాల పైన మామిడాకులు కట్టారు. కిటికీలు రెండూ ఇప్పుడు తెఱచేఉంచారు. కాని ఎంత చేసినా ఆ ఇంటికి తీసుకరావలసిన అందాన్ని మాత్రం తీసుకరాలేక పోయారు!

కుర్రాడికి క్రొత్త చొక్కాలు కుట్టించారు. క్రొత్త పంచెలు కొన్నారు. పెళ్ళికొడుకును చేసినరోజున వద్దన్నా కుర్రాడు ఊరంతా తిరిగాడు. తలంటుపోసుకొని, అప్పుడే ఆరినజుత్తూ, ఆ కళ్ళ కందంగా కాటుక, మొగాన పెళ్ళిబొట్టు, బుగ్గను చుక్క, చేతులకు గంధంపూతలు, కాళ్లకు పారాణి వ్రాతలు చూసుకొని, కుర్రాడు తెగమురిసిపోయాడు. 'ఏందిరోయ్ నల్లోడా! ఎర్రపెళ్ళాం వస్తాదని తెగమురిసి పోతున్నావ్' అన్నాడు వాళ్ళింటిముందు నుంచి పోతూన్న పెద్దదొర. దొరముందు కనీసం వాడు రెప్పపాటు నిల్చోలేకపోయాడు. నిలుచున్న ఆక్షణం అతని కుడికాలు ఎడమకాలిని పెనవేసుకొని భూమ్మీద ఇట్టిటు తాకింది. అప్పుడే ఎడమచేతి చూపుడు వ్రేలును వీపు వెనకభాగాన కుడిచేయి నలుపుతూండగా, అతని శరీరం విచిత్రమైన భంగిమలు పోయింది. ఈ పరమాద్భుత ముగ్ధలావణ్యాన్ని తిలకించిన దొర ముసిముసి నవ్వులతో దారితీశాడు. రామిగాడింట్లోవికి గబగబా పరుగెత్తాడు. అయితే అక్కడెవ్వరూ ఈ ఆనందాన్ని వీక్షించే వారు లేరు. అతని ఆనందం అతనిలోనే నిండి అతనికి అపరిమితమైన ఉత్సాహాన్ని కూర్చింది.

ఈ వారం రోజులనుంచీ అచ్చన్నకు చేతినిండా ఏదో ఒక పని ఉంటూనే ఉంది. పాపం అన్ని పనులూ అతనొక్కడే చేసుకోవలసి వస్తూంది. అయినా నిరుత్సాహంగా లేడనే అనాలి. ఏపని చేస్తున్నా అతని మనసు ఒక్కసారిగా ఆ రామ్మూర్తి ఇచ్చే కట్నం మీదికే దుముకుతూంది. అది అచ్చన్నను హుషారుగా ఉంచడానికి మా బాగా పని చేస్తూంది. అసలా గూడెంలో అంత కట్నం పుచ్చుకోగలిగిన మొనగాడీ అచ్చన్న ఒక్కడే అనాలి. ఇదేభావం అచ్చన్న గుండెలో దండిగా నిండుకుంది. ఏపని చేస్తున్నా అచ్చన్న కా కట్నమే ఎదురై పదిమంది మనుష్యులుకూడ చెయ్యలేనంత సహాయాన్ని ప్రతి ఫలాపేక్ష

(42-వ పేజీ చూడండి)



విజ్ఞాన వీధులు

"డాక్టర్"



97. సూర్యునికి తేజస్సు ఉష్ణము ఏ విధంగా చేకూరుతున్నాయి?

సూర్యునికి తేజోష్ణాలు ఏ విధంగా చేకూరుతున్నాయనే విషయమై వేర్వేరు సమయాలలో వేర్వేరు శాస్త్రజ్ఞులు వేర్వేరు సిద్ధాంతాలు ప్రతిపాదించేరు. కాని వాటి నన్నిటినీ త్రోసి పుచ్చి, "సూర్యగోళగర్భమందలి హైడ్రోజని హీలియంగా మార్పు నొందుటచేత సూర్యునికి ప్రస్తుతం వేడీ వెలుగూ లభ్యమాతున్నాయని" యిటీవల బెథీ, వైజ్ సేఖర్ అనే శాస్త్రజ్ఞులు సిద్ధాంతీకరించేరు. ప్రస్తుతం ఆసిద్ధాంతమే అమలులో ఉంది.

అయితే సూర్యగోళగర్భంలో హైడ్రోజని యొకాయొకిని హీలియంగా మారడం లేదు. ఒక విచిత్రమైన పద్ధతిలో ఈ ప్రక్రియ జరుగుతూంది.

సూర్య గోళగర్భతాపక్రమం రెండు కోట్ల అంశలవరకు ఉంటుంది. ఆ మహోన్నత తాపక్రమంలో అక్కడనున్న పరమాణువుల కక్ష్యలలోని ఎలక్ట్రాన్లు వాటి వాటి కక్ష్యలనుండి చాలవరకు పైకెగుర గొట్టబడుటవలన మూలపదార్థ కేంద్రకాలు, ఎలక్ట్రాన్లుసామాన్యంగా వేటి కవి వేరుగా ఉంటాయి. వాటిలో ఒకటి భారం గల హైడ్రోజని కేంద్రకం $(H1)$ 12 భారం గల కర్బన కేంద్రకంతో $(C12)$ సంఘర్షించి, చివరకు దానిలో లీనమైపోతుంది. తత్ఫలితంగా ఆ కర్బనము 13 భారంగల నత్రజని (నైట్రోజని) కేంద్రకంగా $(N13)$ మారుతుంది. ఈవిధంగా కర్బన కేంద్రకం నత్రజని కేంద్రకంగా పరిణామం చెందుటలో కొంత పరమాణుశక్తి విడివడి గామా కిరణ రూపంలో ప్రదేశంలోనికి వికీర్ణ మాతుంది. కాని 13 భారంగల నత్రజని కేంద్రకం సుస్థాయికమైంది కాదు. అందుచేత ఆ అస్థాయిక స్థితిని వదలిపెట్టి సుస్థాయిక స్థితిని పొందడానికై ఆ నత్రజని కేంద్రకము ఒక పోజిట్రాన్‌ను విసర్జించి 13 భారంగల కర్బనకేంద్రకంగా మార్పు పొందుతుంది. అయితే 13 భారంగల కర్బన కేంద్రకం మాత్రం సుస్థాయికమైన రచన కలదా? కాదు. అందుచే అది సుస్థాయిక స్థితిని పొందడానికై ఆరాటపడి, ఒక హైడ్రోజని కేంద్రకాన్ని కబళించి, 14 భారం గల నత్రజని కేంద్రకం $(N14)$ గా మార్పు నొందుతుంది. ఈ పరిణామంలో తిరిగి కొంత పరమాణుశక్తి విడివడి గామా కిరణ రూపంలో వికీర్ణమాతుంది. ఆ పిమ్మట 14 భారం గల నత్రజని కేంద్రకం తిరిగి మరియొక ప్రోటానుతోడీకొని, దానిని కబళించి, 15 భారంగల అస్థాయికపు ఆక్సిజని కేంద్రకం $(C15)$ గా మార్పు చెందుతుంది. ఈసందర్భంలో కూడా పరమాణుశక్తి విడివడి గామాకిరణరూపంలో ప్రసారితమాతుంది. 15 భారంగల అస్థాయికమైన ఆ ఆక్సిజనికేంద్రకం ఆ స్థితిలో స్థిరంగా ఉండడం అసంభవంగదా! వెంటనే అది తన కేంద్రకంనుండి ఒక పోజిట్రానును త్రోసిపుచ్చి, 15 భారంగల సుస్థాయికమైన నత్రజని కేంద్రకం $(N15)$ గా పరిణామం పొందుతుంది. చిట్టచివరగా ఈ 15 భారంగల నత్రజని కేంద్రకం ఒక హైడ్రోజని కేంద్రకంతో సంసర్గించి, ఆ వెంటనే తిరిగి హీలియం $(He4)$ కర్బన $(C12)$ కేంద్రకాలుగా విచ్ఛిన్నమాతుంది. ఈ కర్బన కేంద్రకం ప్రక్రియ ప్రారంభంలో ఉదజని కేంద్రకాన్ని కబళించిన కర్బనకేంద్రకమే. కాగా నాలుగు ఉదజని (హైడ్రోజని) కేంద్రకాలు కలిసి ఒక హీలియం కేంద్రకంగా కార్బన్, నైట్రోజన్ కేంద్రకాల సాహాయ్యాన్ని సూర్యగోళ గర్భమందున్న అత్యధిక తాపక్రమస్థితిలో పరివర్తన మొందుతున్నాయనీ, ఆ సందర్భంలో వేరు వేరు దశలలో మహత్తరమైన పరమాణుశక్తి గామా కిరణరూపంలో బహిర్గతమాతున్నదనీ, ఈ ప్రక్రియను సింహావలోకనం చేస్తే మనకు అవగతమాతుంది. ఈవిధంగా గామా కిరణజ్వాలరూపంలో ప్రత్యక్షమాతున్న పరమాణుశక్తియే సూర్యుని వేడీ వెలుగూను.

'అనంత్'


98. ధ్రువతారకు చలనము లేదా?

అని ఈమని నుంచి మాదిరాజు శివప్రసాదరావుగారు అడుగుతున్నారు.


జాగ్రత్తగా గమనించినట్లైతే నక్షత్రాలన్నీ చీకటి పడినప్పటినుంచి తెల్లవారే వరకూ తూర్పునుండి పడమరవైపు తిరుగుతూన్నట్లు కనబడతాయి. ఇది ఒకరకపు చలనం. ఈ చలనం వాస్తవానికి నక్షత్రాలది కాదు. భూమి తనచుట్టూ తాను సదా పశ్చిమమునుంచి తూర్పువైపునకు తిరుగుతూండడమువల్ల నక్షత్రాలు తూర్పువైపు నుంచి పశ్చిమానికి తిరుగుతూన్నట్లు కనబడతాయి. అయితే ఉత్తర దిక్కునవున్న ధృవతార మాత్రము రాత్రి అంతా ఒక చోటనే వుంటుంది. [సప్తర్షులలో మొదటి చుక్కా, దాని దిగువ చుక్కా కలిపే గీత కిందికి పొడిగిస్తే ఈ గీత ధృవనక్షత్రం చేరువనుంచి పోతుంది] ధృవతార దగ్గర వున్న నక్షత్రాలు తూర్పునుంచి పడమరకు కాక ధృవనక్షత్రంచుట్టూ వర్తుల మార్గంలో తిరుగుతున్నట్లు కనపడతాయి. కెమేరాను డాబా పిట్టగోడమీద ధృవనక్షత్రాన్ని ఫొటోతీసేటట్లు పెట్టి ఒక అరగంట ఎక్స్‌పోజు చేస్తే, ధృవ నక్షత్రము చుక్కలాగు దిగి తక్కిన నక్షత్రాలు వర్తులపు తునకలు గీసినట్లు కనపడుతుంది ఫొటోలో. అంటే ఏమన్నమాటా?

తనచుట్టూ తాను తిరగడములో భూమి యొక్క ఇరుసు ధృవనక్షత్రంవైపే మొగ్గి ఉంటుందన్నమాట. కనక భూమిమీద (ఉత్తరార్థ గోళములో) ఎక్కడనుంచి చూసినా ధృవ నక్షత్రం కదలనట్టే కనబడుతుంది. ఇంతమాత్రమే కాదు. సూర్యుడి చుటూ

భూమి తిరిగే సంవత్సర కాలములోనూ కూడా ధృవ నక్షత్రము ఒక్కచోటనే వుంటుంది. అంటే పటములో అండ వృత్త మార్గములో సూర్యుని చుట్టూ తిరిగే భూమి యిరుసు నాలుగు కాలములలోనూ



ధృవుడివైపే మొగ్గివుంటుందన్న మాట. సాధారణముగా భూమినుంచి ఖగోళములకు గల దూరాన్ని కనుకోడానికి ఆరు నెల లలో ఒకమారు భూమిదగ్గర ఉన్నప్పుడు



'న' అనే నక్షత్రము కనిపించే 'క' కోణమునూ, మరొక ఆర్నెల్లకి భూమి 'య' దగ్గర ఉన్నప్పుడు ఆ నక్షత్రమే కనిపించే 'గ' అనే కోణమునూ కొలిచి 'న ర య' అనే త్రిభుజములో 'ర య' ల దూరము 186,000,000 మైళ్ళయితే 'ర న' ల దూర మెంత? అని లెక్క కట్టారు. నక్షత్రము దూరమైనకొద్దీ 'ర న య' అనే కోణము చిన్నదౌతుంది. ధృవ నక్షత్రానికి ఈ కోణము డిగ్రీలో అరవయ్యో వంతయిన మినిటులో అరవయ్యో వంతయిన సెకం డులో పదిహేనో వంతు. అంటే దాదాపు అర్థ శతాబ్దానికి వెనుక ధృవునిలో బయలు దేరిన వెలుతురు సెకనుకు 1,86000 మైళ్ళ చొప్పున ప్రసరిస్తూ నేటికి మనకు చేరు తోంది. ఇంతదూరములో నున్న నక్షత్రా నికి చలనము కనబడదంటే చిత్రమేమిటి?

అయితే గిర్రున తిరిగే బొంగరము తన చుట్టూ తాను తిరుగుతూనే 'ల ర' అనే లంబరేఖ చుట్టూ తిరుగుతూన్నట్టే భూమి కూడా తన చుట్టూ తిరుగుతూ, ధృవుని ప్రాంతములో గీయడానికి వీలయినవృత్తము చుట్టూ తన ఇరుసుని తిప్పుకుంటోంది. (బొంగరపు ఇరుసు పటములోని చిన్న వృత్తము చుట్టూ తిరిగినట్టే.) దీనివలన ధృవుడు 26000 సంవత్సరాల కొకమారు ఆ వృత్తము చుట్టూ తిరుగుతూన్నట్టు కనబ డుతుంది. ధృవతారకు గల సహజగమనము కాక ఇదొక గమనమున్నూ, ఇందాక చెప్పిన 1/15 సెకను ప్రమాణపు స్థాన భ్రష్టతవల్ల కనపడే గమనమున్నూ చేరి మూడు దర్శనీయ గమనాలు ధృవతారకి. అస లున్నది ఒకటే. మిగిలిన రెండూ భూమిగమనమువల్ల ధృవతారకి ఆరోపించ బడినవి. ఇవన్నీ కూడా ధృవుని దూరము వల్ల లేనట్టే కనబడతాయి. అందువల్ల ధృవ తారకు చలనము లేదనుకుంటాము.

—రావు.

చిట్టి ప్రశ్నల జవాబులు

—రాకాసి బొగ్గు, యుగాల క్రితము పెరిగీ, భూకంపాది కారణములవల్ల కూలి, కప్పబడిపోయిన చెట్లతునక. అప్పుడు ఆకులు గాని గట్టిగా అచ్చుపడినా, లేక ఆకులపదార్థము క్రమంగా శిలాపదార్థానికి చోటిచ్చేసి ఆ ఆకులరూపము శిలగా నిలి చిపోయినా, ఆ అచ్చు రాకాసిబొగ్గుమీద కనబడుతుంది. మీ కలాంటి అచ్చు దొరి కితే మాకు పంపండి. ఫొటో వేస్తాము.


* * *

భూమికి ఇండియా నుంచి అమెరికాకి కన్నము తవ్వి, ఆ కన్నము లో రాయి పడేస్తే అరాయి భూమికేంద్రం దాకా ఆకర్షణశక్తివల్ల పడి, ఆవేగమువల్ల (దానిగతి బలము ఆకర్షణవల్ల తగ్గిపోయేదాకా) సాగి పోయి, అమెరికా సమీపాన్న ఆగి మళ్లీ భూమి కేంద్రానికి పడి ఇండియాకి వచ్చి, మళ్ళీపడి అలాగ, లోలకము లాగ ఊగిస లాడుతుంది. అట్నుంచి ఒక రాయీ ఇట్నుంచి ఒకరాయీ సమమైనవి వదిలే ఈ రెండూ డీకొన్ని ఆగిపోతాయి. వాటి ఆవేగము వేడిగా మారుతుంది.


—డిశంబరు నాలుగో తేదీని పెద్ద వెలు గుతో పడినది ఉల్క. ఉల్కలనుగూర్చి అప్పుడే 'విజ్ఞానవీధులు' చదివే ఉంటారు.


—సొర, కాకర, పొట్ల, దొండ పూవు లలో ఆడుపూవులకు దిగువన పిందెలాగ వుండేది అండాశయమే. మరియొక మగ పూవునుండి దీనికి పుప్పొడి అందకపోతే, ఈ పువ్వు కాయదు. (అంటే పిందెలాగ ఉండే అండాశయము కాయయై విత్తనాలు పెట్టదు.) దాఖలా కావాలంటే, ఒక ఆడ పువ్వు వికసించకముందు ఆ పువ్వుని మీ రన్న పిందెపైకి చిక్కవెయ్యండి. లేదా పువ్వు వికసించకుండా దానిమీద పురుగు వాలి పుప్పొడి అందించకుండా దోమతెర గుడ్డ కట్టండి. ఆపువ్వు మరి కాయ అవదు.

★



పడగ నీడలో పసిపాప.
ఫొటో: శ్రీ యస్. వి. కృష్ణారావు, కైకలూరు.





ఉదయకాంతి: జంపన, నండూరి "మేనరికం"లో ఒక దృశ్యం.

బొమ్మరిల్లు

వేషమహిమ

రచన: కవిరావు

బక్క చిక్కిన బక్క
దుక్కిటెద్దును యినుప
ముక్కు కాకుల దండు
ముసురుకొని వస్తుంటె,

అడుగువేసిన కండ
లల్లాడుచున్న యొక
గంగిరెద్ద ద్దాని
గనిమాట లాడింది.

"ఏమోయి మిత్రమా!
క్షేమమా?" అనగానె
"చెప్పుకొంటే సిగ్గు
చెలికాడ నా బ్రతుకు.

కండలరుగగ యెంత
కష్టించుచున్న మా
కాపు వానికి సుంత
కనికారమే లేదు.

బండ చాకిరి చేసి
పస్తులుండియు వాడి
పత్తినై తుద కిట్టు
లెత్తుబడి పోయాను."

అనగానె గంగెద్దు
అందుకొని యిట్లంది
"ఔనౌను నీమాట
అక్షరాలా నిజము.

కోడెవయసున నన్ను
వాడ వాడలు త్రిప్పి
బాడుగలు గుంజు కొ
న్నాడు మా యజమాని,

ముదిమి నాపై వ్రాలి
మూలబడి పోగానె
దయలేని రైతు నను
తరిమి పారేశాడు.

గంగి రెద్దుల వాడు
రంగు రంగులు వేసి
పంగనామా లెట్టి
హంగుల్లు తీర్చాడు

ఊరూర నావెంట
బూరూదుకొని వస్తె
దేశమ్మ నను బసవ
దేవుడని కొలిచింది.

చూస్తివన్నా! యెంత
చోద్యమైనదో జగతి? —
అంతరార్థ మ్మిప్పు
డర్థమైనది నాకు

కష్టజీవికి పుట్టు
గతులు లేనే లేవు
వేషధారణ చేయు
మోసగాళ్ళకె కూడు

నీకు తోచిన రంగు
నీవు వేయకయున్న
మాటి మాటికి రంగు
మార్చు చుండక యున్న,

జగతిలో నీ వింక
జీవించుటే సున్న"
అనగ నా ముసలెద్దు
విని తలూపుచు నుండ,

పుండులో నొక కాకి
పొడువగా ముసలెద్దు
బాధ తాళగలేక
పరువెత్తి పోయింది

సీరియల్



విచిత్ర వ్యక్తి

మూలం:- మార్క్ ట్వేన్

జరిగినకథ:—ఆస్ట్రియాలోని ఈ జెల్ డార్ఫ్ మా స్వగ్రామం. నా యీడు వాళ్లయిన సెప్పీ, నికొలాస్ అనే మరి ఇద్దరు బాలురతో కలిసి ఎప్పుడూ అడవుల్లో, కొండల్లో తిరిగేవాణ్ణి. ఒక రోజున మేము ఒక కొండమీద మా ఆట స్థలంలో కూర్చుని ఉండగా ఒక కొత్తవ్యక్తి వచ్చాడు. తన పేరు సైతాను అనీ, తను దేవతననీ చెప్పాడు. మాకు చాలా వింతలు చేసి చూపించాడు. అతడు మాతో ఉన్నంతసేపూ మానవజాతిని నానాబూతులు తిట్టాడు. మానవులు తామేదో గొప్పవారమని అనుకుంటారుగాని నిజానికి వారిలో ఉన్న నైచ్యం ఇంకెక్కడా ఉండదని అన్నాడు. ఈ సృష్టి ఆదినుంచీ మానవుడు ఎంతగా హింసాకాండలు జరిపిందీ, జరుపుతున్నదీ, జరపనున్నదీ మాకు అంతా కళ్ళకు కట్టినట్లు చూపించాడు. మానవజాతి యింతవరకు అభ్యుదయం పేరిట సాధిస్తున్నది మారణాయుధాలను కనిపెట్టటమే నని నిర్ధారణచేసి చెప్పాడు.

11

సైతాను మరొక సంవత్సరం పాటు ఇలాగే అప్పుడప్పుడు నన్ను చూట్టానికి వచ్చేవాడు. నెమ్మది నెమ్మదిగా రావటం తగ్గించాడు. తరవాత ఒకసారి చాలాకాలం వరకూ రానేలేదు. అతడు రానప్పుడు ఏమీతోచక దిగులు పెట్టుకునే వాణ్ణి. విశాల విశ్వం ఎరిగిన సైతానుకు భూలోకం సైకత రేణువు లాంటిది. అందుచేత నామీద అతనికి క్రమంగా కౌతుకం తగ్గిపోయిందేమో నని అనుమానించాను. చివరి కొక రోజున అతడు ప్రత్యక్షమయ్యాడు. సంతోషంతో పరవశించి పోయాను. కాని ఆ సంతోషం క్షణ భంగురం లాగా మరుక్షణంలోనే మాయమైంది. శాశ్వతంగా వీడుకోలివ్వటానికి వచ్చాడు. తనకు ఖగోళంలోని ఇతర ప్రాంతాల్లో పరిశోధనలు సాగించ వలసిన పని వున్నదనీ, ఆ పరిశోధనలు నేను వేచి వుండగల కాలంకంటె ఎక్కువకాలమే పడతాయనీ, అందుచేత తుది వీడ్కోలిస్తున్నాననీ సైతాను చెప్పాడు.

"మళ్లీ ఎన్నటికీ రావా? అని గద్గదంగా అడిగాను.

"రాను," అన్నాడు మనం చాలరోజులు స్నేహం చేశాము. ఈ స్నేహం ఉభయులకూ సంతోష ప్రదమే అయినప్పటికి నేను వెళ్లక తప్పదు."

"ఈ జీవితంలో కాకపోయినా మరొక జీవితంలో నైనా నిన్ను చూడలేనా?"

నా ప్రశ్నకు సైతాను మేఘ గంభీర స్వరంతో సమాధాన మిచ్చాడు: "ఉన్నది ఈ ఒక్క జీవితమే. మరొక జీవితం లేదు."

విద్యుత్తరంగం సోకినట్టయి క్షణంసేపు స్తంభించాను. నెమ్మదిగా అవ్యక్తమైన, ఆనంద తరళితమైన ఆశా తేజస్సు మనస్సులో విస్తరించుకో సాగింది. సైతాను వాక్కులు నిజం కావచ్చుననీ, నిజమే నేమోననీ అనిపించింది.

"థియోడోర్! అలా ఆశ్చర్యపడతా వేం? ఈ సంగతి నీకిదివరకు తెలియదా?"

★ అనువాదం: శ్రీ నండూరి రామమోహనరావు ★

★ విచిత్ర వ్యక్తి ★

"నాకా? ఎలా తెలుస్తుంది? అదే నిజమైతే—"

"ముమ్మాటికీ నిజం నేను చెప్పింది."

ఒక్కసారిగా ఇంత మనశ్శాంతి ప్రసాదించినందుకు సైతానుపట్ల కృతజ్ఞతా భావంతో నిండిపోయాను. కాని ఎక్కడో ఒకమూల సందేహ రేఖ తోచింది. "కాని—కాని—నువ్వే ఒకసారి చూపించావు గదా అనంతర జీవితక్రమం? అది యథార్థం కాదా?"

"కాదు. అది కేవలం మాయ. దానికి అస్తిత్వం లేదు," అన్నాడు సైతాను.

"మాయ—మాయ—మా—" చంద్ర దర్శనంతో ఉప్పొంగిన సముద్రంవలె ఉవ్వెత్తున లేచి ఉక్కిరి బిక్కిరైంది నాహృదయం.

"అవును. జీవితం మాయ. స్వప్నాలవల."

ఆ! జ్ఞాపకం వచ్చింది. ఇదే భావం ఎన్నివేల సార్లు నామానసిక పథంలో తొంగిచూసి తొలిగిపోయింది!

"ఏదీలేదు. అంతా మాయ. రంగు రంగుల కలలవల. ఏదీలేదు. దేవుడు—మానవుడు—భూమి—సూర్యుడు—చంద్రుడు—నక్షత్రాలు—ఆకాశం—అన్నీ, అంతా మాయ, భ్రాంతి; నువ్వూ, నీచుట్టూ నిన్నావరించుకుని, అగాధం, అనంతం, అమేయం అయిన ఈమహా శూన్యమూ తప్ప మిగతాదంతా అస్తిత్వ రహితం."


"నేనా? నేను ఉన్నానా?"

"అవును. నువ్వంటే నువ్వుకాదు. నీకు శరీరం లేదు, రక్తంలేదు, ఎముకలు లేవు—నువ్వు కేవల భావానివి. నాకు కూడా అస్తిత్వంలేదు. నేను స్వప్నాన్ని; నీ స్వప్నాన్ని; నువ్వే నన్ను సృష్టించావు. మరి కాసేపటిలో ఇది నువ్వు గ్రహిస్తావు. గ్రహించి నన్ను నీమనస్సు నుంచి తొలగిస్తావు. అప్పుడు నేను ఏశూన్యంనుంచి నువ్వు సృష్టించావో ఆశూన్యంలోకి కరిగిపోతాను......

అప్పుడే కరిగిపోతున్నాను, కలిసిపోతున్నాను... ఇంకాసేపట్లో నువ్వు తీరంలేని శూన్యతా సముద్రమధ్యంలో స్నేహితులూ, సన్నిహితులూ, నా అనేవారూ లేక, ఏకాకివై సంచరిస్తూ, భావంగా సంభ్రమిస్తూ—ఒక్కడివే, ఒంటరిగా యుగాలదాకా మిగిలిపోతావు. నువ్వు భావానివి. నీకు చావులేదు, తుదిలేదు, మొదలులేదు. కాని నేను నీ సేవకుణ్ణి. నిన్ను నీకు తెలియజేశాను; నిన్ను విముక్తుణ్ణి చేశాను. నాపని అయిపోయింది, వెళ్లిపోతున్నాను. మళ్లీ కలలు కను. ఇంతకంటె మంచి కలలు కను.

ఈవిషయం నీకింత కాలంవరకూ తెలియకపోవటం వింతగావుంది. సంవత్సరాలు, శతాబ్దాలు, యుగాలు, కల్పాలు, మహాకల్పాలు నీ కళ్లముందే గడిచిపోయినా ఈవిషయం తెలుసుకోలేక పోయావు. ఈ ప్రపంచం, అందులోని వస్తుకోటి, అన్నీ స్వప్నాలనీ, అబద్ధాలనీ తెలుసుకోలేక పోయావు. ఆ స్వప్నాలైనా అర్థం లేని, ఉన్మాదయుక్తమైన స్వప్నాలు. దేవుడట దేవుడు! సుజనులను సృష్టించగలిగివుండి కూడా దుర్జనులను సృష్టించాడు. తన పుత్రులైన మానవుల నందరినీ సౌఖ్యవంతులుగా చేయగలిగి కూడా దుఃఖితులను చేశాడు. ఈదుఃఖ జీవితాన్నే ప్రేమించేట్టు చేసి, మధ్యలోనే దాన్ని తుంచివేశాడు. దేవతలకు అడక్కుండా ఆనందం ఇచ్చి, తన మిగతా సంతానాన్ని అది కష్టపడి సంపాదించుకోమన్నాడు. దేవతలకు బాధారహిత జీవితం ఇచ్చి, మిగతా సంతానానికి లక్ష మానసిక బాధలు లక్ష శారీరక వ్యాధులు తగిలించాడు. దేవుడట దేవుడు! లక్ష ధర్మపన్నాలు చెబుతూ నరకలోకం సృష్టించాడు. దయగా వుండాలని చెబుతూ నరకలోకం సృష్టించాడు. ఇతరులకు నీతి అవినీతులు అంటగడుతూ తనకేమీ లేకుండా చేసుకున్నాడు, ఇతరులు నేరం చేస్తే శిక్షిస్తూ తను అన్ని నేరాలూ చేశాడు. అడక్కుండా, పెట్టకుండా మనిషిని సృజించి మనిషి చేసే చర్యల బాధ్యత తనపై వేసుకోవలసిందిపోయి, మనిషిపైకే నెట్టివేశాడు. ఇంత అన్యాయంచేసి పైగా దుఃఖ భాజనుడైన

(41-వ పేజీ చూడండి)



గండుపిల్లి

శ్రీ ఎస్. కోటి; (మందసా)

గుత్తి పడగొట్టుకొని గుట్టు చప్పుడు కాకుండా తినేసింది.

శరీర నిర్మాణంలో కోతికీ మానవుడికీ చాలా సారూప్యం వున్నదనటానికి ఒక పెద్ద తార్కాణం-మనకు మల్లేనే కోతికి కూడా పడిశెం పట్టుతూ వుండటం. రొంప పట్టిన కోతి మొఖం చూస్తే, పొడుం పీల్చి తుమ్మబోతున్న శాస్త్రుల్లు గారి ముఖం జ్ఞాపకానికి వస్తుంది.

మనిషి మచ్చిక చేసుకొన్న కుక్క, పిల్లి, గుర్రం, గాడిదల కంటే కోతి తెలివైనదనిఅన్నప్పుడు, అలాంటి కోతినే మనిషి ఎందుకు మచ్చిక చేసుకోలేదని తెలివైన మనుష్యులకు అనుమానం తోచవచ్చు. దానికి సమాధానం చెప్పాలంటే కొంచెం చిక్కే. కోతి మెదడులో ఏఏ ఆలోచనలు పని చేస్తుంటాయో చెప్పలేం కానీ, బహుశః అది మరొకరి క్రింద తొత్తుగా బ్రతకటం అంటే ఏవగించుకొంటూ వుండవచ్చు. క్రమం తప్పకుండా ఒకేపని చేస్తూ వుండటం కోతికి కిట్టని విషయం. అందుకనే కోతిని లోబర్చుకోవాలని ప్రయత్నం చేసిన ప్రతివ్యక్తీ నిరాశా హతుడైనాడు.

★ జంతుకోటిలో మానవ లక్షణాలు ★

నిజానికి నాలుగువేల ఏళ్ల క్రితం 'బాబూన్' అనేరకం కోతి యిప్పుడున్నంత గడుసుది కాదు. తాటాకుల్నీ అత్తిపళ్లనీ కోసుకు రావటంలో యీ 'బాబూన్' రకం కోతులు మానవులకు వుపయోగపడుతున్నట్లు, ఈజిప్టు దేశంలోని ప్రాచీన కుడ్య చిత్రాలలో కనిపిస్తున్నది. మానవుడు అప్పుడుదాన్ని దగ్గరకు తీసుకొని అడ్డమైన చాకిరీ చేయించుకొన్నాడు. ఆచాకిరీ చేసి చేసి, ఆత్మాభిమానం చంపుకోలేని యీ తరహా కోతి, యిప్పుడుమనిషిఅన్నవాడికి లొంగకుండా తయారైంది.

మలయా, సుమత్రా దీవుల్లో ఒకరకమైన కోతివుంది. దాన్ని యింగ్లీషులో 'మాకే' అంటారు. ఈరకం కోతులు మాత్రం మానవుడి బానిసలుగా యిప్పటికీ బ్రతుకుతున్నాయి. అక్కడి ప్రజలు యీ కోతులచేత కొబ్బరి కాయలు కోయిస్తారు. దీని నడుముకి పెద్ద తాడుకట్టి కొబ్బరిచెట్టు మీదికి ఒదిలేస్తారు. అది నరాసరి చెట్టు కొసల్లోకి పోయి అక్కడ గుత్తులు గుత్తులుగా వుండే కొబ్బరికాయల్లో ఒకదాని మీద చెయ్యివేసి క్రింద నున్న యజమానికేసి చూస్తుంది. ఆయజమాని గనుక నడుముకి కట్టి వున్న తాడును గుంజినట్లయితే ఆకొబ్బరికాయ యింకా పక్వాంలోకి రాలేదని గుర్తు. తాడు గుంజకుండా 'కోసెయ్' అని గనుక యజమాని క్రిందినుంచే కేక పెట్టాడంటే, ఆకాయ పక్వానికి వచ్చినట్లు లెక్క-వెంటనే యిది ఆకాయను రెండు చేతులతోనూ పట్టుకు మెలిపెట్టేస్తుంది. కాయ తొడిమ వూడివచ్చాక క్రిందికి పారేస్తుంది.

యుథోపియా అనే దేశంలో కొన్నిరకాల కోతులను అక్కడి వాళ్లు మచ్చిక చేసుకొని, పెద్ద పెద్ద వాళ్లు ఎవరైనా విందుకు వచ్చినప్పుడు యీ కోతులచేత దివిటీలు పట్టిస్తారు. అతిథులు యింటికి వచ్చింది మొదలు, మళ్లా వచ్చిన వాళ్లందరూ వెళ్లిపోయే దాకా యీకోతులు యిలా దివిటీలు పట్టుకు నిల్చోవలసిందే! ఈపని అయినా అన్నికోతులూ సవ్యంగా చేస్తున్నట్లు తోచదు. వాటిల్లో గడుసు రకం కోతి ఏదైనా వుంటే, అవతల విందు సజావుగా సాగిపోతూ సంభాషణలు పేలిపోతూ వున్న సమయం సరిగ్గా చూసి, చేతిలోవున్న దివిటీని కాస్తా ఆపెద్దమనుషుల మధ్యకు విసిరేసి, మెదలకుండా నిలుచుంటుంది. దాంతో అంత ఘరానా మానుష్యులు కూడా నిప్పుతొక్కిన కోతులై 'గీ' 'బా' అని అరుస్తూ, అల్లరి పడుతూవుంటే యివతల

(41-వ పేజీ చూడండి)

తీరైన తీర్పు

మావూరి కంతా మా నాన్న గారే పెద్ద. మా వూళ్లో వాళ్ళందరికీ ఆయన ఎంత చెబితే అంత. మంచిగానీ, చెడుగాని నిర్ణయించటంలో మానాన్న గారంతటి వారు మరొకరు పుట్టబోరని కూడా మావూరి పెద్దలు మెచ్చుకుంటారు.

ఆవేళ ఆదివారం కావటంచేత నేను మా యింటి అరుగుమీద లెక్కలు చేసుకుంటూ కూర్చున్నాను. ఇంతలో నలుగురు రైతులు వాళ్లల్లో వాళ్లు ఏవో వాదులాడుకొంటూ మానాన్న గారి దగ్గరకు వచ్చారు. ముందుగా మానాన్నకు నమస్కారంచేసి వాళ్లు నలుగురూ కూడా క్రింది అరుగుమీద కూర్చుని వాళ్లగొడవ చెప్పటం మొదలెట్టారు.

వారు నలుగురూ అన్నదమ్ములు. వాళ్లతండ్రి చనిపోయినప్పుడు ఆ ఆస్తినంతా వాళ్లు నల్గురికీ మా నాన్నగారే, తగువులు, రాకుండా పంచి యిచ్చారన్న సంగతి నాకు తెలుసు. కాని వారికో కుక్క ఉండేదట. ఆకుక్కను నలుగురుకీ సమానంగా పంచటం ఎలా? అంచేత ఆకుక్కను ఎవరో ఒకరు తీసుకోండని మా నాన్న గారు చెప్పారట కానీ, వారికా తీర్పు నచ్చక నలుగురూ ఆకుక్క నాలుగు కాళ్లనూ పంచుకున్నారు. అంటే-తలా ఒకకాలూకోసి పట్టుకు పోయారని కాదు. ఎవరి వాటా కాలుని వాళ్ళు జాగ్రత్తగా పోషించుకోవాలన్నమాట.


సరే. కొన్నాళ్ళవరకూ ఏమీ తగువులు లేకుండానే కాలం గడిచి పోయింది. ఒకనాడు మూడోవాని వాటాకు వచ్చిన కుక్క కాలికి దెబ్బ తగిలిందిట. మిగతా ముగ్గురన్నదమ్ములూ చెప్పిన మీదట అతడా కాలికి నూనెగుడ్డ కట్టాడట. మరునాడు ఎవరుపన్లు వారు చూసుకోడానికి పొలానికి వెళ్ళిపోయారు.

శ్రీ గుణ్ణాం వెంకట్రాజు

ఆవేళ మధ్యాహ్నం ఏదో ప్రమాదవశాత్తు కుక్కకాలికి కట్టిన నూనె గుడ్డకి నిప్పు అంటుకొందిట. ఆకుక్క భయపడిపోయి పరుగు పరుగున యీ నలుగురు అన్నదమ్ములు వున్న పొలంలోకి వచ్చిందట. అక్కడే నలుగురన్నదమ్ముల కొలాకు వరి కుప్పలు వున్నాయట. కుక్క, తన కాలుకి అంటుకున్న మంటను ఆర్పుకొనే ప్రయత్నంలో ఆ కాలుని ఓ వరి కుప్పకు రాసిందట. ఇంకే ముందీ? ఆకుప్ప అంటుకొందిట. అర నిముషంలో ఆవరుసనే వున్న నాలుగు కుప్పలకీ నిప్పు అంటుకొని, ఆ నలుగు రన్నదమ్ములు అక్కడికి వచ్చేలోగానే, బూడిద అయాయట.

కారణం తెలుసుకొన్న మీదట యిదంతా మూడోవాని మూలానే జరిగిందనీ, వాడా కాలికి నూనెగుడ్డ కట్టినందు వల్లనే అదంటుకొని అందు మూలంగానే కుప్పలు కాలి పోయాయనీ, అందుచేత తమకు నష్ట పరిహారం యిమ్మని తక్కిన ముగ్గురన్నదమ్ములు నాల్గోవాణ్ణి పట్టి బలవంతాన మా నాన్న దగ్గరకు లాకొచ్చారు. ఈ వార్త ఊళ్లో అందరికీ తెలిసి మా నాన్న ఏం తీర్పు చెపుతారో విందామని మా అరుగుల చుట్టూ గుమి గూడారు. నేను కూడా లెక్కలు చెయ్యటం మానేసి కలం జేబులో పెట్టేసి చూస్తూ కూర్చున్నా. ఎవరికి తోచింది వారు చెప్పుకుంటున్నారు. మా నాన్న వాదనలన్నీ సావకాశంగా విని, 'తీర్పు రేపుచెబుతా' నన్నారు. అందరూ అప్పటికి తమ తమ యిళ్లకి వెళ్ళిపోయారు.

ఇంటి దగ్గర నాన్న కేమీ తోచటంలేదు. తీర్పు ఎలాచ్పెటం? ఉభయ పార్టీలకూ నష్టం లేకుండా



★ తీరైన తీర్పు ★

...ఉండాలి. మూడో వాడు కాలికి నూనె గుడ్డ కట్టినందువల్లనే నిజానికి యీ ముప్పు వచ్చింది. కనుక నష్ట పరిహారం వాడే యిచ్చుకోవాలి. పాపం-వాడు మాత్రం ఎలా యిచ్చుకోగలడు? వాడికి మాత్రం ఏం తెలుసు యిలా అవుతుందని? ఏదో దెబ్బ తగిలింది గదా అని, నూనె గుడ్డ కట్టాడు గానీ పరి కుప్పలు కాల్చాలనే వుద్దేశం వాడికి లేదుగా! లేదు - ఈ విషయంలో మూడో వాడి తప్పేమీ లేదు. నష్ట పరిహారం కూడా యిచ్చుకోవలసిన అవసరం లేదు. కాని అలా అంటే మిగిలిన వాళ్లు ఊరుకుంటారా? అని తికమక పడ్డారు.

నాకు చటుక్కున ఓ ఉపాయం తోచింది. "మూడో వాడు తన వాటాకు వచ్చిన కుక్క కాలు క్షేమంకోరి ఆనూనె గుడ్డ కట్టితే మాత్రం నష్ట పరిహారం యితనెందు కిచ్చుకోవాలి? నిజానికి నష్ట పరిహారం అనేది ఆమిగిలిన ముగ్గురూ కలిసి యితనికే ఇవ్వాలి నాన్నా" అనేశాను. నాన్న ఆశ్చర్యపోయారు-"అదెట్లారా?" అన్నారు.

"అది కాదండి కుక్కకి ఏకాలికైనా దెబ్బ తగిల్తే అది ఆకాల్ని భూమి మీద ఆన్చకుండా మిగిలిన మూడు కాళ్ళమీదే నడుస్తుంది కదా! అలాగే యీ కుక్కకూడా తన కాలిన కాలుని క్రిందఆన్చకుండా మిగతా ముగ్గురు వాటాలకు వచ్చిన ఆమూడు కాళ్ళమీదనే నడుచుకొంటూ ఆకుప్పల దగ్గరకు పరుగెత్తింది. మూడోవాని వాటాకాలు భూమి మీద ఆననే లేదు. ఆముగ్గురి వాటాకు వచ్చినకాళ్లు సరిగా వుండబట్టే, యీ నాలుగో వాడి కుప్పకు ముందుగా నిప్పు అంటుకోవటం జరిగింది. అందుచేత యితనికే మిగిలినవాళ్లునష్టపరిహారం యివ్వవలసి వస్తుంది" అన్నాను.

మా నాన్నకు పట్టలేనంత ఆనందం వచ్చి నన్ను అమాంతం కౌగలించుకొన్నారు. మరునాడు యిదే తీర్పు చెప్పేసరికి ఊరిలో వాళ్ళంతా ఎవరికీ నష్టం లేకుండా చేసినందుకు మానాన్నని తెగ పొగిడేశారంటే నమ్మండి.

ఆదెబ్బతో మనకీర్తి క్లాసులో వారం రోజులవరకూ మారుమ్రోగింది. సోమవారం యీ తీర్పులోబడి బడిఎగవేసి నందుకు వీపు మ్రోగి పోయింది. ★

చైనాలో సంవత్సరానికొకసారి "గాలిపడగ దినం" అనే పండుగ జరుగుతుంటుంది. ఆరోజున పిన్నలు పెద్దలు, అందరు చేరి ఎంతో సంతోషంగా గాలి పటాలు ఎగురవేస్తారు. అసలు గాలి పటాలెలా వచ్చాయో తెలుసా?

చాలా కాలం క్రితం చైనాలో 'క్వాంగ్ టుంగ్' అనే ప్రాంతం పాడి పంటలతో శోభిల్లుతూండేది. ఆ ప్రాంతంలోని ఒక పర్వతంమీద 'నింగ్‌చ్యూ' అనే ఒక మహానుభావుడు నివసిస్తూండేవాడు. ఆయన జరిగిపోయినవి, జరుగుతున్నవీ, జరుగబోయేవీ కూడా చెప్పేవాడు. ఆయన తన విజ్ఞానాన్నంతటినీ మానవజాతి అభ్యుదయం కోసమే ఉపయోగించాలని అనుకొంటూండేవాడు.

ఇలా వుండగా ఒకరోజు రాత్రి 'నింగ్‌చ్యూ' కొక కల వచ్చింది. ఆయన నివసిస్తూన్న పర్వత లోయలో ఏదో ఒక పెద్ద వ్యాధి వచ్చి అక్కడి ప్రజలందరూ నాశనం కాబోతున్నట్టు కలగన్నాడు. మానవ జాతిని వుద్ధరించటమే పరమావధిగా గల నింగ్‌చ్యూ ఈ ఆపద నుండి ప్రజలనెలాగైనా రక్షించాలనుకున్నాడు.

అందుకోసం, వెంటనే బయలుదేర కొండ దిగి, లోయలోవున్న ప్రతియింటికీ వెళ్ళి ఒక పెద్దవ్యాధి వచ్చి ప్రజలను రూపుమాపబోతోందని చెప్పి, తనతో పాటు వారందరినీ పర్వతం మీదకు రమ్మని కోరాడు. ప్రాణం అంటే ఎవ్వరికైనా తీపేకదా? వెంటనే ప్రజలంతా ఆయన చెప్పినట్లు పర్వతం మీదకు వెళ్ళిపోయారు. పచ్చని పైరులతో పసిపాపలతో కళకళలాడుతూ వుండే ఆ లోయ కొద్ది గంటల్లోనే ఎడారిలా మారిపోయింది.

శ్రీ కొమ్మలపాటి హనుమంతరావు

ప్రజలంతా పర్వతం మీదనే వుంటూ కొద్ది రోజులు హాయిగా కాలం గడిపారు. కాని లోయలో వరి పొలాలన్నీ బాగా పండి, కోతకు వచ్చాయి. అందువల్ల కొంతమందికి క్రిందకు వెళ్ళి, పంట నూర్పిళ్లు చేయాలనే ఆలోచన కలిగింది. వెంటనే వెళ్ళతామని 'నింగ్‌చ్యూ'తో చెప్పారు. ఇంకా వ్యాధి రావటానికి కొన్నాళ్ళు గడువుంది. అందుచేత 'నింగ్‌చ్యూ' వాళ్ళనప్పుడే పోవద్దన్నాడు.

కాని వాళ్లు వింటేగా? ఆయన మాట పట్టించుకోకుండా కొన్ని కుటుంబాలు వెళ్ళిపోయాయి. ఇక మిగిలివున్న వాళ్ళు కూడా వెళ్ళిపోదామని అనుకొంటున్నారు. ఉన్నవారినైనా క్రిందికి పోకుండా ఆపి, వారిని విపత్తునుండి రక్షించాలనుకున్నాడు నింగ్‌చ్యూ.

కాని వీరందరినీ ఎలా ఆపాలి? పోవద్దని బ్రతిమాలుతున్నా వినటంలేదు. ఏదో మోసం చేయడానికి తరలించు కొచ్చాడని వారందరనుకొంటున్నారు. కాబట్టి వీరందరకీ ఇంటి సంగతి జ్ఞాపకం లేకుండా చేసినట్లయితే, కొంతకాలం గడుస్తుంది. ఇంతట్లో వ్యాధివచ్చి వెళ్ళిపోతుంది అని 'నింగ్‌చ్యూ' తీర్మానించుకొని, ఉపాయం ఆలోచించాడు. కొంత సేపటికి భలే ఉపాయం తట్టింది.

'నింగ్‌చ్యూ' ఒక కాగితాన్ని తీసుకొని వెదురు బద్దల సహాయంతో ఒక నలుచదరపు టాన్ని తయారుచేశాడు.' ఆపటానికి తోక

(40-వ పేజీ చూడండి)



టర్కీ కోడి



దయ్యపు పుంజు

తెల్లవారితే భోగిపండుగ. వేణూని వాళ్ల అమ్మ తెల్లవారు ఝామునే నిద్ర లేపేసింది. వేణూ గబగబ లేచి తానిమధ్య శ్రమపడి పోగుచేసిన కంప తుక్కెలను తగుల వేయడం మొదలు పెట్టేడు. చెల్లాయి యింటిలోని పాత చీపురులను, చేటలను తెచ్చి మంటలో వేయడం మొదలు పెట్టింది.

భోగిమంట లయ్యాక తలంటు పోసికొని, అమ్మచేసిన వేడి వేడి దోసెలు, బంగాళాదుంపలు కూర వేయించుకొని తిన్నాడు. జొన్న చేలవైపు అలా షికారుగా వెళ్లి వస్తే బావుంటుదని వాసు యింటికి బయలుదేరి వెళ్లాడు.

'చేని దగ్గరున్న వాళ్ల తాతయ్యకు దోసెలు, ఫలహారం తీసుకొని వెళ్లాడు నాయనా' అని సీనూ వాళ్లమ్మ చెప్పింది. వాణ్ణి అక్కడ చేలోనే కలుసుకొని కాసేపు హాయిగా అటు తిరిగి రావచ్చనుకొని గబగబా పొలాల వేపు నడవడం మొదలెట్టేడు.

బాట కిరువైపులా జొన్నపైరు కన్నుల పండువుగా కలకల లాడుతోంది. అక్కడక్కడ బంగారు చారలతో దోనపండ్లు నేలపై దొర్లాడుతున్నాయి. పెసర చెట్లు గుత్తులు గుత్తులుగా కాయలు కాశాయి. ఇవన్నీ చూస్తూ నడుస్తోంటే వేణూ హృదయంలో అంతులేని ఆనందం కలిగింది. భూమాత తన బిడ్డలకోసం ఎన్ని రకాల వంటలు వండిపెట్టుతున్నదో కదా అని అబ్బురపడ్డాడు.

శ్రీ వాసిపల్లె
వెంకటేశ్వరరెడ్డి

రొజుకుంటూ, పరుగెత్తుతూ ఎదురొచ్చాడు వాసు. "ఏమిట్రోయ్ పరుగెత్తుతున్నావు? నీకోసరమే నేనూ వస్తున్నా!" అన్నాడు వేణు.

"మళ్ళీ మాట్లాడుకుందాం గానీ, ముందు పరుగెత్తరా! దయ్యం తరుముకు వస్తోంది!!" అని వేణు చేతిని పట్టుకు తనతో లాక్కుపోయాడు. వేణు కూడా తన ప్రయత్నం లేకుండానే పరుగు ప్రారంభించేశాడు.

"దయ్యమా? ఏదీ-ఎక్కడుందీ? అన్నాడు పరుగెత్తుతున్న వేణు.

"ఆ ప్రక్క చేలోనే ఉందిరా! నేను నడిచి వస్తోంటే "బాబూ-బాబయ్యా!" "బాబూ-బాబయ్యా!" అంటూ ఏవో అరుపులు వినపడ్డాయిరా! ఏమిటోనని నేను అటువైపు తిరిగి చూతును



గదా- ఓ పెద్ద కోడిపుంజు "బాబూ, బాబయ్యా" అంటూ నావేపు పరుగెత్తు కొస్తోంది...అబ్బ! గుండె లదిరిపోయినాయిరా! అమాంతం అక్కడ నుండి యిక్కడికి దూకినట్లుగా పరుగెత్తుకొచ్చే నంటే నమ్ము!" అన్నాడు వాసు-వెనుక నుండి దయ్యప్పుంజు వస్తోందేమోనని మాటి మాటికి వెనక్కి తిరిగి చూస్తూనే.

ఇదంతా వినేసరికి వేణుకి కూడా భయమేసింది. ఇక ఎలాగూ వాసు పొలాల మీద షికారుకి రాడు. తానొక్కడు మాత్రం యిక ఎలా పోగలుగుతాడు-ఒకవైపు దయ్యాన్ని గురించి వింటూ? ఇద్దరూ కలిసి వేణు ఇల్లు చేరుకొన్నారు.

పండక్కి అత్తారింటికి వచ్చిన వేణువాళ్ల బావపోకుగా ముస్తాబై బయట వరండాలోని ఈజీ చెయిరులో కూర్చుని సిగరెట్టు దమ్ము లాగుతున్నాడు. వేణుని చూడ్డంతోటే "ఎక్కడికి కెళ్లావురా?" అన్నాడు.

"పొలాలు చూడ్డానికి వెళ్లాం!!"

"మరి-అప్పుడే వచ్చేశా రేం?"

"మధ్యలో దయ్యముంది బావా!"

"ఛా! దయ్యమే మిట్రా నీ ముఖం!" అన్నాడు బావనవ్వుతూ.

"కాదు బావా! నిజంగానే! వాసు చూశాడు! ఏంరా వాసూ?"

వాసు అవునన్నట్లు తల వూపేడు.

"అయితే మరి దయ్యమెలా వుందో చెప్పరా!" వాసూని ప్రశ్నించేడు.

"మరేమో...అచ్చంగా కోడి పుంజులాగే ఉందండీ!" అన్నాడు వాసూ...అంతకంటే మంచి మాటలు దొరకక.

"అయితే కోడిపుంజే నేమో!"

"కాదండీ! కోడిపుంజే అయితే ఎలా మాట్లాడుతుందండీ! 'బాబూ బాబయ్యా!' అని అరుస్తోంటేనే"

"అరే; తమాషాగా ఉన్నాయే నీమాటలు! కోడి ఎలా మాట్లాడుతుందిరా?" అన్నాడు వేణు బావ.

"అది దయ్యమే బావా! కోడి కాదు!" అన్నాడు వేణూ.

"దయ్యంలేదు, గియ్యంలేదు, పట్టిది పోండ్రా!" అన్నాడు బావ.

ప్రక్కనుండి ఇదంతా వింటూన్న పాలేరు సుబ్బన్న అక్కడికి వచ్చి-"అబ్బాయిగార్లు చెప్పిన మాటలు నిజమే బాబూ! నిన్న సాయంత్రము గూడా చాలా మందికి యిట్టానే ఆపుంజు కనుపించిందంట! గడ్డికి పోయిన ఆడోళ్లంతా భయపడి లగెత్తుకొచ్చారు" అన్నాడు.

"అలాగా!" వేణూ వాళ్ల బావకు ఆశ్చర్యం వేసింది. కాని తాను ఏదీ స్వయంగా చూడందే నమ్మడు. "సరే పోయి అదేమిటో తేల్చుకొద్దాం" అని వేణూ వాళ్ల బావ సుబ్బన్నను, వేణూ, వాసూలను వెంటబెట్టుకొని బయలుదేరాడు. ఎందుకైనా మంచిదని సుబ్బన్న ఒక పెద్ద కుందేటి వల సంపాదించి చేత పట్టుకొచ్చేడు.

వాసూ చూపించిన చేలో అందరూ ఆగేరు. శబ్దం ఎటువేపు నుంచైనా వస్తుందేమోనని అందరూ నిశ్శబ్దంగా నిలుచుండి నలువైపులా చూస్తున్నారు.

"అదుగదుగో వస్తోంది!" అన్నాడు సుబ్బన్న-సన్నని గొంతుకతో. వేణూ, వాసూలు ఎగిరి ఒక గంతులో పోయి సుబ్బన్న వెనుక దాగేరు.

వేణూ వాళ్ల బావ గూడ ఆశ్చర్యంతో అటువేపు చూసేడు. ఆకారం అచ్చం మన మామూలు కోడిపుంజు లాగే ఉంది. సైజు మాత్రం కొంచెం పెద్ద. సుబ్బన్న జొన్న చేలో పొంచిఉండి దగ్గరకు రాగానే వల విసరేడు. పుంజు వలలో చుట్టుకు పోయింది!

"బాబూ!- బాబయ్యా!" అని అరవడం మొదలెట్టింది, వలలో పడ్డ పుంజు! వేణూబావ, సుబ్బన్న, యిద్దరు పిల్లలు దాని దగ్గరకు చేరారు. సుబ్బన్న దాన్ని రెండు చేతులతోనూ పట్టుకొని "దయ్యం గాదు, గియ్యంకాదు - దీని కూతే యింత బాబూ!" అన్నాడు నవ్వుతూ!

"అయితే మాత్రం - చాలా విచిత్రంగా ఉంది సుబ్బన్నా! చూడు అచ్చం మనిషి లాగానే అరుస్తోంది!" అన్నాడు వేణు వాళ్ల బావ. వాసూ, వేణూల భయం ఎగిరిపోయింది. సంతోషంతో గంతు లెయ్యడం మొదలెట్టేరు. సుబ్బన్న వలతోపాటే పుంజుని చంకన బెట్టుకొని బయలుదేరాడు; వాడివెనకాలే వేణూ, వాళ్ల బావ, వాసూ కూడా నడిచారు.

ఇల్లు చేరుకునే సరికల్లా ఊరిలోని జనమంతా విరగబడ్డారు దాన్ని చూడటానికి! అది మాటి

★ దయ్యపు పుంజు ★

మాటికి - "బాబు, బాబయ్యా" అంటూనే వుంది.

"దీన్ని వదిలేయండి; లేకుంటే వూరికి చెరుపు గలుగుతుంది!" అన్నాడు రామశాస్త్రి. "నిజమే! అలాగే చేయండ"న్నారు గ్రామస్తులంతా.

కాని అలా దాన్ని వూరికనే వదిలేసే ఘటం కాదు వేణూబావ! ఒక కొయ్యపెట్టె చేయించి ఆపుంజును అందులో పెట్టి, అత్తయ్యా వాళ్లు వద్దంటున్నా వినకుండా, తనవెంట తీసి కెళ్ళాడు.

బస్సు కదిలేటప్పుడు వేణూ అడిగేడు-"దాన్ని ఎక్కడికి బావా తీసుకెళ్తున్నావు?" అని

"మదరాసుకోయ్ అన్నాడు!" బస్సు కదలిపోయింది మదరాసుకెందుకో వేణూకు అర్థం కాలేదు; ఇంటికి వచ్చేడు దారి పొడుగునా ఆలోచిస్తూ.

ఐదవనాటి కల్లా వేణూ నాన్న పేరట ఒక పెద్ద రిజిష్టర్డు పార్సల్ వచ్చింది, పోస్టులో. వేణూ నాన్న దాన్ని యింటికి తెచ్చేడు. విప్పడం మొదలుపెట్టే సరికి యింట్లో అందరూ చుట్టూ మూగేరు.

దాంట్లో రెండు జతల బూట్లు, ఒక ఉన్ని శాలువ ఉన్నాయి. మధ్యనున్న చీటీ తీసి వేణూ నాన్న యిలా చదవడం మొదలెట్టేడు.

"...ఆ పుంజును నేను మదరాసులో జంతు ప్రదర్శనశాల వాళ్లకి అమ్మేను. రెండు వందల రూపాయలు వచ్చాయి. ఆడబ్బుతో వేణూ, వాసూలకు చెరి యొకజత బూట్లు, సుబ్బన్నకో శాలువ కొని మిగతా పైకంతో నేనొక రిష్టు వాచీ కొనుక్కొన్నాను..."

"అల్లుడు చాల గట్టివాడండోయ్!" అంది వేణూ వాళ్లఅమ్మ.

రెండు బూట్లజతలు చేత పుచ్చుకొని వాసూ యింటికి పరుగెత్తేడు వేణు! ★

చైనాలో గాలిపడగ దినం

(37-వ పేజీ తరువాయి)

నొకదాన్ని కట్టాడు. దానికి దారం కట్టిపైకి వదిలేసరికి అది ఆకాశంలో చిత్ర విచిత్రంగా నాట్యం చేయడం మొదలెట్టింది.

అలా గాలిపటం ఆకాశంలో నాట్యం చేస్తుంటే చూచేవారందరికీ తాము కూడా అలా ఎగురవేయాలని బుద్ధి పుట్టింది. వెంటనే వారంతా 'నింగ్‌చ్యూ' చేసినట్లు గాలి పటాలను తయారుచేసి ఆకాశంలో ఎగురవేశారు. గాలి తాకిడికి అవి బహు చిత్రంగా నాట్యం చేస్తుంటే చూచినవారి హృదయాలు సంతోషంతో పొంగిపోర్లాయి.

చెడిపోయిన గాలి పటాలను బాగుచేయడం, గాలిలో ఎగురవేస్తూ సంతోషంతో ఎవరి పటం ఎక్కువ ఎత్తు పోతుందోనని పందాలు వేసుకోవడంతో ఇంటికి పోవాలన్న తొందర వారికి కలుగనే లేదు.

ఈలోగా లోయలో వ్యాధి వచ్చి వున్నవాళ్ళందరిని దాదాపుగా వూడ్చుకుపోయింది-ఇదంతా జరిగిన తర్వాత 'నింగ్‌చ్యూ' ఇక ఫర్వాలేదులే అనుకొని, వారందరిని తిరిగి సుఖంగా యింటికి పోవచ్చని ఆదేశించాడు. ఇన్నాళ్ళు తామెలా గడిపామా అని ప్రజలంతా ఆశ్చర్య పోయారు. వ్యాధినుండి రక్షించినందుకు కృతజ్ఞతతో వారి హృదయాలు నిండి పోయాయి. నింగ్‌చ్యూను అనేక విధాలుగా కీర్తించారు. లోయఅంతటా సంతోషం వెల్లి విరిసింది.

ఆలోయలోని వారంతా తమ కృతజ్ఞతా చిహ్నంగా ప్రతి సంవత్సరము నింగ్‌చ్యూ జన్మ దినోత్సవము జరుపుతూ వుంటారు. ఆరోజునే ఆబాల గోపాలము గాలి పడగల నెగురవేసి ఆనందంగా కాలం గడుపుతారు. కొన్ని సంవత్సరాలు గడచిన తరువాత ఆపండుగ దేశమంతా వ్యాపించింది.

చైనానుండే ప్రపంచ దేశాలన్నీ గాలి పటాలను చేయడం తెలుసుకొన్నాయి. మనం కూడా గాలి పటాల నెగుర వేస్తున్నప్పుడు మానవజాతి మేలును కోరిన ఆ 'నింగ్‌చ్యూను' ఒక్కసారి మనస్సులో జ్ఞాపకం చేసుకొందాం. ★

★ విచిత్రవ్యక్తి ★

(32-వ పేజీ తరువాయి)

మానవుడు తన్ను భక్తితో కీర్తించాలని శాసించాడు. దేవుడట దేవుడు.

చూశావా థియొడోర్! ఈపిచ్చితనమంతా స్వప్నంలో కాకపోతే వాస్తవంగా జరగటానికి వీలుందంటావా? ఇదంతా పిచ్చితనం కాకపోతే మరేమిటి? ఈపిచ్చితనం తన్నుతాను తెలుసుకోలేని నీ మనస్సు తప్ప మరెవరు సృష్టిస్తారు? ఒక్కమాటలో చెప్పాలంటే ఇందతా మిథ్య, స్వప్నం. నువ్వే దీనికి కర్త.

నేను చెప్పింది నిజం. దేవుడులేడు ప్రపంచం లేదు, మానవజాతి లేదు; జీవితంలేదు, స్వర్గంలేదు నరకంలేదు. ఇదంతా అర్థం పర్థంలేని స్వాప్నిక భ్రాంతి. నువ్వుతప్ప మిగతాదంతా అసత్యం. నువ్వెవరివి? భావానివి, ఉపయోగంలేని భావానివి. నిలకడలేని, నిలవనీడలేని భావానివి. పరిధిలేని శూన్యపథంలో, యుగాల రథంలో నిస్సహాయంగా ప్రయాణంచేసే భావానివి."

ఈమాటలు ముగిస్తూ సైతాను అంతర్ధానుడయ్యాడు. అతడు చెప్పిన ప్రతిముక్కా నిజమనే ప్రబోధంతో అప్రతిభుణ్ణాయి నిలిచిపోయాను.

సమాప్తం

★ జంతుకోటిలో మానవలక్షణాలు ★

(34-వ పేజీ తరువాయి)

యీ కోతులన్నీ చప్పట్లు చరిచి అల్లరిచేసి పారేస్తాయి'

'ఏప్' రకం కోతిని యింతవరకు ఎవరూ సవ్యంగా మచ్చిక చేసుకొన్నట్లు ఋజువులేదు. చింపాంజీల చేత సర్కసుల్లో సైకిళ్లు తొక్కిస్తుంటారు. నిజమే కాని-అవి సైకిళ్లు తొక్కటం యజమాని మెహర్బానీకోసం మాత్రం కాదు. నలుగురి దృష్టినీ ఆకర్షించేలా సైకి లెక్కి తిరగటం వీటికీ సరదాయే. ఎంతసరదా అయినా, దీన్ని ఆసరాగా తీసుకొని తన యజమాని తనను ఎక్కడ ఒక తొత్తుక్రింద చేసి పడేస్తాడో నన్న యావకొద్దీ యివి అప్పుడప్పుడు యజమానికి ఎదురు తిరుగుతూ వుండటం కూడా కద్దు.

ఒక సర్కసులో ఆడ చింపాంజీ కోతి నొకదానిని పట్టుకొచ్చి, దానికి సైకిలెక్కి తిరగటం నేర్పారు. ఆసైకిలికి రెండు సీట్లుండేవి. ఒకసీటు మీద యిది ఎక్కి తిరుగుతూ తిరుగుతూ, మధ్యలో మరొక మొగ చింపాంజీని చెయ్యి పట్టుకు సైకిగుంజి రెండో సీటుమీద కూర్చో పెట్టుకొని 'రింగ్' చుట్టూ తిరగాలి. ఇలా చాలా రోజులుచేసిన మీదట ఒకరోజున ఆ ఆడ చింపాంజీకి స్వతంత్రమైన ఆలోచన ఒకటి తట్టింది. ముందు తానొక్కతే సైకిలెక్కి రింగ్ చుట్టూ మూడు నాలుగుసార్లు తిరిగింది. మొగ చింపాంజీ తగుదునమ్మా అని ముసి ముసి నవ్వులు నవ్వుకొంటూ సైకిలు దగ్గరకు రాగానే, యీ ఆడ చింపాంజీ వున్న పళంగా సైకిలు దిగిపోయి, ఆ 'మొగ కోతి వెధవను' అంతమందిలోను పట్టుకు చావ బాదేసింది. ఇంకేముంది-ప్రేక్షక లోకం గగ్గోలు ఎత్తిపోయింది చేతుల తీట తీరేదాక అంతలావు మొగ చింపాంజీనీ బాదేసి, ఏమీ జరగనట్లే మళ్లీ వెనక్కి వచ్చేసి సైకిలెక్కి తిరగటం మొదలు పెట్టింది. పాపం-ఆమొగ చింపాంజీకి తల కొట్టేసినంత పని అయిందంటే నమ్మండి. మరి ఆ ఆడదానికి అంతలావు కోపం వచ్చే పని చింపాంజీగాడు ఏదైనా చేశాడో, లేక, రోజూ జరిగే వేడుకతో తృప్తిపడలేక యీ ఆడచింపాంజీయే ఆటలో క్రొత్తదనం తేవటం కోసం తన తెలివితేటల నంతటినీ యిలా వుపయోగించిందో చెప్పటం కష్టం. కారణం ఏదైతే నేం కానీ-తాను యజమాని చెప్పినమాట జవదాటని చచ్చుగాడిదను మాత్రం కానని చాటసింది యీ చింపాంజీ అంగన! (ఇంకావుంది)

★ మేధావి ★

(25-వ పేజీ తరువాయి)

లేకుండా చేసిపెట్టేస్తుంది! ఇహ ఎవరు కనబడినా అచ్చన్న ఈ కట్నం విషయమే చెప్తూ వాళ్ళచేత, 'మొత్తంమీద గట్టోడి వేరా నువ్వు' అనిపించుకోకుండా ఉండ లేక పోతున్నాడు. ఈ విషయాన్ని అచ్చన్న ఇతరులకు చెప్పేటప్పుడు చాల నిరాడంబరంగానే చెప్తున్నట్టుఉంటాడు. కాని అతని మనసు నిండా ఈ విషయమై ఆడంబరమే అల్లుకపోయి ఉందని చెప్ప డంలో అతిశయోక్తి కించిత్తూ లేదు. అయితే ఉన్నట్టుండి ఇంత ఆనందాన్నీ అతని లోంచి పిండి పారేయడానికే నన్నట్టుగా ఓ పాలికాపు 'ఏంది మావోయ్! మీరామి గాడికి ఆ రామ్మూర్తిగాడి పిల్లని పెళ్ళి చేస్తున్నారటే! ఆడు చానా అగండుడు. ఆడితో యవ్వారం కట్టమే. ఇంతకీ ఏం ఇత్తానన్నా డేంటి కట్నం' అనేసరికి, అచ్చన్న ఆ పుచ్చుకోబోయే దంతో కొంత మెల్లగా చెప్పాడు. వెంటనే ఆ పాలికాపు 'నూటపదార్లే......ఏమో నాకు నమ్మకం లేదు. ఆడంత ఇత్తాడంటే నాను నమ్మను' అంటూ వెళ్ళిపోయాడు. ఈ మాట విన్న బుచ్చమ్మ 'ఈ జులాయోడి మాటకేంలే. ఈ ఎదవకేంటి నోటి కలాఒత్తే అలాగే ఒగుతాడు' అంది. పాపం అచ్చన్న ఎంచాతనో దీర్ఘాలోచనలో పడిపోయాడు.

పెళ్ళి రాత్రి కనగా ఊళ్ళో అనాటి మధ్యాహ్నం భోజనాలు పెట్టుకొని బస్సులో కొంతమంది పెద్దలను అచ్చన్న బయలు దేర తీశాడు. పెళ్ళి కొడుకునూ బుచ్చెమ్మనూ కొంతమంది చుట్టాలనూ ప్రొద్దున్నే అక్కడకు పంపాడు.

అచ్చన్న బయలుదేరతీసిన పెద్దలందరూ వేషాలకీ నిషాలకీ పేరుమోసిన రకం. వాళ్ళేదోవిధంగా అచ్చన్న నుదగా చెయ్యని సంఘటనలు చాల అరుదు. అయితే అచ్చన్నకు అంతకన్నా మరి పెద్దలూ లేరనే అనాలి.

వీళ్ళందఱికీ బస్సు టిక్కెట్లు కొని అచ్చన్నకూడ బస్సెక్కాడు. బస్సు పరుగెడుతూంటే అచ్చన్న బుర్రలో అనంతంగా అవుతూన్న ఖర్చులుకూడ దౌడు తీశాయి. ఖర్చులప్పుడే రెండువందలు దాటి పోయాయి. దాచిన డబ్బు ఇట్లా దారి చేసుకొని పారిపోతూంటే అచ్చన్న గుండె దిగాలుపడిపోయింది. అయినా 'కట్నం వత్తాదిగా అప్పు డింత కర్చనిపించదు' అనుకున్నాడు. కాని ఈ కట్నంమాట తలపుకురాగానే అతని గుండె లెందుకో దడదడ కొట్టుకోవడం మొదలు పెట్టాయి.

బస్సులోంచి అచ్చన్న కాలు క్రింద పెట్టగానే, రామ్మూర్తి ముచ్చటగా పలకరించాడు. ఈ మర్యాదకు తన్మయుడైన అచ్చన్న 'చీఫీ. ఇంత మంచోడు చత్తే మరోలా చేత్తాడా? ఎదవ. ఆ జులాయోడి మాటలకేంలే.' అనుకున్నాడు.

అయితే ఒక్క అచ్చన్ననే రామ్మూర్తి పలకరించి ఊరుకోలేదు. ఆ వచ్చిన వాళ్ళందఱితోనూ అతను ఎంతో కలుపుగోరుతనంగా మాట్లాడాడు. ఇంటిదగ్గఱ ఈతచాపలు తనే పఱచి వాళ్ళందరూ వాటిమీద ఆసీనులయ్యేట్టు చేశాడు.

ఆ అరుగుమీద కూర్చున్నాడన్నమాటే గాని అచ్చన్న బుర్రలోకి ఆ కట్నం మళ్ళీ తుర్రున ప్రవేశించింది. అది అందులో రెక్కలు కొట్టుకొని ఎగురుతూంది. అది ఒకొక్కసారి మెదడు కదలిపోయేట్టు దెబ్బ

కుప్పనూర్పిడి



కొడుతూంది. ఒక్కొక్కసారి విమానంలో కూర్చోబెట్టి హాయిగా ఆకాశంలోకి తీసుకపోతోంది.

ఈఆలోచనలగొడవలో అచ్చన్న తనతో వచ్చిన జనం సంగతే మరచిపోయాడు. తీరా చూసేసరికి వాళ్లెక్కడా అయిపు లేరు. వీళ్ళంతా ఏమయ్యారు చెప్మా అని అచ్చన్న విస్తుపోయాడు. భోజనాల వేళ కావచ్చినా ఒక్కడూ పికరు లేడు. వాళ్ళంతా తప్పత్రాగి ఊగుతూ తూలుతూ అక్కడకు హాజరయ్యేప్పటికి తొమ్మిదయింది. 'ఓరి మిమ్మల్ని తగలెట్ట, ఇక్కడ కూడ మీకు తాగుడేనా' అని నాలుగు తిట్టాలనుకున్నాడు. కాని అదేమీ లాభం లేదని పాపం ఆ మరుక్షణంలోనే అనుకోక తప్పింది కాదు. ఒకడు అచ్చన్న దగ్గఱకొచ్చి 'రాజులాంటి పిల్లని చేత్తున్నావురా. నల్లోడి కింక చోర్గమే' అన్నాడు. మరొకడు రామ్మూర్తిని తెగ పొగడి పారేశాడు. ఇదంతా చూస్తూంటే అచ్చన్నకి మతోయింది. 'ఎదవ చచ్చినోల్లు! ఈళ్ళని రమ్మనకపోయినాబాగుణ్ణు' అనుకున్నాడు.

పెళ్ళి పందిఱి ఏమంత అట్టహాసంగా లేదు. ఏవో నాలుగు వెదురు కఱ్ఱలు పాతి, అయిదారు కొబ్బరాకులు వాటిమీద పడేశారు. ఓ పిట్రోమాక్సు లైటు పందిఱిలో పెట్టారు. ముహూర్తం సరిగ్గా ఒంటిగంటన్నరకి. కాని అక్కడ ఒక్కడిదగ్గఱా గడియారం లేనేలేదు. తాగిన సోదరులు పీక మొయ్యా మెక్కారేమొ ఎక్కడ కాళీ ఉంటే అక్కడ చేరబడి పోయారు.

పెళ్లి ఆర్భాటమంతా పన్రెండుగంటల నుంచి ఆరంభమయింది. అయితే అప్పుడు పన్రెండంటే అయిందని చెప్పడానికేమీ ఆస్కారము లేదు. శాస్త్రిలుగారు గడియారంవైపు చూసేసరికి అది ఎక్కడో యుగయుగాలవెనుక ఆగిపోయినట్లుగా ఉంది. వెంటనే ఆయన ఆ కాలం తెలిపేబొమ్మకు జీవంపోసి, పెళ్ళికి వేళయినట్లుగా సూచించారు. పెళ్ళికొడుకును, పెళ్ళికూతుర్ని పీటల మీద కూర్చుండబెట్టారు. పెళ్ళికొడుకు పిల్ల ఎరుపుచూసి మురిసిపోయాడు. ఏమాత్రం వీలున్నా కళ్ళు ఆపిల్లమీదికేపోనిస్తూ ఎంతో సంబరపడుతున్నాడు. బుచ్చమ్మ కోడలి అందానికి అబ్బురపడిపోయింది.

అచ్చన్న తను తీసుకవచ్చిన మూక అంతా వట్టి దండుగమూకక్రింద నిర్ణయించుకోక తప్పింది కాదు. కట్నం వియ్యంకుడిచేత ముందుగానే చెల్లించుకోవాలంటే వాళ్ళ అండ ఎంతైనా అవసరమే! కాని వెధవలు ఎక్కడివాళ్లక్కడ మతుల్లేకుండా పడిపోయి ఉన్నారు. కొంతమంది పెళ్ళి ముందువచ్చి కూర్చున్నారుగాని, వాళ్ళేమి మాట్లాడాలో వాళ్ళకే తెలియదు. అయినా అచ్చన్న ధైర్యంచేసి అడిగెయ్యాలనుకున్నాడు.

ఒక్కసారి కంఠం సవరించుకొని, కొంచెం తటపటాయిస్తూనే, 'చాత్రులుగారూ...కట్నం నూటపదార్లూ చూపించమనండీ...ఆనక ఎటోయి ఎటొచ్చినా...' అన్నాడు అచ్చన్న. శాస్త్రిలుగారు, రామ్మూర్తివైపు ఈమాటకు సమాధానం చెప్పవయ్యాఅన్నట్టుచూశారు. రామ్మూర్తి కాళ్ళల్లో వణకు పుట్టింది. అయినా నిలద్రొక్కుకున్నాడు. అలా నిలద్రొక్కుకొని, అచ్చన్నకు దగ్గఱగావచ్చి, మెల్లగా 'ఒక్క నెల్లాళ్ళో నీచేతిలో పెడతా బావా. ఎక్కడా సర్దుబాటయిందికాదు. ఈ తప్పు నువ్వు కాయాలబావా...' అంటూప్రాధేయపడేసరికి, అచ్చన్న కుదేలయిపోయాడు. అతని మొగం వికృతంగా మారిపోయింది. 'ఏంటీ...సర్దుబాటుకాలే...మరా వేళ తల తాకట్టెట్టేనా ఊడబొడిచేత్తాన్నావుగా... ఈపాటిదానికే అంతమాటన్నావ్...చాల్ చాల్లే మరియాద...ఏయ్ లెండిరా పోదాం ఒరే లేరా...లే...పెళ్ళొద్దూ పెడాకులూ వద్దు ... లే... మరియాదత్తులంట, మరియాదత్తులు ... ఛీ ...'అనేసరికి పెళ్ళికొడుకు లేచిపోవాలేమోఅన్నట్టుగా లేవబోయాడు. ఇంతలో అతని మనసు కూర్చోమని బలవంతం చేసింది. ఇంతలో తండ్రి మళ్ళీ, 'లేవేరా' అని ఘర్జించాడు. అట్లా ఘర్జించి, 'ఇక్కడికి తీసుకొచ్చి ఇంత మరియాదచేత్తావనుకోలేదు. అక్కడేవిన్నాను నువ్విట్లాంటి మరియాదత్తుడవే నని' అన్నాడు. ఆవేళ చూపులకు వచ్చిన రామ్మూర్తి బావమరది, 'చాల్లేవయ్యా... కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళివ్వలేక పోయావుగానిమరియాదమాటెత్తుతున్నావు. మహామరియాద తెలిసినోడివి ఎట్లాగయితేం బయలుదేరావు కాని' అని అంటూంటే ఆవేళ అక్కడకు వచ్చిన ఆడకూతురు, 'ఇక్కడైదేసిపిండొంటలతో తినెల్లి, అక్కడ ఇంత కారం ముద్దపడేసిన నువ్వే చెప్పాలి మాకు మరియాద' అంది. ఇంతలో ఆ బావమరది మళ్ళీ అందుకొని, 'ఆ గబ్బిలాల కొంప మరియాదలకేం లేవే...'అన్నాడు. వెంటనే రామ్మూర్తి, భయంకరంగా 'ఏంటిరా ఎధవా పేలేవ్...నోర్ముయ్' అని సింహంలా వాడిమీదకురికి ఛెళ్ళున ఒక్కటిలాగి, 'ఇదిగో బంగారమ్మ నువ్వు ఆడదానివైయావే...' అంటూ ఆవేశంతో పళ్ళు పటపటా కొరికి, అచ్చన్న చేతులు పట్టుకొని అతిజాలిగా, 'ఇవి చేతులుకావు ... కాళ్ళు ... ఈ గండం ఇక నువ్వే గట్టెక్కించాలి. ఈ కుర్రకుంకల మాటలు నువ్వు పట్టించుకోకుబావా...' అన్నాడు ఏకబిగిని. అచ్చన్నకు — ఏమి జవాబు చెప్పాలో, ఇక అప్పుడు ఏమి మాట్లాడాలో తోచలేదు. అతని మనసు నిండా ఆ చెంపకాయే తిరుగుతూంది. 'రామ్మూర్తి ఎంత మంచివాడు. ఎంత మర్యాదస్తుడు' అని ఆ చెంపకాయ రామ్మూర్తిమీద అనేక రకములైన సద్భావాల్ని అచ్చన్న హృదయంలో మొలకెత్తించింది. ఈ దృశ్యం చూసిన బుచ్చెమ్మ ఇక తన మొగుడు సాగదియ్యకుండా ఉంటే అదే పదివేలని మదిలో పదివేల దేవుళ్ళకు మ్రొక్కుకుంది. ఇంతలో ఆ వూరి పెద్దలు, అచ్చన్నదగ్గఱకొచ్చి 'ఇచ్చేస్తానంటున్నాడుకదయ్యా ...ఇప్పుడిక్కడనుంచి వెళ్ళిపోతే ఏమొస్తుంది...అయిన ఖర్చుల దండుగతప్ప ఇంకేమీ రాదు. ఇంకెందుకొచ్చినగొడవ ...' అంటూవుంటే అచ్చన్న మాటామంతీ లేనివాడైపోయాడు. పాపం పూర్తిగా నిస్సహాయుడైపోయాడు. అప్పుడే రామ్మూర్తి బుచ్చమ్మదగ్గఱకుపోయి, 'నువ్వయినా చెప్పుఅప్పా'అంటూ బుచ్చమ్మచేతులు పట్టుకున్నాడు. బుచ్చమ్మకు ఏమి చెయ్యడానికీ తోచింది కాదు. కాని, 'ఆఁమావదగ్గఱ ఆడు వసూలు చేసుకోకుండా ఉంటాడేంటి' అంది. ఈమాటతో అంతా గొల్లున నవ్వారు. వెంటనే ఎవ్వరో, 'చాత్రులుగారూ ఇక మీరు కానివ్వండి' అని అరచి, 'ఊఁ వాయించండోయ్ బాజా భజంత్రీలు' అనేసరికి పెళ్ళినిమిషాలమీద 'మారామూడు...పెళ్ళికొడు.. కాయనే...'దగ్గరకుచేరిపోయింది. అచ్చన్న 'ఎఱ్ఱిమొగం ఏసుకొని' అట్లా నిలబడి పోయాడు. అచ్చన్న గుండెలో ఎవ్వరో కట్నం కట్నం అని అరుస్తూనే ఉన్నారు. కాని అది ఆ బాజాలమోతలో ఎవ్వరికి వినిపిస్తుంది!

శాస్త్రిలుగారు రామ్మూర్తిదగ్గఱ పుచ్చుకోవలసిన దేదో పుచ్చుకుంటూ 'ఆరి నీదుంప తెగా...నీవు మేధావివిరా. ఆ వెధవలకు త్రాగుడుపోసి మీ బావమరదిగాడికి ఒక్కటి వడ్డించి, నూటపదహార్లూ మా చక్కగా స్వంతం చేసుకున్నావురా ...' అంటూంటే, అప్పటివరకూ తను చేసిన ఘనకార్యానికి మనసులోనే అతీతమైన ఆనందాన్ననుభవిస్తూన్న రామ్మూర్తి తన గొప్పతనాన్ని గుర్తించిన శాస్త్రిలుగారిముందు ఎంతో హుందాగా నవ్వి, 'వుట్టెడు బుద్ధులూ పొట్టకొఱకేగదాండి' అనేసి, వియ్యంకుణ్ణి మర్యాద చేయడానికి వెళ్ళిపోయాడు. ★



ఎ. వి. ఎమ్. వారి "వదిన" చిత్రంలో పండరీబాయి.



కిశోర్ (రామారావు) కొండజాతి వాడు చండీరాణిని ప్రేమిస్తాడు.

(ఒక అభిప్రాయం)

సినిమాలలో కొత్తవారికి చాన్సులు దొరకటం మాత్రం ఒక అదృష్టమంటే, అసలు అదృష్టమున్నా, 'స్టార్' అన్నా విశ్వాసం లేనివారు సైతం ఒప్పుకొని తీరతారు.

నిజానికి ప్రస్తుతం మన ఫిల్ము క్షేత్రంలో కొత్తవారికి అవకాశాలు నిరాశాజనకంగానే వున్నాయి. నటుడికియుక్కా అంద చందాలూ, నటనానుభవం, సంస్కారం— వీటితో నిమిత్తమే లేకపోయింది.

"నీ ఎదురుగా అనకూడదు కానీ—సినిమా క్షేత్రంలో నీకు మాంచి భవిష్యత్తుందిరా," అని ధర్మవరాల్లో ఏ యువకుడితోనో అన్నామంటే వాడిహా మహా అవస్థలో పడిపోతాడు. అక్కడ తేమాలనో ఓ, అద్దం పడివుంటే దొంగతనంగా ఓసారి తొంగి చూసుకొని సంతృప్తుడై చెవులు నిక్కబొడుచుకుంటాడు — మనం ఇంకో నిమిషానా చెప్పుతామా అని.

"తమాషాకు కోరురా చెప్పటం. మన హీరోలకు ఏమాత్రమూ తీసిపోవులే నీ విషయంలోనూ. ఫలాని మన 'హీరో' నీ ముందు దేనికి పనికివస్తాడురా. అంచేత ఇంత చదువూ చదివి ఏ గుమాస్తాగిరో చేలాయించేదానికి బదులూ ఏ మద్రాసో వెళ్ళి ఫిల్ములలో ట్రై చేయరా నా తండ్రీ—, కాలుమీద కాలేసుకొని తినొచ్చు," అనమాత్రం అంటే చాలు. ఇహ ఆరాత్రే దొంగతనంగా, ఇంట్లో చేతికి దొరికినంత డబ్బు కాజేసి, వెంటనే రైలెక్కి మద్రాసు వచ్చిపడేస్థితిలో వున్నారు యువకులెంతోమంది.

ఇక్కడికి కొచ్చాక వాళ్ళుపడే అవస్థలూ, అగచాట్లూ అందరూ ఎరిగినవే. ప్రొడ్యూసర్లు, డైరెక్టర్ల ఇళ్ళచుట్టూ కాళ్ళరిగేవరకూ తిరగటమూ, [illegible] సహ్యం కలిగించనీ వుండా [illegible] అద్దెపెట్టటమూ, ఆ రాత్రి [illegible]

★ కొత్తవాళ్లకి సినిమా అవకాశాలు ★

పాండీబజారులోనో ఎవడో ఒక 'ఎక్స్ట్రాల సప్లయర్' దాపురించి, అతగాడిని ఏదో పెద్ద నటుడ్ని చేసిపారేస్తానని ఆకాశమంతెత్తుకు ఆశలు పుట్టించి ఉన్న డబ్బునంతా మెల్లమెల్లగా కాజేయటమూ, చివరికి ఊరికి మరలిపోవటానికి చేతిలో చిల్లిగవ్వలేక ఏ రిస్ట్‌వాచినో మరి దేనినో అమ్మేసి బండెక్కటమూ ఇదంతా అందరికీ విదితమే.

ఘాటైన సిఫారస్ లేనిదే నేటి చిత్రసీమలో కొత్తమొహాలకి ఏ మాత్రమూ అవకాశం లేదు. లేదా సగం అగిపోయిన ఏ చెత్త చిత్రానికో భాగస్వామిగా చేరి ఆ చిత్రాన్ని లేవనెత్తే స్థితిలోనైనా వుండాలి. వీటన్నిటికీ మించి ఏ తారామణికో కనీసం దూరపు బంధువైవుండాలి. ఈ యోగ్యతలు లేనిదే ఎంత ప్రయత్నించినా ఫలితం శూన్యం.

కానీ కొత్తవారికి వెంటనే అవకాశాలు దొరకకపోవటానికి కొన్ని ప్రత్యేక కారణాలు లేకపోలేదు.

కొంతమంది డైరెక్టర్లు ఒక పాత్రను నటుడికి బాగా అర్థమయ్యేలాగున విపులీకరించి చెప్పగలరే కానీ, వాళ్లు నటించి చూపలేరు. అంచేత ప్రముఖ దర్శకులు కూడా పాత నటులనే ఎక్కువగా బుక్ చేసుకొంటూంటారు.

ఒకవేళ ఎవడికో దశ బాగా వుండి ఓ మంచి వేషానికి బుక్ అయినా, తర్వాత ఏ డిస్ట్రిబ్యూటర్ మాట వినో, ఆ నటుడ్ని తొలగించి అతనిస్థానే స్టార్ వేల్యూ గల పాత నటుడ్ని తీసుకొంటూంటారు ఎంతోమంది ప్రొడ్యూసర్లు.

కొద్ది పారితోషికానికే నటించటానికి ఒప్పుకుంటారన్న ఉద్దేశ్యంతో - కొత్తవాళ్ళకు అవకాశం కలించిన ప్రొడ్యూసర్లు కొంతమంది లేకపోలేదు. ఖర్మవశాత్తూ వాళ్ళు తీసిన చిత్రం ఫెయిల్ అయిందో - ఇహ ఆ నటుడి గతి కూడా అంతే. చచ్చినా అతని కింక రెండో బుకింగు వుండదు.

పోనీ మొట్టమొదట చిన్న చిన్న వేషాలు వేస్తూవస్తే క్రమేణా హీరో ఛాన్సులు దొరుకుతాయేమో ననుకుంటే, కాలంతో పాటు డైరెక్టర్ల మనస్తత్వం కూడా మారిపోయింది. ఆదిలోనే మంచి వేషాలు లభిస్తే తప్ప, చిన్న చిన్న వేషాలు వేస్తూ పైకి రావటం కల్ల. ఇహ ఆ నటుడు జీవితాంతం వరకూ చిన్న చిన్న వేషాలతో మునిగి తేలుతూండాల్సిందే.

మొదట్లో 'గజానన జాగీర్దార్, ఫిల్ము ఫీల్డులో ఏ శాఖకీ పనికిరాడని' ప్రసిద్ధ డైరెక్టర్ శాంతారాం అన్నాడట. అలాటి జాగీర్దారుకే శాంతారాం తీసిన "పడోసీ" చిత్రంలో ప్రముఖ పాత్ర లభించి ఇప్పుడొక కేరక్టర్ ఆక్టరై కూర్చున్నాడు!

కొత్తవాళ్ళను బుక్ చేసుకొంటే, డబ్బు రాదనే భీతి ఇప్పటికీ ప్రొడ్యూసర్లలో పాతుకొని పోయివుంది.

నిజమాలోచిస్తే ఇప్పుడు గొప్ప నటులుగా పేరొంది మంచి డిమాండులో వున్న నటులంతా ఒకప్పుడు కొత్తవారే; ఆదిలో, ఏ కొమ్ములు తిరిగిన డైరెక్టర్ నోటనో ఎందుకూ పనికిరాడనిఅనిపించుకున్న వారే.

స్టార్ వాల్యూగల నటీనటులుంటేనే చిత్రాలు విజయమవుతాయన్న దురభిప్రాయాన్ని ప్రేమ, చిన్నమ్మకథ, ఆదర్శంలాంటి చిత్రాలు మార్చివేశాయి. ప్రొడ్యూసర్లు ఇది గుర్తించాలి.

పాతనటులతో ప్రేక్షకులు విసుగెత్తిపోయారన్న విషయాన్ని ఇప్పటికైనా గమనించాలి.

స్టార్ వాల్యూవున్న నటీనటులు అనేక చిత్రాలలో నటిస్తూండడం వల్ల, నిర్ణీతమైన 'కాల్ షీట్' వేళకురాక ఎన్నో ఇబ్బందులు కల్గిస్తూండటం ప్రొడ్యూసర్లకు తెలిసిన విషయమే.

కనుక ప్రొడ్యూసర్లు ఇప్పటికైనా మేల్కొవాలి. నేటి మన నటులకు ఏమాత్రమూ తీసిపోని - మంచి నటనానుభవం, విద్య, ఫేస్‌కట్ గల అందమైన యువతీ యువకులు ఎంతోమందివున్నారు. కొత్తవాళ్ళకోసం వెదికి వీలయినంత ఎక్కువ మందికి అవకాశాలు కల్గించాలి.

కేవలం స్టిల్సు చూసి సెలక్టు చేస్తే లాభంలేదు. మేకప్ టెస్ట్ చేసి, ట్రయల్ షూటింగ్ జరిపించాలి. అప్పటికి గానీ ప్రొడ్యూసర్లు కొత్తనటుల విషయంలో ఏదో ఒక నిర్ణయానికి రావడదు.



ఏ. వి. ఎమ్. వారి "వదిన" (తెలుగు) చిత్రంలో నాగేశ్వరరావు



[illegible]
అరుణా వారి "గుమాస్తా" లో జయమ్మ, నాగయ్య [illegible]

☆ సినీరమా ☆

శ్రీ వి. మల్లికార్జునరావు

[illegible]

ప్రశ్నలు..సమాధానాలు

టి. రాజన్న—భీమవరం.

"స్నేహితులు కనబడినపుడు నవ్వు తుంటా రెందుకండి"?

—ఒక మనిషి తన పరిచితుణ్ణి చూచి నప్పుడు నవ్వో, చిరాకో, కోపమో ఏదో రకమైన భావం ముఖంలోకి రాకతప్పదు. ముఖంలోకి నవ్వువస్తే ఆ పరిచితుడు తనకు ఇష్టుడన్న మాట. నవ్వు స్నేహసూచన.

* * *

వై. యల్. నారాయణ—విజయవాడ.

"బ్రతుకు తెరువు" లో శ్రీరంజనికి సావిత్రి బట్టలు కొనిఇస్తే ఇది నాగేశ్వర రావు విని, తనపేరు చెప్పిందేమో నని అంత భయపడ్డాడు. పేరు మార్చుకున్న తర్వాత, అతడు భయపడవలసిన అగత్య మేమి? డైరక్షను బాగున్నదని వ్రాసినారు ఇటువంటి చిన్నతప్పులు గుర్తించలేదు, ఎందుచేత?

—ఆ కంగారులో అతడు తను పేరు మార్చుకున్న సంగతికూడా మరచిపోయి మరీ కంగారు పడ్డాడు.

* * *

ఏలూరి వీరరాఘవరావ్—నిడదవోలు.

రాజా ప్రొడక్షన్ వారి "పుట్టిల్లు" దెబ్బ తింటానికి గల కారణం ఏమిటండీ? అందు లోని లోపాలేమిటి?

—ఆ చిత్రం చూసే అవకాశం మద్రాసులోని పత్రికల వారి కింకా కలగ లేదు.

* * *

జేగా రాధాకృష్ణయ్య నాయుడు—నెల్లూరు.

ప్రస్తుతం భారతీయ నారీమణులు దేవాలయమునకు వెళ్ళుసమయమున సువాసన నూనెలు, పౌడరు, మంచి దుస్తులు మంచి ఆభరణములు ధరించి క్రాఫ్ దువ్వుకుని వెళ్లుతుంటారు. భగవంతుడు అవి అన్నియు కోరువాడేమిటి? వారలాగు వెళ్ళడానికి కారణం తెల్పుతారా?



జంపన—నంద ప్రొడక్షన్సు వారి "మేనరికం"లో మాస్టర లక్ష్మణ్, కైకరం మునసబు.

—పండుగరోజుల్లో భగవంతుడే టాయ్‌లెట్ చేసుకుంటుండగా తేనిది, మానవ మాత్రులమాట 'యేరే జెప్పాలా గారా?'

*   *   *

ఎస్. జగన్నాధరావు—ఏలూరు.

ఎవరో కాని "దేశదిమ్మరి," అను చిత్రం ప్రారంభించిరి, అందులో కనకం కూడ వున్నది అని ప్రకటించారు. వాటి విషయము యేమేనా మీకు తెలుసునా?

—ఆ "దేశద్రిమ్మరి" జాడ ఇంతవరకూ తెలియలేదు.

*   *   *

పి. రంగస్వామి—గుడివాడ.

ఉత్తమ విమర్శన కుండవలసిన లక్షణములు ఏమిటండి?

—నిజాయితీ.

*   *   *

కాసుఖేల కామేశ్వరరావు—మద్రాసు.

మీరు ప్రతివారము, "జంతుకోటిలో మానవలక్షణములు" అనే శీర్షికను ప్రచురించుతున్నారు. అది చూచినపుడల్లా, "మానవకోటిలో జంతులక్షణము" లేవి లేవా? అని సంశయము కలుగుతుంది. అట్టి శీర్షికను కూడా మీ రెందుకు ప్రారంభించకూడదు?

—మానవుడు జంతువులనుండి పరిణామం చెందినవాడే నని పరిణామ వాదం తెలుపుతున్నది. అందుచేత అతనిలో జంతు లక్షణాలు ఎలాగూ ఉంటాయి. కాని జంతువులు మానవుని నుంచి పరిణమించినవి కావు, కనుక వాటిలో మానవలక్షణాలుంటే అది విచిత్రంగా ఎంచదగిన విశేషమే. అటువంటి విచిత్ర విశేషాలనే ఆ శీర్షికలో ప్రచురిస్తున్నాం.

*   *   *

ఉపేంద్రం వేణుగోపాల్—అనంతపురం.

పురాతన శిల్పాలు సుందరంగా ఉండును. కానీ పురాతన శాసనాలలోని అక్షరములు కనుగొనుటకు వీలులేనట్లుగా యుండును కారణ మేమి?

—ఇప్పటి భాషల్లోని అక్షరాలు ఇప్పటి రూపంలోకి రావటానికి ముందు అనేకమైన మార్పులుపొందాయి. ఒక్కొక్క కాలంలో లిపులు ఒక్కొక్క మాదిరిగా ఉండేవి కనుక గుర్తుపట్టడం కష్టం.

బెర్నార్డ్‌షా క్రొత్త భాష కనిపెట్టి దాని వ్యాప్తికై తన ఆస్తిని ధారపోశాడట కదా దానినిగురించి వివరాలు తెలియజేస్తారా?

—బెర్నార్డ్‌షా కొత్తభాష కనిపెట్టలేదు. ఇంగ్లీషుభాషలోనే లోపా లున్నాయనీ, అందుకని ఆ భాషను సంస్కరించాలనీ ఆయన తలపెట్టాడు.

*   *   *

పి. లక్ష్మి—విశాఖపట్నం.

"పరదేశి"లో అంజలీదేవి నటననుగూర్చి మీ అభిప్రాయమేమి?

—అంజలీదేవి ఉత్తమనటి. ఒక్కొక్క చిత్రంతోటే ఆమె నటనస్థాయికూడా పెరుగుతున్నది. కాని "పరదేశి"లో ఆమె నటన బాగున్నా చిత్రంలోని లోపాల మధ్య అది రాణించలేదు.

*   *   *

దేవకిరామ సుబ్బారావు—వినుకొండ.

అవరిండియావారి నాయిల్లుకు డైరెక్షను చేసిన నాగయ్యగారు ఆ పిక్చరు తప్ప యింకే పిక్చరు డైరెక్టుచేయలేదని నేను. కాదు కొన్ని పిక్చర్సుకుడైరెక్టుచేశాడని మా మురళి వాదించుకుంటున్నాము ఏది నిజమో విశదపరుస్తారా?

—ఇదివరలో బాగా ధన మార్జించిన "త్యాగయ్య" చిత్రం దర్శకుడు నాగయ్యగారే!

*   *   *

వై. వి. సుబ్బారావు—కాకినాడ.

25-2-53 వారపత్రికలో, "బ్రతుకు తెరువు" చిత్రాన్ని సమీక్షిస్తూ మోహనరావు బ్రతుకుతెరువుకోసం ఒక చిన్న అబద్ధమాడి ఊరుకున్నా డని మీరు వ్రాశారు. కాని మీరు ఊహించినట్లు అది చిన్న అబద్ధం కాదు. దానిమీదే మొత్తం కథ ఆధారపడివున్నది. నిజంగా తనకు వివాహమైనదని ముందరే చెప్పిననాడు అతనికి ఉద్యోగమూ లేదు—కథ యింతవరకు రానూ రాదు.

—కథలో మోహనరావు ఆడిన అబద్ధం ప్రమాదరహితమైంది కనుకనే అందులోంచి కామెడీ తప్ప ట్రాజిడీ రాలేదు. అటువంటి అబద్ధాల్లోంచి వినోదకరమైన కట్టుకథలు వస్తాయి తప్ప జీవితప్రతిబింబం రాదు. ఆ దృష్టితో చేసిన విమర్శ కాని, ఆ అబద్ధం ఆ కథకు ఆధారం కాదని కాదు.

*   *   *

కె. బాబు, కర్నూలు.

ఆంధ్రపత్రిక చదువుతే గల లాభాలు ఏమిటి?

—మీకా, మాకా?

*   *   *

ఎస్. ఎమ్. అధిపతి—కర్నూలు.

ప్రపంచంలో అధికంగా సుందరులుకల దేశమేదో తెలియచేస్తారా?

—స్వీడన్, నార్వే, ఫిన్లెండు దేశాలు అందగత్తెలకు, అందగాళ్ళకు కూడా ప్రసిద్ధి.

*   *   *

టెక్నికలరుయందు ఎన్ని రకాలుగా చిత్రాలు తీయవచ్చును? గేవాకలరంటే ఏమిటి? తక్కువ ఖరీదయే పద్ధతి యేది?

—ఒక రకమైన 'ప్రాసెస్'లో తయారయ్యే చిత్రాలకే టెక్నికలర్ అని పేరుంటుంది. ఇతర 'ప్రాసెస్'లలో తయారయ్యే చిత్రాలకు వేరే పేర్లుంటాయి. బెల్జియంలో కనిపెట్టబడిన ప్రాసెస్‌ను గేవా కలర్ అంటారు. జర్మనీలో ఆగ్ఫా కలర్, ఇటలీలో ఫెరానియాకలర్, రష్యాలో రూసో కలర్ ఉన్నాయి. అమెరికాలో ఎక్కువగా టెక్నికలర్ వాడతారు. అది గాక కొన్ని అమెరికన్ సినిమా కంపెనీలు వేరు వేరు కలర్ ప్రాసెస్‌లు కూడా ఉపయోగిస్తాయి. (వార్నర్ కలర్, సినీ కలర్, సూపర్ సినీ కలర్, ట్రూ కలర్ మొదలైనవి.) అన్నిటికంటే టెక్నికలర్ ఖరీదెక్కువట.

★



సేనాపతి ప్రచండ్—విలన్. భరణీ వారి చండిరాణి లో రంగారావు.

'సినెరమా'

(47-పేజీ తరువాయి)

సినిమాకీ, 'సినెరమా'కీ గల వ్యత్యాసం స్థూలంగా ఇది: సినిమా చూస్తున్నప్పుడు అది మనకంటికి కదులుతూన్న ఫొటోగ్రాఫుల మాదిరిగానే కనిపిస్తుంది. తెరమీద కనిపించే ప్రతివస్తువుయొక్క పొడవు, వెడల్పులుమాత్రమే స్ఫురిస్తాయి. నిజానికి సృష్టిలో ప్రతివస్తువుకీ ఘనపరిమాణముంటుంది. ఘనపరిమాణమంటే పొడవు, వెడల్పు ఎత్తుల లబ్ధము. సినిమా తెరమీద కనిపించే బొమ్మల్లో పొడవు, వెడల్పు ఉండి మూడవ కొలత లోపిస్తుంది. ఈలోపం లోపంగా నిల్చిఉన్నంతవరకూ, ప్రేక్షకుడు తెరమీద జరిగే సంఘటనతో తాదాత్మ్యం పొందలేడు. "సినెరమా" చిత్రంలో యీలోపం తొలగిపోయి, తెరమీదకదులుతున్నది బొమ్మ కాదనీ, యదార్థ సంఘటనలనే తానూసన్నిహితంగా, సాక్షీభూతంగా గమనిస్తున్నాననే అనుభూతి ప్రేక్షకుడి మనస్సులో కలుగుతుంది.

'సినెరమా' నిర్మాణానికి ప్రాతిపదిక ఇది: కంటిలోని కటకము మనకను సమాంతరతలంలో (*Horizontal Plane*) 180°, నిలువుతలంలో 90° లోపు ఉండే ప్రతివస్తువును చూడగలుగుతుంది. మానవుడు సృష్టించిన ఏకటకమూ యింత పరిధిలో పనిచేయలేదు. కాని, "సినెరమా" పద్ధతిలో ప్రసారితమైన చిత్రం సమాంతరతలంలో 146°, నిలువుతలంలో 55° లోపు ఉండటంచేత కంటిఎదుట కనిపిస్తున్న దృశ్యం యథార్థపరిస్థితులలో ఏర్పడేదృశ్యానికి అతిసన్నిహితంగా ఉంటుంది. ఈ ఆయంత్రో 27 మిల్లిమీటర్ల కటకాలు మూటితో ఒకదానికొకటి 48° కోణము యేర్పట్లుగా ఒక కెమెరాను తయారుచేసి ఆ కెమెరాతో "సినెరమా" చిత్రాన్ని తీస్తారు. ఈ మూడు కటకాలలో ఒక్కొక్కటి ఒకే దృశ్యంలోని మూడు విడి సమభాగాలను మూడు విడివిడి ఫిలిం నెగటివులమీద (మామూలు 35 మిల్లిమీటర్లు) ఫొటోగ్రాఫు చేస్తాయి. ఈ కటకాలు మూడూకూడా ప్రత్యేకమైన దిమ్మమీద అమర్చిఉంటాయి. ఈ మూడు నెగటివుల మీద ఒకేదృశ్యంయొక్క మూడుసమభాగాలు ఒకేసమయంలో చిత్రీకరించటానికి వీలుగా ఒక రొటేటింగ్ షట్టరు తిరుగుతూ ఉంటుంది. మామూలు సినిమాలలో ఉపయోగించే 35 మిల్లిమీటర్ల ఫిలిమునే ఇందులో ఉపయోగిస్తారు. కాని, మామూలుగా నాలుగు ఫ్రేముల్లో వచ్చే చిత్రం యీపద్ధతిలో 6 ఫ్రేముల్లో ఇముడుతుంది. అందుచేత మామూలు ఫిలింకంటె 'సినెరమా' కెమెరా ఒక్కొక్క లెన్సుద్వారా ఒకటిన్నర రెట్లు ఎక్కువ ఫిలిమును ఉపయోగించవలసి ఉంటుంది. మూడు లెన్సులుంటాయి కనుక మామూలు సినిమా ఫిలింకంటె 'సినెరమా' ఫిల్ము మొత్తం $4\frac{1}{2}$ రెట్లు అధికంగా పొడవు ఉంటుంది.

"సినెరమా" ప్రొజక్షనుకూడా వ్యత్యాసంగా ఉంటుంది. మూడు ఫిలుములనూ మూడు వేరువేరుచోట్ల ఉంచిన ప్రొజక్టరులద్వారా 51' వెడల్పు, 25' ఎత్తూ కలిగి మధ్యలో వంపు తిరిగివున్న తెరమీదికి ప్రసారం చేయాలి. తెరవంపు తిరిగి ఉన్నందువల్ల బొమ్మలు అడ్డదిడ్డంగా కన్పిస్తాయనుకోవచ్చు; కాని, యీ తెర ప్రత్యేకమైన పద్ధతిని తయారు చేయటంవల్ల ఆ ప్రమాదం ఉండదు. ఈ తెర ఏకఖండంగా కత్తిరించి పెట్టింది కాక 1100 సన్నని పేలికలు ఒకదాని అంచుమీద మరయొకటి ఆనేట్లుగా కుట్టి తయారుచేస్తారు. వంపుగా తిరిగిఉన్న తెరమీద బొమ్మవల్లూరు పడ్డప్పుడు ఆ తెర వల్లురులో కొంతభాగాన్ని తిరగకొట్టి బొమ్మ చూచేవాడికి అందులో ఏవో లేనిపోని వంకరటింకరలు ఉన్నట్లు కన్పింపచేస్తుంది. నిడుపాటి పేలికలలో ప్రత్యేక పద్ధతిలో తయారైన ఈ "సినెరమా" తెర అలాచేయదు. ప్రతి ఒక నిలువు పేలికా తిరగకొట్టే కాంతిని సూటిగా ప్రేక్షకుడివైపు పోనియకుండా ప్రక్కనే ఉన్న రెండో పేలిక అడ్డుపడుతుంది. తద్వారా

మ్మలు అస్తవ్యస్తంగా కనపడే ప్రమాదం పూర్తిగా తొలగిపోతుంది.

మూడు ప్రాజక్టరులనుండి మూడుబొమ్మలనూ ఒకే తెరమీదికి ప్రసరింపచేసినప్పుడు బొమ్మ బొమ్మకీ మధ్య అంచులు కన్పించడం తప్పనిసరి. అలా అంచులు కన్పించనిస్తే విడివిడి బొమ్మలని సులభంగా తెలిసిపోతుంది. అలా కన్పించకుండా చేయటంకోసం ఎన్నో పరిశోధనలు జరిపి చివరకు "గిగొలస్" పద్ధతిని నిపుణులు కనిపెట్టారు. ప్రతి ప్రాజక్టరులోనూ ఫిలిం ప్రయాణించే ఆ బాట ప్రక్కగా బొమ్మల అంచుల వెంబడే దువ్వెన పళ్ళమాదిరిగా ఉన్న ని పళ్ళుగల సాధనమొకటి పైకీ కిందికీ అతివేగంగా తిరిగే ఏర్పాట్లుచేశారు. ఈ దువ్వెన కదుల్తూన్నంత మేరా తెరమీద పడినబొమ్మలో ఆ అంచు కన్పించకుండా పోతుంది.

"సినెరమ" పద్ధతిలో శబ్దగ్రహణం జరిగినప్పుడు వివిధ శబ్దాల స్థాయిల ద్వారా దగ్గర దూరాలను నిరూపించడం సులభసాధ్యమైంది. ఒక మోటారుబోటు తెరపై కన్పిస్తుం దనుకుందాం. ఆబోటు యీవైపు నించి, ఆవైపుకు పోతున్నప్పుడు దాని కదలికనుబట్టి అది చేసే శబ్దం మనకు వినిపించాలి కదా! ఇప్పటి సినిమాలో అయితే ఎంతో ప్రయాసమీద కానీ ఆ మోటారు బోటు చేసే శబ్దంలోని హెచ్చు తగ్గులను రికార్డు చేయటం జరగదు. "సినెరమ" పద్ధతిలో ఇది అప్రయత్నంగానే సమకూడుతుంది. ఈ పద్ధతిలో ఐదు మైక్రోఫోనులును సెట్టుమీద వేరు వేరు చోట్లపెట్టి, వాటిద్వారా ఎక్కడి కెక్కడ కావలసిన శబ్దాలను రికార్డు చేస్తారు. ప్రతి మైక్రోఫోను రికార్డిస్టుకి వినిపించే యంత్రానికి ఆయా శబ్దాలను అందచేస్తుంది. అతడు వాటిని విడివిడిగా రికార్డు చేస్తాడు. సినిమా థియేటర్లలోకూడా మళ్లీ ఐదుస్పీకర్లద్వారా ఆయాశబ్దాలను తిరిగి వినిపింప చేస్తారు. ఈ ఐదుస్పీకర్లూ థియేటరులో తెరవెనుక కొన్నీ, హాలు గోడలమీద కొన్నీగా అమరుస్తారు. ఫిలిం తీసినప్పుడు ఆయా మైక్రోఫోనులు ఏయే స్థానాలలోని శబ్దాలను రికార్డుచేశాయో ఆయాస్థాల కనుగుణంగా ఎక్కడి థియేటరులో ఆయాశబ్దాలు వేరు వేరు స్పీకర్లద్వారా వినిపిస్తాయి.



ప్రసాద్ ఆర్ట్ ప్రొడక్షన్సు వారి "కన్న కడుపు"లో కుమారి.

ఛాయాగ్రహణ, శబ్దగ్రహణాలు ఈరీతిని జరిగి ఆ చిత్రంపైన వివరించబడిన పద్ధతిని థియేటరులో ప్రాజక్టు చేసినప్పుడు, ప్రేక్షకుడు తాను చూసే చిత్రం తనకు సంబంధించని 'మాయ'గా భావించక చిత్రంలో కనిపించే వ్యక్తులలో తాను ఒకడైనటు నిరూపించుకొని ఆయా అనుభవాలకీ, ఆయా ఆవేశాలకీ అవలీలగా అనుకంపించ గలడు. నేటి సినిమాలను నాటకరంగంతో పోల్చి చూసేటప్పుడు, సినిమా చూస్తున్న ప్రేక్షకుడు తాను చూస్తున్నది జీవంలేని నీడలు మాత్రమేనన్న జ్ఞానం కలిగియున్న కారణంచేత పూర్తి రసానుభూతిని పొందలేక పోతాడని, నాటక రంగాన్ని చూస్తున్న ప్రేక్షకుడైతే తనయెదుట మెదిలే పాత్రలు సజీవమైనవని గుర్తించి పూర్తి రసానుభూతిని పొందకలడని విమర్శకులంటూ ఉంటారు. ఈ దృష్టితో నాటకరంగంతో పోల్చినప్పుడు సినిమారంగంలో కనిపించే ఆ పెద్దలోపం "సినెరమ"వల్ల పూర్తిగా తొలగిపోవటమే కాక, "సినెరమ" చూచే ప్రతి ప్రేక్షకుడూ రంగస్థలం మీదిపాత్రలలో వొకడుగ ఊహించుకుంటాడు. ఇది అపూర్వమైనవిశేషం. ఇంతటి ఉత్తమ ప్రయోజనంగల "సినెరమ"వంటిసాధనం

నిజానికి వ్యయప్రయాసలతో కూడుకొన్నదే అయినప్పటికీ అనతికాలంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించి తీరుతుందనడంలో సందేహం లేదు. ★

సినిమా వార్తలు

కిందటి నెలఆఖరులో "ఝాన్సీకీరాణి" చిత్రనిర్మాత సొహరాబ్ మోడీ, ఆయన భార్య మెహతాబ్ మద్రాసు వచ్చారు. వారికి అశోక్ టాకీస్‌లో న్యూ ఎల్ఫిన్‌స్టన్, అశోక్ థియేటర్ల యజమానులు సన్మానం చేశారు. సన్మానానికి సమాధానంచెబుతూ భారత చరిత్రలోని సువర్ణాధ్యాయాలను తెరపై కెక్కించటం తన ఆశయమనీ, ఇది వరకువలెనే ముందుకూడా చారిత్రిక చిత్రాలు తీయాలని అభిలషిస్తున్నాననీ సొహరాబ్ మోడీ అన్నారు. "చారిత్రిక చిత్రాలు నిర్మించటం మిగతా చిత్రాలకంటె కష్టం. రొమాన్సు, పాటలు లేకుండా, చరిత్రను యథాతథంగా పాటిస్తేనే అది చారిత్రిక చిత్రం అవుతుంది," అని ఆయన అన్నారు. దక్షిణ భారత ఫిలిం వాణిజ్య మండలి అధ్యక్షులు ఎ. రామయ్యగారు మాట్లాడుతూ, భారత ఫిలింపరిశ్రమలో సొహరాబ్ మోడీగారికి ఒక ప్రత్యేకస్థానం ఉందనీ, ఆయన తీసిన "ఝాన్సీకిరాణి" అంతర్జాతీయ ప్రశంస లందుకోదగిన చిత్రమనీ అన్నారు.

* * *

డైరెక్టరు, సినిమటోగ్రాఫర్ అయిన శ్రీ కె. రామనాథ్ గారిని అఖిలభారత సినీ టెక్నిషియన్ల సంఘంవారు ఈ ఏడాది తమ అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. అధ్యక్షపదవికి నితీన్‌బోస్, బి. ఎమ్. తాతా, దేవకీ బోస్, రజనీకాంత్ పాండ్యాగార్ల పేర్లు కూడా సూచించబడినవి కాని రామనాథ్ గారిని పైసంఘం తాలూకు స్థాయీసంఘంవారు ఎన్నుకున్నారు. స్థాయీసంఘంలో రామనాథ్, ప్రసాద్, ఎ. కృష్ణన్, ప్రతిమా దాస్‌గుప్త, దేవకీబోస్, ఎన్. కృష్ణస్వామి మున్నగు పన్నెండుగురు సభ్యులున్నారు.

అ. భా. సినీ టెక్నిషియన్ల సంఘపు ద్వితీయ సమావేశం వచ్చే ఏప్రిల్‌లో జరుగుతుంది. స్థలం ఇంకా నిర్ణయం కాలేదు.

* * *

అజంతావారి "వయారిభామ" చిత్రం మరికొద్ది షూటింగ్‌తో పూర్తి అవుతుందని తెలుస్తోంది.

* * *

జెమినీవారు ఇదివరకు "మిస్ మాలిని" అనే పేరుతో తీసిన తమిళ చిత్రం ఆధారంగా "మిస్టర్ సంపత్" అనే హిందీ చిత్రం తీశారు. ఇది గత మాసం 27న మద్రాసు వెలింగ్టన్‌లో విడుదల అయింది. ఆంధ్రలోకూడా కొన్ని కేంద్రాల్లో విడుదల అవుతున్నది. ఈ చిత్రం గత గురువారం జెమినీస్టూడియోలో పత్రికలవారికి చూపబడింది.

* * *

చాలకాలంగా ఆగిపోయిన "పాలేరు" చిత్రం ఇప్పుడు టి. కె. ప్రొడక్షన్సు, శోభనాచల పిక్చర్సు సంయుక్తనిర్వహణకింద నిర్మించబడుతున్నదని తెలుస్తున్నది. త్వరలో పూర్తి చేయాలని నిర్మాతలు భావిస్తున్నారట. సదాశివబ్రహ్మంగారు సంభాషణలు రాస్తున్నారట. కమేరామన్ కొట్నీస్ దర్శకుడట. గోవిందరాజుల, జగ్గయ్య, రమణారెడ్డి, వంగర, నల్ల రామ్మూర్తి, కోడూరి అచ్చయ్య, కృష్ణవేణి, జానకి, ఛాయాదేవి, కనకం మున్నగు వారు నటిస్తున్నారు. ★

★ గోడమీద బొమ్మ ★

...వ పేజీ తరువాయి)

. రామం ఏమిటదని అడక్క
గో కాస్త చిన్నబుచ్చుకున్నా
“పోనీ నువ్వు చెప్పు బావా!
ఓషన్ ఏమిటో?” అని ప్రశ్నిం

కొంతసేపటికి కాని జవాబివ్వ
మీ లేదు.”

నివన్నాక ఆ మాత్రం వుండ
వా?”

మం నిట్టూర్చి మెల్లగా అన్నాడు.
వుందనుకుంటే అది యిదే—”
ంటో ఆ యిది?”

భద్రం బావ నేను సఖ్యంగా
మే”

టావు ఫక్కుమన్నాడు. “అది
నే వుంది!”

లేదు బావా లేదు. ఎదురుగా నిల్చుం
మండిపడి పోతాడు కదా. నేనేం
? ఈ పిరికివాడు...”

న్నాడోయ్?”

వెకిలిగా నవ్వి, “ఎవ్వరూ అన
వా! నన్నే నేనే అనుకుం
ు.”

విడిపోయే త్రోవ వచ్చింది.
వు మళ్లీ పోతూ బిగ్గరగా “అంతా
నే వుందోయి! వియ్యమైనా
ునా సరికి సరైన చేతులతో చేస్తే
ంది! నువ్వు డబ్బుగలవాడివని
నిటారుగా నిల్చుంటావో అనాడే
బావ సఖుడే కాదు ఆత్మస్వరూపు
ు. బాగా ఆలోచించు. మరివస్తాను”

తన లైఫ్‌లోని ఏంబిషన్ విష
ఎత్తకుండానే వెళ్ళిపోయాడు.
మం యింటికి వెళ్ళేసరికి సుందరమ్మ
ర్యమీద విరుచుకు పడుతోంది. ఆ
తను వీధిగుమ్మం ఎక్కకుండానే
ుతున్నాయి.

వ్వు గట్టిగా చెప్తే ఎవడు కాదం
? కళ్లతో అంతా చూస్తున్నాడుగా?
కాలం? నూటముప్పయి రూపాయిలు
తెస్తే సరిపోయిందా?”

మం వెనకకు తిరిగి వెళ్ళిపోదామని
డుగులు వెనక్కి వేశాడు. మళ్ళీ
మెట్లెక్కి తలుపు త్రోసుకుని
గా మేడమీదకు వెళ్లిపోయినాడు.
మార్చుకుండానే కొంతసేపు కుర్చీ
చతికిలబడ్డాడు.

బావ అక్క రమ్మంటూంది అని
మోసుకువచ్చాడు. మెట్లు దిగుతూ
గా కూర్చున్న అత్తగారిని క్రీగంట
చూచాడు. ఆ ముద్దుముఖం ముడిచిపెట్టుకుని ధుమధుమ లాడుతోంది. దానికితోడు పొరుగు ముసలమ్మతో అంటున్న మాటలు కూడ వినిపించినాయి. ఆ ముసలమ్మ కూర్చుని తల ఆడిస్తూ అభిప్రాయాల్ని కూడ కురిపిస్తోంది. సుందరమ్మ అంటోంది:

తెల్లారిలేచి ఎంతమంది వచ్చేవారు! ఎందరు మా సీతమ్మతల్లి అని మొక్కేవారు! నే నవునంటే అవును. కాదంటే కాదన్నట్లుగా వుండేది సంసారం. సబిన స్పెక్టర్లు కూడ ఆయమ్మ చెప్పాలి మేం వినాలనేవారు! అల్లాంటి మహారాజు భార్యనై బ్రతికానమ్మా! ఈనాటికి విలువ లేనిదానినై పోయాను!”

ముసలమ్మ అంది “అంతా కర్మ! మన చేతిలో ఏముందమ్మా? ముల్లుకి మొనలెవరు తీర్చారో ఆ తండ్రి ఇష్టం.” సుందరమ్మ మరికొస్త కలకలారవం హెచ్చించింది.

“నిజమే నమ్మా! బుద్ధి భూము లేలా లంటే కర్మ కావిడి మోయిస్తుందంటారు! వివా పెద్దలు చెప్పినమాట కాదన్నవాళ్లెవ్వరు బాగుపడ్డారు? ఈకాలం వాళ్ళకి ఎందుకు చెప్పారనైనా ఆలోచిస్తారా ఏమా?”

“నిజమేనమ్మా! మా మనవడు వద్దురా అంటే అతీ గతీ లేని పిల్లను చేసికుని యిప్పుడు నలుగురుపిల్లలుతో జీతం చాలక వేగిపోతున్నాడు! బంగారపు పళ్ళెం లాంటి దానికే గోడ చేరువు లేకపోతే లేదు. మీరే లేకపోతే వాళ్లు యింటినుంచి పొమ్మన్నందుకు మీ అల్లుడి గతి ఏమయ్యేది?”

“వాళ్ళు గతి లేని వాణ్ణి చేస్తే, నే చేస్తానా? అభిమానం యెవరికి వుందో కనిపిస్తోంది కదా!”

రామం యీ చివర మాటలతో వరండాలో కాఫీ త్రాగుతూ, ఆగ్లాసు అలానే వదలి మేడమీదకు విసవిస నడిచాడు. జానకి నిశ్చేష్టురాలై నిల్చుండిపోయింది. ఒక క్షణంపోయాక మేడమీదకు వెళ్లింది. రామం బట్టలన్నీ చిందరవందర చేసిపెట్టి, బెడ్డింగు సర్దుతున్నాడు. ముఖం బాగా కందిపోయి, జుత్తు ముఖం మీద పడి కోపంతో వణకిపోతూ భీభత్సంగా కనపడేసరికి జానకి కొయ్యబారిపోయింది.

“నీకు నాతో రావాలని వుంటేరా!” పెట్టె మూస్తూ అన్నాడు. జానకి శిలాప్రతిమలా నిలబడివుంది. వచ్చే కోపాన్ని అణచే ప్రయత్నంలో రామం పెదవులను పంటి కొనతో నొక్కుతూ, “మగదక్షత లేదని నన్నిచ్చుటకు తీసికునివచ్చి, ఉః చెప్పనీ- ఎందరితో మీ అమ్మ యిల్లాంటి కబుర్లు చెబుతుందో?”

తన పని ముగించి ముఖమెత్తి భార్య వంక చూచాడు. కన్నీరు మున్నీరుగా ధారలు చెక్కిళ్లపై నుండి ప్రవహిస్తున్నాయి. చేతిలోని పంచి విడచి నెమ్మదిగా లేచాడు. నిజానికి తనీ యింటికి అత్తగారు మగదక్షత లేదన్నదని రాలేదు. భద్రం వెళ్ళిపొమ్మనేవరకూ యీ యింటికి రావాలని అనుకోనే లేదు. తను ముహూర్తం నుంచీ ఆలోచన లేకుండానే తనీ యింటికి వచ్చాడు. ఈ నిజాన్ని మనస్సు మారుమూలల్లో మారుమ్రోగుతున్నా వినిపించుకోలేదు. చప్పున జ్ఞాపకానికి వచ్చింది. తన దెందుకు పెద్దగుండె కాకూడదూ? యీకోరికతో సంతృప్తి వహించి ముఖాన చిరునవ్వు వెలిగించాడు.

“భద్రం లేకపోతే పార్వతి లేదు; సుందరమ్మ లేకపోతే జానకి లేదు” తన మొదటి తీర్పు మళ్ళీ మనస్సులో పాతుకపోయింది.

ఆమె ముఖం రెండుచేతులతో యెత్తి కళ్ళల్లోకి చూశాడు. జానకి కళ్ళు తుడుచుకుంటూ ముఖం ప్రక్కకు త్రిప్పింది.

“ఈయిల్లు నాదేగా - నే నెక్కడికి వెళ్తాను!”

13

పది రోజులు గడిచాయి. సుందరమ్మ జానకిద్వారా యెన్నిసార్లో ఆస్తివిషయమై రామంకు చెప్పించింది. రామం మౌనాన్ని ప్రదర్శించాలని నిశ్చయించుకున్నా, భార్యకు ఆ విషయం యిక తనవద్ద యెత్త వద్దని చెప్పాడు. అమ్మ చెప్పిన విషయాలు, దానివల్ల కలిగే లాభాలు అన్నీ చిలకలా పలికింది. ప్రపంచధర్మాలు, సంఘంలో జరుగుతున్న న్యాయాన్యాయాలను గురించి కూడా అప్పచెప్పింది. రామం వీటన్నిటికి ఒక చిరునవ్వే సమాధానంగా యిచ్చేవాడు.

ఆరోజు ఆదివారం. ఇన్నాళ్ళు అల్లుడు మొండికెత్తి ప్రదర్శించిన మౌనాన్ని సహించగల పరిస్థితి దాటిపోయింది. ఎలా వెళ్ళి అడగడో చూద్దామన్న పంతం సుందరమ్మలో హెచ్చింది. ఆమె యిక మంచీ చెడ్డల విచక్షణాజ్ఞానాన్ని పూర్తిగా మరచి నోటికివచ్చిన మాటలను జారవిడువ ప్రారంభించింది. రామం విన్నా మళ్ళీ ధైర్యం తెచ్చుకుని నవ్వుకుంటున్నాడు. ఆరోజు సాయంత్రం రామం మేడ దిగి రాలేదు. జానకి మేడమీదకు కాఫీ తీసికొని వెళ్ళింది. కాఫీ త్రాగుతూ నెమ్మదిగా అన్నాడు.

“మీ అమ్మ నీచేత నే యిన్ని కబుర్లు పంపించింది కాబట్టి నా సమాధానం కూడ

★ గోడమీద బొమ్మ

నీతోనే చెప్పడం మంచిదిగా! నానోటితో ఆయన ఎదురుగా నిలబడి అడగలేను!"

కొంతసేపటివరకు జానకి మాట్లాడలేదు. నెమ్మదిగా చిన్నగొంతుతో అంది. "బాగా ఆలోచించండి. అమ్మ ఆలోచించకుండా ఏ పనీ చెయ్యదు. అమ్మ మన బాగుగురించే కదండీ చెప్తూంది! మీరిలా కాదంటే ఎలా?"

ఈ మాటలతో మనస్సులో కుపితుడైనా, పైకి నవ్వి "నాకు అందమైన పెళ్ళాం వుంది! నా కింకేం కావాలి?"

ఈ మాటల్లోని అంతరార్థం జానకి గ్రహించివుంటే చిరునగవు వెలిబుచ్చేది కాదు. అసలిలా వ్యంగ్యంగా మాట్లాడి ప్రయోజనం లేదని తరువాత అనుకున్నాడు. జానకి దగ్గరగా వచ్చి ముఖం ప్రక్కకు తిప్పి, "మీకు అంత గర్వంగా వుంటే నాకు మాత్రం లేదంటారా?"

"ఈ మొండి మీసాల మొగుడ్ని చూస్తేనే?"

"ఛా! ఏమిటండీ ఆ మోటు మాటలు!" అంటూ తన పొడుగుపాటి జడను భర్త భుజంపై వేసి, "మీరు నా ముఖం చూసయినా వెళ్ళి అడగండి! తరువాత వాళ్ళివ్వమంటే మన మేం చెయ్యగలం?"

"ఆయనఎదురుగా నిల్చోలేను. ఇక ఆయన్ని ఎట్లా అడిగేది? ఆపని జరిగేది కాదు."

"పోనీ మీ రడుగుతున్నట్లు అడగమంటారా?"

వెంటనే జవాబు రాలేదు. వద్దు అని తల వూపడం చూచి జానకి అక్కడనుంచి రొప్పుకుంటూ వెళ్ళిపోయింది.

అత్తగారి కర్కశమైన గొంతుక మేడమీదకు వినిపిస్తోంది. బట్టలు మార్చుకుని మేడ దిగుతూనే మెట్లమీద ఆగాడు. జానకి చేటతో బియ్యం తీసికొనివెళ్తూ, "అమ్మా! బియ్యం బాగులేవే!" అంది.

"ఇష్టమైనవాళ్ళు తింటారు. కష్టమైనవాళ్ళు మానేస్తారు. జైలులో కొనడానికి వందలు తెచ్చే జీతగాళ్ళెవరూ లేరు." సుందరమ్మ తన్ను చూశాకే యీ మాటలు అనటం రామం గమనించాడు. ఆ దిబ్బరొట్టెలాంటి ముఖం ముడుచుకొని కోపాన్నంతా ధుమధుమలాడుతూ వెళ్ళగక్కింది. రామం మాట్లాడకుండా తల వంచుకొని వీధిలోనికి వెళ్ళిపోయాడు.

తిరిగి వచ్చేసరికి రాత్రి యెనిమిది గంటలయింది. సుందరమ్మ చిన్నకొడుకు వీపు చరుసుచేసు. "[illegible] గం[illegible]కే నా మాటంటే ఖాతరులేదు. కొడుకును దబ్బున నేలమీద విడచి తల మొత్తుకుంటూ, "ఇదంతా నా కర్మ! అందర కందరూ ఒక్కటే. ఏమంటే నేనే చెడ్డదాన్ని."

రామంని పెద్దబావ మేడమీదకు వచ్చి భోజనానికి రమ్మని పిలిచాడు. క్రిందకు వెళ్ళేసరికి అత్తగారు ఆమె భర్తను తలచుకుని కలకలలాడుతూ కన్నీరు తెచ్చుకుంటోంది. ఇదివరలా జానకి భోజనం దగ్గర నిలబడలేదు. నాలుగు మెతుకులు కొరికి భోజనం అయిందనిపించాడు.

జానకి ఆరాత్రి భర్తతో మాట్లాడలేదు. రామం సగం రాత్రివరకు వాలుకుర్చీ మీదనే మేను వాల్చాడు. మనస్సు పరిపరి విధములుగా పోవటంవల్లను నిద్రపట్టక మబ్బులతో కూడిన ఆకాశమువంక చూస్తున్నాడు. జానకి తల్లిమాట కాదనలేదు. ఆమెను సంతృప్తిపరచాలంటే తను మావయ్యను ఆస్తివిషయం అడగాలి. తనెందుకు వెళ్ళి అడగకూడదూ? అడిగితే మళ్ళీ లోకం ఏమనుకొంటుంది? మామయ్య మనస్సులో మాత్రం ఏమనుకుంటారు? నేను యిచ్చేవరకైనా ఆగాడు కాదుకదా యని అనుకోరూ? చివరకి ఎన్నివిధాల మనస్సులో తర్కించుకున్నా ఒక్క నిర్ణయానికి రావడానికి చాల వ్యవధి పట్టింది. తన అత్తగారు, జానకి యెంత మురిడీపెట్టినా మౌనాన్ని ప్రదర్శించటమే వుత్తమమని నిర్ణయించుకున్నాడు. ఈ నిర్ణయానికి వచ్చేసరికి పండ్రెండుగంటలు దాటింది. ఇంతవరకూ నిజానికి జానకికూడ నిద్రపోలేదు.

తెల్లవారింది. కాలకృత్యాలు వేగంగా ముగించి ఎటు వేపైనా వెళ్ళాలని అనుకున్నాడు. కాఫీకి ఆలస్యంగా కబురు వచ్చింది. చిన్నబావ అమ్మ వూరకనే తన్ను కొట్టిందని రామానికి ఫిర్యాదు చేసుకున్నాడు. ఇంకో నాడైతే యీ కుర్రవాని లేతమనస్సు మాత్తేటట్లు ఓదార్చేవాడు. కాని యీనాడు వినిపించుకోనట్టే బావ వెంట రావటంతో బుచ్చిగాడు వెనుకకు తిరిగి వెంటవస్తున్న బావను చూశాడు. బావగారి ముఖంయిలా మాడివుండటం యిదివరకు తనెప్పుడు చూడలేదు.

ఆఫీసుకు వెళ్ళేటప్పుడు వంట గదివైపు చూశాడు. తన వైపు చూస్తున్న జానకి చప్పున ముఖం త్రిప్పివేసింది.

ఆఫీసు విడచినవంటనే యింటికి రాకండా సముద్రతీరాన్నో, రీడింగురూములోనో కూర్చుందామనుకున్నాడు. తనలో మార్పు తీసుకరాకూడదనుకుని [illegible]యాన్ని మళ్ళీ మార్చుకున్నా[illegible] నుండి వస్తున్నప్పుడు వెంకట్ర[illegible] క్షేత్రవిషయాలు చెప్పాడ[illegible] భద్రం దగ్గర డబ్బుదోచినట్లు [illegible] లున్నాయన్నాడు. అల్లుడి[illegible] నూట పదహార్లు కట్నంగా యిచ్చి[illegible] మంచి సంబంధం చూడండ[illegible] చాలమందితో చెప్పాడట! వెం[illegible] యీవిషయం చెప్పి చాలసే[illegible] కోవటం చూసి రామం నవ్వుకు[illegible] రెండవ విషయం, ముందురో[illegible] పార్వతి ఏడుపు మళ్ళా వినిపిం[illegible] భద్రం పసుబలం వుపయోగించివ[illegible] నొక్కి నొక్కి చెప్పాడు.

మనస్సు యీ మాటలు విన[illegible] పెట్టున బాధపడుతుంటే వెం[illegible] విడిపోతూ ప్రసన్నంగా [illegible] "నిన్న వుదయం మహారాణీపే[illegible] వెళ్తూ కొట్టు వైపు చూశానులే! దేవి బొమ్మకు వూదివత్తి వెలిగిం[illegible] తున్నాడు. దగ్గరకు వెళ్ళి మరీ [illegible] గ్రోతేవాడినే - కానీ వి[illegible] నాయందు అనుగ్రహం, దయ[illegible] అసలు యీ రోజుల్లో యీ భ[illegible] ర్యం చెప్పితే నీకూ కోపం వస్తుం[illegible]

రామం బదులు చెప్పే పరిస్థిత[illegible] వెంకట్రావు కునా యా[illegible] అన్నాడు. "భక్తి హెచ్చయిం[illegible] మరింత దోచడానికి సెటుకు[illegible] మాట! తింటున్నది గొడ్డుమాంసం[illegible] న్నది దేవతార్చన!"

రామం ఇంటికి వెళ్ళేసరికి యి[illegible] రాగాలు తీస్తున్నారు. జానకి అ[illegible] కుని ఎక్కడికో ప్రయాణానికి [illegible] ఇంతలో పొరుగు ముసలమ్మకూడ[illegible] రామం మేడమీదకు వెళ్ళి బట్టలు మ[illegible] చిన్నబావ మేడమీదకు వచ్చి [illegible] బావకు విన్నవించుకున్నాడు. అక్కయ్య సర్కసుకు వడతా[illegible]రట అన్నయ్యని తీసికెళ్ళరట." పిల్లల[illegible] వెళ్ళే యీ నునుషులమీద అ[illegible] టనే మాటాడలేకపోయాడు. అన్నాడు.

"నిన్నూ అన్నయ్యని [illegible] సర్కస్‌కి నేతీసికెళ్తాలే—వాళ్ళ[illegible] యిసికలో కూర్చుంటారు. మం[illegible] కూర్చుందాం!" చిన్నబావ [illegible] వేశాడు. బుచ్చిగాడు మెడదిగిన[illegible] పాలలోనే పెద్దబొబ్బలు పెట్ట[illegible]